ఈనాడు

THE LARGEST CIRCULATED TELUGU DAILY

కరీంనగర్ 11-8-2019 ఆదివారం సిటీ సంపుటి 46 సంచిక 2

రూ. 8-00. పేజీలు 14+16+32 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi

నమిలేస్తున్నాయ్!

- గుట్కా, పాన్ మసాలాలతో పెరిగిన నోటి, గొంతు క్యాన్సర్ కేసులు
- ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రికి రికార్డు స్థాయిలో రోగులు
- 30-40 ఏళ్ల మధ్య వయస్కులే ఎక్కువ శాతం
- పసలేని చట్టంతో విచ్చలవిడిగా విక్రయాలు

నోరు... గొంతు... అన్నవాహిక క్యాన్సర్ వంటి ప్రాణాంతక జబ్బులకు గుట్కాలు ప్రధాన కారణమని అందరికీ తెలుసు. వైద్యులూ ఘోషిస్తున్నారు. థియేటర్‌కు వెళ్తే సినిమా ప్రారంభానికి ముందు పొగాకు దుష్ఫలితాలను కళ్లకు కట్టినట్టు చూపిస్తున్నారు. పెద్దగా ఫలితం కనిపించడం లేదు. తాజాగా అనుభవం లోకి వస్తున్న విషయం యువత కూడా ఈ విష వలయంలో చిక్కుకొని విల విల్లాడుతోందని. చైతన్య కార్యక్రమాలతో మున్ముందు మార్పు సాధించవచ్చేమో కానీ ప్రస్తుతానికి మాత్రం పరిస్థితులు నిరాశాజనకం. ఆరోగ్యాన్ని హరిస్తున్న పొగాకు ఉత్పత్తులను మార్కెట్‌లో లేకుండా చేయడం మరో మార్గం. చట్టం కూడా ఉంది. ఈ సందేహాన్నే పోలీసు వర్గాల ముందుంచితే.. వచ్చిన సమాధానం 'అందులో ఏమాత్రం పస లేదండి' అని. ఉత్పత్తి, రవాణా కేంద్రాలుగా ఉన్న కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, బిహార్, మధ్యప్రదేశ్‌లు చట్టాన్ని పూర్తిగా గాలికొదిలేయడంతో మూలాల్లోకి వెళ్లలేకపోతున్నామనే అభిప్రాయాన్ని వ్యక్తీకరించారు.

...విపరాలు 2లో

2017-18లో హైదరాబాద్‌లోని ఎంఎన్‌జే ఆసుపత్రికి 4,635 మంది క్యాన్సర్ బాధితులు రాగా వారిలో నోరు, గొంతు క్యాన్సర్ రోగులు 1,104 మంది, ఊపిరితిత్తుల క్యాన్సర్ బాధితులు 652 మంది.

మళ్లీ సోనియా

కాంగ్రెస్ పార్టీ తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎంపిక

- సీడబ్ల్యూసీ నిర్ణయాన్ని వెల్లడించిన కేసీ వేణుగోపాల్
- అధ్యక్షుడిగా కొనసాగాలని తొలుత రాహుల్‌కు విజ్ఞప్తి
- అయిదు బృందాలను నియమించి నేత ఎంపికపై విస్తృత సంప్రదింపులు
- రెండోసారి భేటీలో సోనియా నేతృత్వంపై నిర్ణయం
- రాహుల్ రాజీనామాకు ఆమోదం

ఈనాడు, దిల్లీ: కాంగ్రెస్‌లో తలెత్తిన నాయకత్వ సమస్యకు తాత్కాలిక పరిష్కారం లభించింది. సోనియాగాంధీని అధ్యక్షురాలిగా సీడబ్ల్యూసీ ఎంపిక చేసింది. అధ్యక్ష పదవిలో కొనసాగేలా రాహుల్ గాంధీని ఒప్పించేందుకు ఆ పార్టీ అత్యున్నత విధాన నిర్ణయాక మండలి (సీడబ్ల్యూసీ) చేసిన చివరి విడత ప్రయత్నాలూ ఫలించలేదు. దీంతో రాహుల్ రాజీనామాను సీడబ్ల్యూసీ ఆమోదించక తప్పలేదు. నూతన నేత ఎంపికపై విస్తృత సంప్రదింపులు చేపట్టి ...మిగతా 2లో

సాగర్ నుంచి సాళ్లలోకి...

నేడు సాగర్ కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల

శ్రీశైలం పది గేట్ల నుంచి దిగువకు ప్రవాహం

నాగార్జున సాగర్‌కు 3.93 లక్షల క్యూసెక్కుల రాక

ఆలమట్టి వద్ద ఉగ్రరూపం దాల్చుతున్న కృష్ణానది 5లో

పల్లె పాలనకు పట్టం

- స్థానిక సంస్థలకు అధికారాలు బదిలీ చేస్తాం
- జడ్పీలు, మండలాలు, గ్రామాలకు నిధులు, విధులపై త్వరలో స్పష్టత
- అధ్యయనం, అభిప్రాయ సేకరణతో ముసాయిదా తయారీ
- సమగ్ర చర్చ అనంతరమే ఆమోదం
- ఆ తర్వాతే 60 రోజుల ప్రణాళిక అమలు
- పంచాయతీరాజ్ శాఖలో ఖాళీలన్నీ సత్వరమే భర్తీ
- సమీక్షలో ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

స్థానిక సంస్థలకు అధికారాలను బదలాయిస్తామని, నిధులు, విధులు, బాధ్యతలు అప్పగిస్తామని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలిపారు. గ్రామ పంచాయతీలు, జిల్లా పరిషత్‌లు, మండల పరిషత్‌లు ఉత్సవ విగ్రహాలుగా మిగలవద్దని ఆయన అభిప్రాయపడ్డారు. ఎవరు ఏ బాధ్యతలు నిర్వర్తించాలనే దానిపై త్వరలోనే స్పష్టత ఇస్తామని పేర్కొన్నారు. కొత్త పంచాయతీ రాజ్ చట్టం వెలుగులో పంచాయతీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసేందుకు అనుగుణంగా నిర్ణయాలుంటాయని తెలిపారు.. 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలవడానికి ముందే స్థానిక సంస్థల కార్యాచరణపై దిశానిర్దేశం చేస్తామన్నారు. ...మిగతా 2లో

ఇస్త్రీపెట్టెలో బంగారం

ఇస్త్రీపెట్టెల మాటున 9.21 కిలోల బంగారం తరలింపు

శంషాబాద్ విమానాశ్రయంలో పట్టివేత 3లో

తప్పుల తడక!

- భూ దస్త్రాల్లో ఇష్టారీతిన విస్తీర్ణాల నమోదు
- తక్కువ భూమి ఉన్న వారికి ఎక్కువ.. ఎక్కువ ఉన్న వారికి తక్కువ
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులు

5.39 ఎకరాల ఆసామి బుచ్చయ్య 87.28 ఎకరాల భూస్వామిగా మారారు. రంగారెడ్డి జిల్లా కేశంపేట మండలం నీనమోనిపల్లికి చెందిన ఆయనకు కొత్త పాసుపుస్తకంలో నమోదు చేసిన దానికి భిన్నంగా భారీ విస్తీర్ణాన్ని ఆన్‌లైన్ రికార్డుల్లో చేర్చారు. గతంలో రెండు దఫాలుగా రైతుబంధు సాయం పొందిన ఆయన మూడో దఫా రాకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. తన పేరున భారీ విస్తీర్ణం ఉండటంతో రైతుబంధు వర్తించదని అధికారులు చెప్పారు. దీంతో కంగుతిన్న బుచ్చయ్య.. విస్తీర్ణాన్ని సరిచేయాలంటూ రెవెన్యూ సిబ్బంది చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

ఉన్న భూమి కన్నా ఎక్కువ విస్తీర్ణం నమోదు చేసి మనోవేదనకు గురిచేశారంటూ నిజామాబాద్ జిల్లా కోటగిరి కొత్తపల్లి క్యాంపునకు చెందిన చెంచిరెడ్డి అనే రైతు చేసిన ఫిర్యాదు చర్చనీయాంశంగా మారింది. తనకున్న ఆరు ఎకరాల పదమూడున్నర గుంటలకు బదులు కొత్త పాసుపుస్తకంలో 1.09 ఎకరాలను అదనంగా చేర్చి ఏడు ఎకరాల ఇరవై రెండున్నర గుంటలుగా రాశారని తెలిపారు. తప్పిదాన్ని సరి చేయాలని ఏడాదిగా కోరుతున్నా అదనపు భూమికి రైతుబంధు డబ్బును వీఆర్వో తీసుకుంటూ తనను ఆవేదనకు గురిచేస్తున్నాడని ఆ రైతు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఈనాడు, హైదరాబాద్: రెవెన్యూ అధికారుల లీలలు ఒక్కటీ రెండూ కాదు. తరచి చూస్తే అనేక కోణాలు వెలుగుచూస్తున్నాయి. కొన్నిచోట్ల అర్హులైన వేలాది మంది రైతులకు పట్టా పాసుపుస్తకాలు ఇవ్వలేదు. మరికొన్నిచోట్ల అనర్హులకు అధిక విస్తీర్ణం రాసేసి భూస్వాములను చేశారు. లేనిది కలిపారు. ఉన్నది కోసేశారు. ముఖ్యమంత్రే స్వయంగా ఈ విషయాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రభుత్వం రెండేళ్ల క్రితం చేపట్టిన భూ దస్త్రాల ప్రక్షాళన కార్యక్రమాన్ని (ఎల్‌ఆర్‌యూపీ) క్షేత్రస్థాయి అధికారులు కొందరు తమకు అనుకూలంగా మలుచుకున్నారు. ప్రక్షాళనలో 72 లక్షల ఖాతాలకు సంబంధించిన దస్త్రాల నవీకరణ చేపట్టారు. 58 లక్షల ఖాతాలకు పాసుపుస్తకాలు జారీ చేసేందుకు నిర్ణయించారు. పాసుపుస్తకాల పంపిణీలో లక్ష్యాన్ని సమీపించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం రైతులు పుస్తకాలు అందక కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

పుస్తకాల్లో తప్పుల కుప్పలు

ప్రభుత్వం అర్హులైన రైతులకు పూర్తిస్థాయి యాజమాన్య హక్కులు కల్పించే ...మిగతా 2లో

పప్పుల తిప్పలు

- కిలో ధర రూ.95 నుంచి 100
- 3 నెలల్లో రూ.20కి పైగా పెరుగుదల

- దిగుమతుల ఆలస్యంతో దేశీయ మార్కెట్‌పై ప్రభావం
- మార్క్‌ఫెడ్ వద్ద 2.72 లక్షల క్వింటాళ్ల నిల్వలు
- మార్కెట్‌లో అమ్మేందుకు సిద్ధమవుతున్న సమాఖ్య

ఈనాడు - హైదరాబాద్

పంటింట్లో పప్పులు ఉడకటం లేదు.. ధరలు పైపైకి ఎగబాకడమే ఇందుకు కారణం.. మూడు నెలల పరకు స్థిరంగా ఉన్న ధరలు మెల్లగా పెరగడం మొదలుపెట్టాయి. కందిపప్పు, మినప్పప్పు ధరలు రూ.100కి చేరువలో ఉన్నాయి. సగటు వినియోగదారుడు వీటిని కొనాలంటే బెంబేలెత్తుతున్నాడు. నగరాలు, పట్టణాలు, పల్లెల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడం, దిగుమతుల్లో జాప్యం.. వంటి కారణాలు ధరల పెరుగుదలకు కారణమయ్యాయి. పండుగల సీజన్ సమీపిస్తుండటంతో సామాన్య ప్రజల్లో ఆందోళన నెలకొంది. ...విపరాలు 3లో

దేశంలో కంది పంట దిగుబడి (లక్షల టన్నులు)

2014-15	2015-16
28.10	25.60
2016-17	2017-18
48.70	42.90
2018-19	36.80

హరిత తెలంగాణ

అడవుల విస్తీర్ణం పెరుగుదలలో మన రాష్ట్రానిది ఐదో స్థానం

పెద్ద రాష్ట్రాల్లో 10-27 శాతమే

కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నివేదిక స్పష్టీకరణ 3లో

సాధారణ స్థితి దిశగా కశ్మీర్

అయిదు జిల్లాల్లో 144 సెక్షన్ ఎత్తివేత

వాహనాల రాకపోకల పునరుద్ధరణ

అనంతనాగ్‌లో డోభాల్ పర్యటన

బస్సు.. రైలు సర్వీసుల రద్దు? 14లో

ప్రాణాలు నమిలేస్తున్నాయ్!

ఈనాడు - హైదరాబాద్

పొగాకు దుష్ఫలితాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. హైదరాబాద్‌లోని ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఎంఎన్‌జేలో నమోదవుతున్న గణాంకాల్లో ఇది ప్రస్ఫుటమవుతోంది. గతంలో ఎక్కువ శాతం గర్భాశయ ముఖద్వార, రొమ్ము క్యాన్సర్లతో వచ్చేవారు. ఇప్పుడు నోటి క్యాన్సర్లు వాటికంటే ఎక్కువవుతున్నాయి. 60 శాతం మంది వ్యాధి 3, 4 దశల్లో ఉన్నప్పుడు సంప్రదిస్తున్నారని వైద్యులు చెబుతున్నారు. బాధితుల్లో యువత అధికంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఇందులో అటు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం నుంచి తెలంగాణలో ఆదిలాబాద్ వరకు అన్ని ప్రాంతాలకు చెందినవారు ఉన్నారు.

నిషేధించిన పొగాకు ఉత్పత్తులు

ఎక్కడ కావాలంటే అక్కడే

చాలా పాన్ షాపుల్లో నిషేధించిన పొగాకు ఉత్పత్తులు బహిరంగంగా వేలాడదీసి కనిపిస్తున్నాయి. మరికొందరు పైన కిళ్లీలు.. కింద గుట్కాలు ఉంచి కొంచెం గుట్టుగా వ్యాపారం చేస్తున్నారు. వివిధ విద్యా సంస్థల వద్ద షాపుల్లో కూడా ఇవి విచ్చలవిడిగా లభ్యమవుతున్నాయి. చిన్నచిన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోనూ అదే పరిస్థితి. వీటి మత్తుకు చిన్న వయస్సులోనే ఎంతోమంది బానిసలుగా మారుతున్నారు. గతంలో డీసీఎంల్లో తరలిస్తున్న గుట్కా బస్తాలను హైదరాబాద్‌లో పోలీసులు స్వాధీనం చేసుకోగా అవి కర్ణాటకలోని గుల్బర్గ తయారీ కేంద్రం నుంచి తరలిస్తున్నట్లు తేలింది. లారీలు, డీసీఎంల్లో తరలించి రాజేంద్రనగర్, బండ్లగూడల్లో డంపు చేసి నగరంతో పాటు తెలంగాణ, ఏపీలోని వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. 20 గుట్కా ప్యాకెట్లను రూ.90కి కొనుగోలు చేసి రిటైల్‌గా రూ.300-400 వరకు విక్రయిస్తున్నారు.

కొన్నాళ్లు నమిలి మానేసినా

వ్యాధి వచ్చే అవకాశం

అల్పాదాయవర్గాలు ఎక్కువగా గుట్కాల వంటి పొగాకు ఉత్పత్తుల బారిన పడుతున్నారు. తొలుత సరదాగా అలవాటు చేసుకొని బానిసలుగా మారుతున్నారు. నోట్లో వేసుకోవడం వల్ల కొద్ది సేపటికి మత్తులోకి జారుకుంటారు. అది మెదడును ఉత్సాహపరిచిన భావన కలిగిస్తుంది. అది కొద్ది సమయమే. మళ్లీ గుట్కా నమలాలనే కోరిక పుడుతుంది. లక్షణాలు ఆరంభమైన ఆరు నెలల నుంచి రెండేళ్లలోపు నోటి, గొంతు క్యాన్సర్లుగా రూపాంతరం చెందుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కొన్నాళ్లు నమిలిన తర్వాత మానేసినా వ్యాధి వచ్చే అవకాశం ఉందని, ప్రతి ఆరు నెలలకు ఒకసారి పరీక్షలు చేయించుకోవడం మంచిదని వైద్యులు సూచిస్తున్నారు.

చట్టం అత్యంత బలహీనం..

వందప్యాకెట్ల గుట్కాను పట్టుకున్నా... వెయ్యి కిలోల గుట్కా తయారీదారుడిని పట్టుకున్నా కోర్టులో హాజరుపరిచాక నిందితులకు ఆరు నెలల జైలు శిక్ష, వెయ్యి రూపాయల జరిమానా విధిస్తున్నారు. ఇది కూడా గరిష్ఠం. దీంతో కొందరు వ్యాపారులు జైలుకు వెళ్లిన 48 గంటల్లోపే బెయిల్‌పై బయటకు వస్తున్నారు. మళ్లీ, మళ్లీ గుట్కాను తయారు చేస్తున్నారు.. విక్రయిస్తున్నారు.

కొన్ని ప్రత్యక్ష దృష్టాంతాలు

- యాదగిరిగుట్టకు చెందిన శ్రీనివాస్(48)కు తన 27వ ఏట నుంచే గుట్కా నమలడం అలవాటు. కొన్ని రోజుల తర్వాత నాలిక పుండు పడింది. క్రమేపీ పెద్దదైంది. ఎంఎన్‌జే ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు నోటి క్యాన్సర్ మూడో దశలో ఉందని గుర్తించి శస్త్రచికిత్స చేశారు.
- నార్కెట్‌పల్లికి చెందిన ఆండాల్(48) రోజూ ఆరేడు పాన్‌లు నమిలేవారు. 30వ ఏట అలవాటైంది. మూడు నెలల నుంచి నోరు తెరవడం కష్టమైంది. వైద్యులను సంప్రదించగా క్యాన్సర్ మూడో దశలో ఉన్నట్లు తెలిపారు.
- బిహార్‌కు చెందిన అఖిల్(21) హైదరాబాద్‌లో ఉంటూ ఓ గుత్తేదారు వద్ద కూలీగా పనిచేస్తున్నాడు. రెండేళ్ల నుంచి గుట్కా నమలడం అలవాటు. మూడు నెలల క్రితం నోట్లో అల్సర్ వచ్చింది. పట్టించుకోకుండా వదిలేయడం వల్ల అది పెద్దదిగా మారి రక్తం కారుతుండటంతో ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో చేరాడు. నోటి క్యాన్సర్ రెండో దశలో ఉన్నట్లు గుర్తించారు.



పెనుముప్పుగా మారుతోంది

నోటి క్యాన్సర్ పెనుముప్పుగా మారుతోంది. 2017-18లో రికార్డు స్థాయిలో కేసులు నమోదయ్యాయి. ఇక ప్రైవేటు ఆసుపత్రుల్లో సంఖ్య తీసుకుంటే ఇంకా ఎక్కువే ఉంటుంది. అవగాహన లేక చాలామంది బాగా ముదిరిన తర్వాత వైద్యుల వద్దకు వస్తున్నారు. అది క్యాన్సర్ గడ్డ అని మేము చెప్పే వరకు వారికి తెలియడంలేదు. తక్షణం గుట్కా, పాన్ మసాలాలు, ఖైనీ, జర్దాల వంటి అమ్మకాలపై ఉక్కుపాదం మోపాలి. ఏదైనా పిప్పి పన్ను సమస్య వేధిస్తుంటే వెంటనే దంత వైద్యుని వద్దకు వెళ్లి చికిత్స చేయించుకోవాలి. లేదంటే అదే పుండుగా మారి చివరికి నోటి క్యాన్సర్‌కు దారి తీస్తుంది. **- డాక్టర్ జయలత, డైరెక్టర్, ఎంఎన్‌జే ఆసుపత్రి**

ఈ క్యాన్సర్లకు ప్రధాన కారణం...
- గుట్కా
- తంబాకు
- జర్దా
- పాన్ మసాలా
- సిగరెట్, బీడీ
- అడ్డ పొగతాగడం
- పొగాకు నోట్లో పెట్టుకోవడం

పింగళి కృషి - మువ్వన్నెల జెండా

1921 మార్చి చివర్లో అఖిల భారత కాంగ్రెస్ సంఘం సమావేశాలు బెజవాడలో జరిగాయి. ఆ సమావేశాల్లోనే పింగళి వెంకయ్య గాంధీజీకి జాతీయ పతాకం నమూనా తయారుచేసి ఇచ్చారు. దీని గురించి 13-4-1921 'యంగ్ ఇండియా'లో గాంధీజీ ప్రత్యేకంగా వ్యాసం రాశారు. దానిలోని విశేషాలు...

"ప్రతి జాతికీ ఒక జెండా ఉండటం అవసరం. ఇది ఒకరకంగా విగ్రహారాధన లాంటిదే కావొచ్చుగానీ జెండా ఒక ఆదర్శాన్ని ప్రతిబింబిస్తుంది. ఉదాహరణకు 'యూనియన్ జాక్' ఆవిష్కరణ ఇంగ్లిషువారి హృదయాల్లో ఉత్సాహపూరిత భావాలను రేకెత్తిస్తుంది. ఆ భావాల బలాన్ని అంచనా వేయటం చాలా కష్టం. అలాగే 'నక్షత్రం-గీతల' జెండానే అమెరికన్లకు ఓ పెద్ద ప్రపంచం. మన దేశంలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు, పార్శీల వంటి వారు ఎంతో మంది ఉన్నారు. వీరందరికీ ఇదే మాతృదేశం. అందరికీ ప్రాణ సమానమైన జెండా ఒకటి ఉండాలి. మచిలీపట్టణంలోని ఆంధ్ర జాతీయ కళాశాలకు చెందిన శ్రీ పింగళి వెంకయ్య ఇతర దేశాల పతాకాల వివరాలన్నింటినీ సేకరించి, వాటితోపాటు భారతీయ జాతీయ పతాకానికి కూడా కొన్ని నమూనాలు సూచిస్తూ ఒక చిన్న పుస్తకాన్ని ప్రచురించారు. దీని గురించి ఆయన కొన్నేళ్లపాటు ప్రచారం చేశారు. గత నాలుగు ఏళ్లుగా ప్రతి కాంగ్రెస్ సభలోనూ పట్టుదలగా జాతీయ జెండా గురించి ఆయన చేసిన కృషిని శ్లాఘించక తప్పదు. అయితే ఆయన నమూనాలు జాతిని అట్టడుగు నుంచి ఉత్సాహపరచలేవేమోనన్న సంశయం నన్ను పీడిస్తుండేది. జలంధర్‌కు చెందిన లాలా హంసరాజ్- జెండాలో రాట్నం కూడా ఉండాలన్న సూచన చేయటం నన్ను ఆకర్షించింది. దీంతో హిందువుల రంగు అయిన ఎరుపు, ముస్లింల రంగు అయిన ఆకుపచ్చ, రాట్నం బొమ్మ ఉండేలా జెండాను చిత్రించితే బాగుంటుందని వెంకయ్యకు సూచించాను. ఆయన ఎంతో ఉత్సాహంగా మూడు గంటల్లోనే నాకా జెండా అందించారు. మరికొంత ఆలోచించిన తర్వాత హిందూ మహమ్మదీయ సఖ్యతతో పాటు అన్ని మతాల వారి సంఘీభావాన్ని సూచించేలా పవిత్రతకూ, శాంతికీ చిహ్నమైన తెలుపు కూడా ఉండాలనీ, అన్ని మతాలవారూ సమానులే అనడానికి గుర్తుగా మూడు రంగులూ సమానంగా ఉండాలని భావించాము. అలాగే మనం వస్త్రాలకోసం విదేశాలపైన ఆధారపడకూడదు. కనుక మన జెండా ముతక ఖద్దరులోనే ఉండాలని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు. జెండాపై పట్టుదలగా కృషి చేసిన ఘనత వెంకయ్యకు దక్కుతుంది"

- మహాత్మా గాంధీ

మళ్లీ సోనియా

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ

(మొదటి పేజీ తరువాయి)

నివేదికలను సేకరించిన సీడబ్ల్యూసీ సోనియా గాంధీ వైపే మొగ్గుచూపింది. దాదాపు 20 నెలల తర్వాత ఆమె పార్టీ పగ్గాలను తిరిగి చేపట్టనున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో సోనియాను మించిన నాయకత్వం కనిపించని కారణంగా ఆమెను తాత్కాలికంగా అధ్యక్ష పదవికి ఎన్నుకున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శనివారం రాత్రి జరిగిన విలేకర్ల సమావేశంలో వెల్లడించారు. ఏఐసీసీ సమావేశాల్లో అధికారికంగా కొత్త అధ్యక్షుడిని ఎన్నుకొనేంత వరకూ ఆమే ఈ పదవిలో కొనసాగుతారని ప్రకటించారు. తమ కుటుంబేతరులనే అధ్యక్ష పదవికి ఎన్నుకోవాలన్న రాహుల్ సూచనను ప్రస్తుతానికి సీడబ్ల్యూసీ పక్కన పెట్టింది.

రాహులే అధ్యక్షుడిగా ఉండాలని..

సార్వత్రిక ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ రాహుల్‌గాంధీ అధ్యక్ష పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో నూతన నేతను ఎన్నుకొనేందుకు శనివారం ఉదయం పార్టీ ప్రధాన కార్యాలయంలో సీడబ్ల్యూసీ తొలుత భేటీ అయ్యింది. ఈ భేటీలో ఏఐసీసీ కార్యదర్శులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ ఎంపీలు కూడా పాల్గొన్నారు. సమావేశం ప్రారంభంలోనే పలువురు కాంగ్రెస్ నేతలు పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని రాహుల్‌కు విజ్ఞప్తి చేశారు. వారి అభ్యర్థనను రాహుల్ నిర్ద్వంద్వంగా తిరస్కరించారు. రాజీనామాను వెనక్కు తీసుకొనేదిలేదని స్పష్టంచేశారు. అధ్యక్షుడిగా ఆయన కొనసాగకపోతే పార్టీని వీడిపోయే వారి సంఖ్య అధికమవుతుందని, పార్టీని నడిపించేలా రాహుల్‌ను ఒప్పించాలని కొందరు నేతలు ప్రియాంకా గాంధీని కూడా కోరారు. ఈ ప్రయత్నాలేవీ ఫలించకపోవటంతో రాహుల్ వారసుడిని ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా సీడబ్ల్యూసీ సభ్యులతో అయిదు ప్రాంతీయ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీల నివేదికలను పరిశీలించేందుకు సీడబ్ల్యూసీ తిరిగి రాత్రి 8 గంటలకు సమావేశమవ్వాలని నిర్ణయించారు.

కమిటీల్లో తమ పేర్లపై అభ్యంతరం

సంప్రదింపుల కోసం నియమించిన అయిదు కమిటీల్లో తమ పేర్లను చేర్చటంపై సోనియా, రాహుల్ అభ్యంతరం తెలిపారు. ఈ కమిటీల్లో కొనసాగేందుకు నిరాకరించి సమావేశం నుంచి వెలుపలకు వచ్చేశారు. దీనిపై విలేకరులు అడిగిన ప్రశ్నకు సోనియా బదులిస్తూ..."మేమిద్దరం పార్టీ అధ్యక్షులుగా పనిచేసినందున ఆ సంప్రదింపుల్లో భాగస్వాములం కావటం సరికాదు. మా పేర్లను కమిటీల్లో చేర్చటం పొరపాటు. మేము సభ్యులుగా ఉంటే తదుపరి అధ్యక్షుడి ఎన్నికను ప్రభావితం చేసినట్లవుతుంది" అని చెప్పారు.

అయిదు బృందాలు.. సంప్రదింపులు..

సీడబ్ల్యూసీ సభ్యులు అయిదు బృందాలుగా విడిపోయి సమావేశానికి రాలేకపోయిన, దేశవ్యాప్తంగా ఉన్న కాంగ్రెస్ నేతలతోనూ సంప్రదింపులు జరిపారు. పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎవరుండాలనే అంశంపై అభిప్రాయాలను సేకరించారు. ఈశాన్య ప్రాంత బృందంలో అహ్మద్ పటేల్, అంబికాసోని, ఉత్తరాఖండ్ మాజీ సీఎం హరీశ్‌రావత్; తూర్పు ప్రాంత బృందంలో ఏఐసీసీ ప్రధానకార్యదర్శి కె.సి.వేణుగోపాల్, అసోం మాజీ ముఖ్యమంత్రి తరుణ్ గొగొయి, కేంద్ర మాజీ మంత్రి కుమారి సెల్జా; ఉత్తర ప్రాంత బృందంలో ప్రియాంకా గాంధీ, జ్యోతిరాదిత్య సింధియా, పి.చిదంబరం; పశ్చిమ ప్రాంత బృందంలో గులాం నబీ ఆజాద్, మల్లికార్జున్ ఖర్గే, ఎ.కె.ఆంటోనీ, మోతీలాల్ వోరా; దక్షిణ ప్రాంత బృందంలో మన్మోహన్ సింగ్, ఆనంద్ శర్మ, ముకుల్ వాస్నిక్ సభ్యులు. ఈ బృందాలు తమ నివేదికను సీడబ్ల్యూసీకి శనివారం రాత్రి సమర్పించాయి. రాత్రి 8 గంటల తర్వాత రెండోసారి భేటీ అయిన సీడబ్ల్యూసీ పార్టీ అధ్యక్షురాలిగా సోనియాను ఎన్నుకొంది. ఈ నివేదికల్లోనూ అత్యధికులు రాహుల్ గాంధీయే పార్టీ అధ్యక్షుడిగా కొనసాగాలని అభిప్రాయపడినట్లు సమాచారం. అందుకు రాహుల్ సిద్ధంగా లేకపోవటంతో సోనియాకు ఎన్నుకున్నారు.

మూడు తీర్మానాలు

తాజా సీడబ్ల్యూసీలో మొత్తం మూడు తీర్మానాలు చేశారు. 1.రాహుల్‌గాంధీ పార్టీ అధ్యక్షుడిగా అందించిన సేవలను శ్లాఘించింది. 2. రాహుల్‌గాంధీ రాజీనామాను ఆమోదించి సోనియాగాంధీని తాత్కాలిక అధ్యక్షురాలిగా ఎన్నుకొంది. 3.జమ్మూ-కశ్మీర్‌లో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులపై ఆందోళన వ్యక్తంచేసింది. మరీ ముఖ్యంగా మీడియాను నియంత్రించడాన్ని ఖండించింది.

కశ్మీర్‌లో పరిస్థితిని ప్రధాని వివరించాలి: రాహుల్

జమ్మూ-కశ్మీర్‌లో హింసాత్మక ఘటనలు జరిగినట్లుగా వార్తలు వస్తున్నాయని, అసలు అక్కడ వాస్తవ పరిస్థితి ఏమిటో ప్రధాన మంత్రి మోదీ వెల్లడించాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. సీడబ్ల్యూసీ సమావేశం మధ్యలో అధ్యక్ష ఎన్నికపై చర్చను నిలిపేసి జమ్మూ-కశ్మీర్ పరిస్థితులపై చర్చించినట్లు రాహుల్ విలేకర్లకు తెలిపారు.

క్రీడాకారుడి ఘనకార్యం

ఆస్ట్రియా క్రీడాకారుడు జోసెఫ్ కొబెర్ల్ ఈయన. ఆస్ట్రియా రాజధాని వియన్నాలో శనివారం ఇలా మంచు గడ్డలతో నిండిన పెట్టెలో ఒంటిమీద దుస్తులు లేకుండా 2 గంటల 8 నిమిషాల 47 సెకన్లు కూర్చుని సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఇప్పటి వరకు ఈ రికార్డు సమయం గంటా 53 నిమిషాల పది సెకన్లు మాత్రమే.

'370'పై బ్రిటన్‌లో నిరసనలు

లండన్: గతంలో జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన 370 అధికరణాన్ని అచేతనం చేస్తూ భారత సర్కారు ఇటీవల తీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా బ్రిటన్‌లోని కశ్మీరీలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. 'కశ్మీరులో హత్యలను ఆపండి' అని నినాదాలు రాసిన బ్యానర్లు పట్టుకుని వారంతా బ్రిమింగ్‌హామ్‌లోని భారత దౌత్య కార్యాలయం వెలుపల శుక్రవారం ప్రదర్శన నిర్వహించారు. 'తెహ్రీక్ -ఎ- కశ్మీర్' సంస్థ ఆధ్వర్యంలో ఈ నిరసన ప్రదర్శన జరిగింది. మరోవైపు బ్రిటన్ విపక్ష లేబర్ పార్టీకి చెందిన ముస్లిం ఎంపీలు దేశ ప్రధాని బోరిస్ జాన్సన్‌కు ఈ అంశంపై లేఖలు రాశారు.

పల్లె పాలనకు పట్టం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామ కార్యదర్శులు మొదలుకొని జడ్పీ సీఈవోల వరకు.. పంచాయతీరాజ్ శాఖలో ఉన్న ఖాళీలన్నింటినీ సత్వరమే భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. గ్రామాలు, పట్టణాల్లో పచ్చదనం పెంచే కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి కలెక్టర్ అధ్యక్షతన జిల్లా స్థాయి హరితకమిటీలను నియమిస్తున్నట్లు వెల్లడించారు. పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం ప్రగతిభవన్‌లో సమీక్ష నిర్వహించారు. మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, జగదీశ్‌రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ జోషి, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వికాస్ రాజ్, కమిషనర్ నీతూప్రసాద్, సీఎంఓ కార్యదర్శులు స్మితా సబర్వాల్, భూపాల్‌రెడ్డి, ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, ఎంపీ బండా ప్రకాశ్, ఎమ్మెల్యేలు మర్రి జనార్దన్‌రెడ్డి, కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, తేరా చిన్నపరెడ్డి, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య, గట్టు రామచందర్‌రావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడారు. "పల్లెల రూపురేఖలు మార్చడం కోసం కొత్త పంచాయతీరాజ్ చట్టం తెచ్చాం. ప్రజాప్రతినిధులు, అధికారుల బాధ్యతలు స్పష్టంగా నిర్వచించాం. ఇప్పుడు ప్రభుత్వం స్థానిక సంస్థలకు అధికారాలను బదిలీ చేయాలని నిర్ణయించింది. సహాయ మంత్రి హోదా కలిగిన జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ కూడా ఏ పనీ లేకుండా ఉండటం సమంజసం కాదు. ప్రజలతో ఎన్నికయిన ఎంపీపీలు, జడ్పీటీసీలదీ ఇదే కథ. భవిష్యత్తులో ఇలా జరగడానికి వీల్లేదు. స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిగా పాలనలో భాగస్వామ్యం కావాలి. విద్య, వైద్యం, పచ్చదనం, పారిశుద్ధ్యం.. ఇలా ఏ విషయంలో ఎవరి పాత్ర ఎంత అనేది నిర్ధారిస్తాం. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు ఏమేం చేయాలి? అనే విషయాలపై పూర్తి స్పష్టత ఇస్తాం. త్వరలోనే కేంద్ర ఆర్థిక సంఘం నిధులు కూడా వస్తాయి. దానికి సమానంగా రాష్ట్ర వాటా కేటాయిస్తాం. ఆ నిధులను స్థానిక సంస్థలకు విడుదల చేస్తాం. విధులను స్పష్టంగా పేర్కొని నిధులు విడుదల చేసిన తర్వాతే గ్రామాల్లో 60 రోజుల ప్రణాళిక ప్రారంభిస్తాం" అని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పారు.

ప్రగతిభవన్‌లో నిర్వహించిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. పాల్గొన్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు. సీఎస్ ఎస్కే జోషి, ప్రభుత్వ ముఖ్యసలహాదారు రాజీవ్‌శర్మ, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, మాజీ మంత్రి బస్వరాజు సారయ్య తదితరులు

విస్తృత చర్చలు, అధ్యయనం

గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లు ఏ విధులు నిర్వర్తించాలి? ఏయే అంశాల్లో వారి బాధ్యతలు ఎంతవరకుంటాయి? ఎలాంటి అధికారాలుంటాయి? తదితర విషయాలపై సమగ్ర చర్చ, పూర్తి స్థాయి అధ్యయనం జరుపుతాం. పంచాయతీ రాజ్ విభాగంలో పనిచేసిన అనుభవం కలిగిన నాయకులు, అధికారులు, విషయ నిపుణులతో విస్తృతంగా చర్చించి ముసాయిదా రూపొందిస్తాం. ముసాయిదాపై ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో చర్చిస్తాం, ఆ తర్వాత మంత్రివర్గ సమావేశంలో, చివరికి అసెంబ్లీలో కూడా విస్తృతంగా చర్చిస్తాం. ఆయా సందర్భాల్లో వచ్చిన సూచనలు, సలహాలను కూడా తీసుకుని, విధులు, నిధులు, బాధ్యతలు, అధికారాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేస్తాం. ఇదంతా జరిగిన తర్వాత, పురపాలక ఎన్నికలు కూడా ముగిసిన తర్వాత గ్రామాల్లో, పట్టణాల్లో 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేస్తాం" అని సీఎం చెప్పారు.

ఖాళీలు ఉండొద్దు

పంచాయతీ కార్యదర్శి నుంచి జిల్లా పరిషత్ సీఈవో వరకు అన్ని ఖాళీలను భర్తీ చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ మంత్రి దయాకర్‌రావును, అధికారులను ఆదేశించారు. "గ్రామ కార్యదర్శులు, మండల పరిషత్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, డివిజనల్ పంచాయతీ అధికారులు, డిప్యూటీ సీఈవోలు, డీపీవోలు, సీఈవోలు ఇలా అన్ని విభాగాల్లో అవసరమైన వారికి పదోన్నతులు కల్పిస్తూ ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి. పంచాయతీ కార్యదర్శుల ఎంపికకు నేరుగా నియామకాలు జరపాలి. ఈవోపీఆర్డీ పోస్టులను ఇకపై మండల పరిషత్ అధికారులుగా పరిగణిస్తాం' అని సీఎం వెల్లడించారు.

ఆనకట్టలు, పంపుహౌస్‌లకు అమ్మవార్ల పేర్లు

కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని బ్యారేజీ (ఆనకట్ట)లు, పంపుహౌస్‌లకు దేవతామూర్తుల పేర్లను ఖరారు చేస్తూ ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు పేర్లు ప్రకటించారు. మేడిగడ్డ బ్యారేజీకి లక్ష్మీ బ్యారేజీగా, కన్నెపల్లి పంపుహౌస్‌కు లక్ష్మి పంపుహౌస్‌గా పేరు పెట్టారు. అన్నారం బ్యారేజీకి సరస్వతి బ్యారేజీగా, సిరిపురం పంపుహౌస్‌కు సరస్వతి పంపుహౌస్‌గా నామకరణం చేశారు. సుందిళ్ల బ్యారేజీకి పార్వతి బ్యారేజీ, గోలివాడ పంపుహౌస్‌ను పార్వతి పంపుహౌస్‌గా మార్చారు. నంది మేడారం రిజర్వాయర్, పంపుహౌస్‌కు నంది పేరు ఖరారు చేశారు. లక్ష్మీపురం పంపుహౌస్‌కు గాయత్రి పేరు పెట్టారు.

నేపాల్‌లో ఇటీవల కనుగొన్న 'కాజిన్ సరా' సరస్సు ప్రపంచంలోనే అత్యంత ఎత్తున ఉన్న తటాకంగా సరికొత్త రికార్డును సృష్టించే అవకాశం ఉంది. నేపాల్‌లోని మనాంగ్ జిల్లాలో హిమాలయాల్లోని అన్నపూర్ణ మంచుపర్వత శ్రేణుల్లో అలరారుతున్న ఈ సరస్సును కొద్దినెలల క్రితం ఓ పర్వతారోహకుల బృందం కనుగొంది.

గ్రహం అనుగ్రహం

11-8-2019 ఆదివారం

శ్రీ వికారి నామ సం॥రం॥ దక్షిణాయనం
వర్ష రుతువు; శ్రావణ మాసం; శుక్ల పక్షం
ఏకాదశి: మ.12-52 తదుపరి ద్వాదశి
మూల నక్షత్రం: తె.3-08 తదుపరి పూర్వాషాఢ
అమృతఘడియలు: రా.8-34 నుంచి 10-12 వరకు
వర్జ్యం: ఉ.10-43 నుంచి 12-21 వరకు
తిరిగి రా.1-29 నుంచి 3-08 వరకు
దుర్ముహూర్తం: సా.4-41 నుంచి 5-35 వరకు
రాహుకాలం: సా.4-30 నుంచి 6-00 వరకు
సూర్యోదయం: ఉ.5-45; సూర్యాస్తమయం: సా.6.26

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
తిరుపతి	38.5	28.9
గుంటూరు	35.8	27.8
విశాఖపట్నం	35.8	25.0
విజయవాడ	35.6	30.0
హన్మకొండ	35.2	26.8
ఖమ్మం	35.0	26.0
సూర్యాపేట	34.0	28.5
రామగుండం	34.0	25.2
నల్గొండ	34.0	24.2
కరీంనగర్	33.0	26.0
హైదరాబాద్	31.5	24.2
నిజామాబాద్	31.0	24.8
మెదక్	31.0	22.0
ఆదిలాబాద్	30.3	24.7
మహబూబ్‌నగర్	30.0	23.6

తప్పుల తడక!

(మొదటి పేజీ తరువాయి)

ఉద్దేశంతో కొత్తపాసుపుస్తకాల జారీని ప్రారంభించగా కొందరు అధికారుల తప్పిదాలతో పుస్తకాల్లో తప్పులు నమోదు అయ్యాయి. పుస్తకాలను రైతులకు చేర్చక ముందే తప్పులను గుర్తించాల్సి ఉన్నా ఈ ప్రక్రియ చేపట్టకుండానే జారీ చేశారు. తర్వాత రైతులు లబోదిబోమనడంతో అధికారులు సరిదిద్దే పనికి పూనుకున్నారు. ఇప్పటికీ క్షేత్రస్థాయిలో అన్నదాతల వద్ద ఉన్న పుస్తకాల్లో పెద్ద ఎత్తున తప్పులు ఉన్నాయి. కొందరు రైతులకు సంబంధించిన సర్వే నంబర్లు ఇప్పటికీ వెబ్‌పోర్టల్‌లో కనిపించడం లేదు.

ఇలా వేస్తే మేలు..

- జారీచేసిన పుస్తకాల సమాచారాన్ని రైతుల వారీగా ప్రభుత్వ వెబ్‌సైట్ ద్వారా అందుబాటులోకి తీసుకురావాలి.
- రాష్ట్ర స్థాయిలో పుస్తకాలు జారీ చేసినా జిల్లాలు, మండలాల్లో రైతులకు అందని పరిస్థితులు పెద్ద ఎత్తున ఉన్నాయి.
- మండలాల్లో రైతులకు ఎందుకు పుస్తకాలు జారీ చేయలేకపోతున్నారు, ఎప్పుడు పంపిణీ చేస్తారనేది లిఖితపూర్వకంగా తెలియజేయాలి.
- కొందరు సిబ్బంది, అధికారులు అనధికారిక వసూళ్లకు పాల్పడుతున్నారు. అక్రమాలను అరికట్టాలంటే టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేసి పాసుపుస్తకాల ముద్రణ, జారీ పురోగతిని తెలిపే వ్యవస్థను ఏర్పాటు చేయాలి.
- ఏ స్థాయిలో రైతు సమస్య ఆగిపోయింది, పురోగతి ఏమిటనేది సులువుగా తెలుసుకునే వ్యవస్థను ఏర్పాటుచేస్తే బాగుంటుందని రైతులు, నిపుణులు సూచిస్తున్నారు.

విజేతకాంపిటీషన్స్ పక్షపత్రిక రూ.30 సం॥ చందా రూ.700 vijetacompetitions.net
ఏ.పి. గ్రామ/వార్డు సచివాలయం
SUBJECTS PART-B TOP 11 MODEL PAPERS Rs. 119
VILLAGE SURVEYOR Rs. 299 ANM/MPHA Rs. 389
DIGITAL ASSISTANT Rs.499, SANITATION Rs.399
ENGINEERING ASSISTANT & WARD AMENITIES Rs. 319
WARD WELFARE & DEVELOPMENT Rs. 319
EDUCATION & DATA Rs. 329 PART-A GS & MA Rs. 249, Rs. 399
PART-A TOP 31 MP Rs.99 కరెంట్ అఫైర్స్ రూ. 119, 159
9963293399 | 9963511135

SI కానిస్టేబుల్
Long Term Batch Starts from 15-8-2019 3 MONTHS COURSE
Class Timings : 9am to 5pm
7 ఉచితంగా
Fee: 7000/-
KEN KNOWLEDGE ENDS NEVER DILSUKHNAGAR Annapurna Complex, Beside 9th METRO pillar, Near Saibaba Temple, HYD
7330903677

గ్రూప్-2&3 న్యూ బ్యాచ్ రేపే ప్రారంభం @ 9:30am
SI/PC
హాస్టల్ వసతి కలదు • ప్రింటెడ్ మెటీరియల్ • డైలీ టెస్టులు
HA హారీష్ THE BEST అకాడమీ
HANAMKONDA. 8341116915, 83175 31594

IAS/IPS
ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు IAS & IPS శిక్షణ
DIRECT IAS
Last Few Seats Available
Krishna Pradeep's 21st Century IAS
Producing Next Generation Leaders for Good Governance
9133437733, 9133537733

S.I & కానిస్టేబుల్స్ ఇసాక్ సార్ ఆధ్వర్యంలో ARITHMETIC, REASONING & PURE MATHS
History : KADEM RAMESH
Polity : CHAITANYA DEV; PASHA
Geography : SHIVA KUMAR
Physics : SAI KUMAR
Biology : NARSIMHA REDDY
CA & GK : BIKSHAPATHI
English : KISHORE
Economy : OSMAN
P.E.T. : SRINIVAS
SUCCESSORS OF 2019 S.I. SUB INSPECTOR
INTEGRATED INTENSIVE BATCH Starts on 14-8-2019 @ 8 a.m.
ఆర్యభట్ట ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోలీస్
3rd Floor, Near Signals, Above ANDHRA BANK, DSNR, HYD.
6305056616 / 6305054993

హరిత తెలంగాణం

• విస్తీర్ణం పెరుగుదలలో మన రాష్ట్రానిది ఐదో స్థానం

ఈనాడు, హైదరాబాద్: ఈశాన్య రాష్ట్రాలు భౌగోళిక విస్తీర్ణంలో, జనాభాలో చిన్నవి. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం విషయానికి వచ్చేసరికి దేశంలో అగ్రస్థానం వాటిదే. ఆయా రాష్ట్రాల్లో ఏకంగా 75-90 శాతం వరకు అటవీప్రాంతాలే ఉంటాయి. అరుణాచల్‌ప్రదేశ్ భౌగోళిక విస్తీర్ణం 83 వేల చ.కిమీలు అయితే అటవీప్రాంతాలు 67 వేల చ.కిమీలకు పైగా ఉన్నాయి. పెద్ద రాష్ట్రాలకు వచ్చేసరికి ఇందుకు భిన్నమైన స్థితి. పచ్చదనం 10-27 శాతానికే పరిమితం. జాతీయ స్థాయి సగటు 24 శాతం. తెలంగాణ రాష్ట్రానిది 20.6 శాతం. కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ నివేదిక ఈ విషయాలను స్పష్టం చేసింది. పచ్చదనం వృద్ధి చెందిన రాష్ట్రాల్లో తెలంగాణది ఐదో స్థానం. 2015తో పోలిస్తే 2017లో తెలంగాణలో 565 చ.కిమీల మేర పచ్చదనం పెరిగింది. ఏపీలో 2,141, కర్ణాటకలో 1,101, కేరళలో 1,043, ఒడిశాలో 885 చ.కిమీల మేర పెరుగుదల ఉంది.

తెలంగాణ జిల్లాల్లో

తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల్లో మూడింట్లోనే భౌగోళిక విస్తీర్ణంలో 20 శాతం పైగా అడవులు ఉన్నాయి. ఆదిలాబాద్‌లో అత్యధికంగా 35.32, ఖమ్మంలో 33.42, వరంగల్‌లో 22.72 శాతం అటవీ ప్రాంతం ఉంది. రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణం 1,12,077 చ.కిమీ. ఇందులో 20,419 చ.కిమీలు అటవీప్రాంతం. అడవుల వెలుపల పచ్చదనం 2,689 చ.కిమీలు. మొత్తంగా రాష్ట్ర భూభాగంలో పచ్చదనం విస్తీర్ణం 23,108 చ.కిమీలు.

అంతకంటే ఎక్కువే!

తెలంగాణలో పచ్చదనం 24 శాతం వరకు ఉంటుందన్నది రాష్ట్ర అటవీశాఖ వాదన. 'కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ 2017 నివేదికకు సంబంధించిన వివరాలు 2015 అక్టోబరు-డిసెంబరు నాటి క్షేత్రస్థాయి పరిస్థితులకు సంబంధించినవి. అప్పుడు ఉపగ్రహాల ద్వారా తీసిన సమాచారంతో పచ్చదనం గణాంకాలను రూపొందించారు. ఇందులో తక్కువ ఎత్తున్న మొక్కలు, అటవీప్రాంతాలను ఉపగ్రహాలు గుర్తించలేవు. అందుకే 20.6 శాతంగా ఉందని ఓ అధికారి తెలిపారు.

దేశంలో ఇలా..

దేశ భౌగోళిక విస్తీర్ణం	32.87 లక్షల చ.కిమీ
అటవీ ప్రాంతం	7.08 లక్షల చ.కిమీ
అడవి వెలుపల పచ్చదనం	0.94 లక్షల చ.కిమీ
మొత్తం పచ్చదనం	8.02 లక్షల చ.కిమీ

అత్యధిక పచ్చదనం రాష్ట్రాలు (శాతాల్లో)

మిజోరం	88.48
అరుణాచల్‌ప్రదేశ్	80.93
మేఘాలయ	79.37
మణిపూర్	78.68
నాగాలాండ్	77.62

అత్యల్పంగా పచ్చదనం రాష్ట్రాలు (శాతాల్లో)

హరియాణా	6.79
పంజాబ్	6.87
రాజస్థాన్	7.26
ఉత్తరప్రదేశ్	9.18
బిహార్	10.15

హరితహారంతో 33 శాతానికి

తెలంగాణలో పచ్చదనాన్ని 33 శాతానికి తీసుకెళ్లేందుకురాష్ట్ర ప్రభుత్వం గట్టి ప్రయత్నం చేస్తోంది. 2015లో ప్రారంభించిన హరితహారం నాలుగు విడతల్లో 113.58 కోట్ల మొక్కలు నాటినట్లు అటవీశాఖ చెబుతోంది. ఈ ఏడాది 83.30 కోట్ల మొక్కలు నాటాలన్నది లక్ష్యం.

పప్పుల తిప్పలు

ఈనాడు - హైదరాబాద్

బహిరంగ విపణిలో పప్పుల ధరలు మండుతున్నాయి. గత మూడు నెలల్లోనే కిలోకు రూ.20కి పైగా చిల్లర మార్కెట్లో ధరలు పెరిగాయి. ప్రస్తుతం వీటి చిల్లర ధరలు కిలోకు రూ.95 నుంచి 100 వరకూ ఉన్నాయి. నైరుతి రుతుపవనాలు ఆలస్యం కావడం, విదేశాల నుంచి దిగుమతుల్లో జాప్యం.. వంటి కారణాలతో దేశీయ మార్కెట్‌లో వీటి ధరలు ఎగబాకుతున్నాయి. గత రెండేళ్లుగా రైతులు ఈ పంటలు అమ్మినప్పుడు ధరల్లేక నష్టపోయారు. ఇప్పుడు అవే పప్పులను అధిక ధరలకు కొనలేక సామాన్యులు సతమతమవుతున్నారు. ఇప్పటికీ ఈ పంటకు ధర లేదని ప్రభుత్వ గోదాముల్లో లక్షలాది క్వింటాళ్ల మూలుగుతున్నాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సహకార మార్కెటింగ్ సమాఖ్య(మార్క్‌ఫెడ్) వద్ద 2.53 లక్షల క్వింటాళ్ల కందులు, మరో 21 వేల క్వింటాళ్ల మినుములున్నాయి. వీటిని గతేడాది రైతుల వద్ద మద్దతు ధరకు కొన్నారు. వీటిని లాభాపేక్ష లేకుండా అమ్మేందుకు టెండర్లు పిలవాలని సమాఖ్య ఏర్పాట్లు చేస్తోంది. మరోవైపు కేంద్రం తరఫున మద్దతు ధరకు కొన్న 'జాతీయ సహకార మార్కెటింగ్ సమాఖ్య(నాఫెడ్) వద్ద కూడా 10 లక్షల క్వింటాళ్ల వరకూ నిల్వలున్నాయి. మార్కెట్‌లో పప్పుల ధరలు మరింత ఎగబాకితే వీటిని మార్కెట్‌లోకి విడుదల చేయాలని కేంద్రం యోచిస్తోంది.

దేశంలో ఇలా..

దేశంలో కంది పంట సాగు ప్రారంభించే జూన్, జులై నెలల్లో వర్షాలు సరిగ్గా కురవక సాగు విస్తీర్ణం తగ్గుతోంది. ఈ ఏడాది దేశవ్యాప్తంగా ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం కోటీ 7 లక్షల ఎకరాలు కాగా కోటి ఎకరాల్లో వేసినట్లు కేంద్ర వ్యవసాయశాఖ తాజా నివేదికలో వెల్లడించింది.

రాష్ట్రంలో ఇలా..

తెలంగాణలో కంది సాగు 7.29 లక్షల ఎకరాలకు గాను 6.61 లక్షల ఎకరాలకు పడిపోయింది. అన్ని పప్పు ధాన్యాల పంటల సాగు విస్తీర్ణం రాష్ట్రంలో ప్రస్తుత ఖరీఫ్‌లో లక్షా 74 వేల ఎకరాలు తగ్గడం గమనార్హం. నైరుతి రుతుపవనాలు ఆలస్యంగా రావడంతో పాటు, వచ్చిన తరువాత కూడా వర్షాలు లేక తీవ్రస్థాయిలో 38 శాతం వరకూ వర్షపాతం లోటు ఏర్పడింది. ఆగస్టులో వర్షాలు కురుస్తున్నా పప్పుధాన్యాల సాగు సమయం దాటిపోయింది.

తగ్గుతున్న దిగుబడి

గతేడాది భారతదేశంలో 36.80 లక్షల టన్నుల కంది పంట దిగుబడి వచ్చింది. అంతకుముందు ఏడాదితో పోలిస్తే 6.10 లక్షల టన్నుల దిగుబడి తగ్గింది. ఈ పంట దిగుబడి తగ్గడం వరుసగా ఇది రెండో ఏడాది.

- రైతులు పంట సాగు చేసినా ప్రభుత్వం మద్దతు ధరకు కొంటే తప్ప బయట మార్కెట్‌లో సరైన ధర రావడం లేదు. గతేడాది పంట మార్కెట్‌కు వచ్చినప్పుడు రాష్ట్రంలో క్వింటా రూ.4 వేలకే ఒక దశలో వ్యాపారులు కొన్నారు.
- మార్కెట్‌లో పంటకు ధర లేదని లక్షలాది టన్నుల కందులను మార్క్‌ఫెడ్ వేలంలో క్వింటా రూ.3200కే అమ్మేసింది. అప్పుడు అంత తక్కువకు పంట అమ్మగా ఆ తరవాత క్రమంగా పప్పు ధరలు పెరుగుతూ వస్తున్నాయి.

దేశంలో కంది పంట దిగుబడి (లక్షల టన్నులు)

సంవత్సరం	దిగుబడి
2014–15	28.10
2015–16	25.60
2016–17	48.70
2017–18	42.90
2018–19	36.80

దిగుమతుల పరిస్థితి ఇదీ

- ఈ ఏడాది 4 లక్షల టన్నుల కందిపప్పు దిగుమతి చేసుకోవాలని, వాటిని కొత్త పంట వచ్చేలోగా అంటే అక్టోబరులోగా తెప్పించాలనే షరతు పెట్టింది. ఇందులో తొలిదశగా 2 లక్షల టన్నుల దిగుమతికి అనుమతించినా అవి తెప్పించలేక వ్యాపారులు సతమతమవుతున్నారు. ప్రధానంగా మయన్మార్ నుంచి కంది పప్పు దిగుమతి చేసుకోవడం ఆనవాయితీ. అక్కడ పంట నిల్వలు లేకపోవడంతో లక్షన్నర టన్నులకు మించి దొరక్కపోవచ్చని వ్యాపారవర్గాల అంచనా.
- కందుల దిగుమతికి మొజాంబిక్‌తో భారతదేశానికి ఒప్పందం ఉంది. ఆఫ్రికా దేశాల్లో ఆగస్టు తరువాత పంట మార్కెట్‌కు వస్తుంది. దాన్ని అక్టోబరులోగా తెప్పించడం కష్టమనేది వ్యాపారుల అంచనా.
- మినుము, పెసలు కూడా లక్షన్నర టన్నుల చొప్పున విదేశాల నుంచి దిగుమతి చేసుకోవాలని కేంద్రం నిర్ణయించింది.

తాటిచెట్టు ఎత్తున జలధార!

సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలంలోని కొత్తగూడెం వద్ద జాతీయ రహదారి నిర్మాణ పనులు జరుపుతుండగా మిషన్ భగీరథ పైపులు పగిలాయి. ఆ పైపులకు నీటిని విడుదల చేయడంతో తాటిచెట్టు ఎత్తులో నీరు ఎగిసి పడి వృథాగా పోతోంది. ఈ విషయాన్ని వాటర్ గ్రిడ్ అధికారులకు తెలిపి సమస్య పరిష్కరిస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ చెప్పారు.

– న్యూస్‌టుడే, కొత్తగూడెం (తుంగతుర్తి)

ఇస్మార్ట్ 'ఇస్త్రీ'..!

• ఇస్త్రీపెట్టెల మాటున 9.21 కిలోల బంగారం తరలింపు

• శంషాబాద్ విమానాశ్రయంలో పట్టివేత

శంషాబాద్ గ్రామీణ, న్యూస్‌టుడే: బంగారాన్ని తరలించేందుకు అక్రమార్కులు ఎప్పటికప్పుడు కొత్త పంథాను అనుసరిస్తున్నారు. ఇస్త్రీపెట్టెల మాటున 9.21 కిలోల బంగారాన్ని తరలిస్తూ ఓ ప్రయాణికుడు పట్టుబడ్డ ఉదంతం తాజాగా శంషాబాద్ విమానాశ్రయంలో చోటుచేసుకుంది. ఆ వ్యక్తిని అరెస్టు చేసి కస్టమ్స్ ప్రధాన కార్యాలయానికి తరలించారు. కస్టమ్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన ఓ ప్రయాణికుడు దుబాయి నుంచి అక్రమ బంగారాన్ని చాకచక్యంగా తీసుకొచ్చాడు. నాలుగు ఇస్త్రీ పెట్టెల్లో వేడెక్కే లోహాన్ని తొలగించి, దాని బదులు 9.21 కిలోల బంగారాన్ని వేడి చేసి అదే పరిమాణంలో బిళ్లలుగా తయారు చేయించాడు. వాటికి వెండి పూత పూసి ఇస్త్రీపెట్టెల్లో అమర్చి తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో విమానాశ్రయంలో అతడిని అనుమానించిన భద్రతాధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేసి అక్రమంగా తరలిస్తున్న రూ.3.46 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మధ్యకాలంలో ఇంత భారీగా బంగారం పట్టుబడటం ఇదే తొలిసారని అధికారులు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 40.20 కిలోల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఓ ప్రకటనలో వెల్లడించారు.

రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా 5 'పెన్‌కల్చర్' యూనిట్లు

కూసుమంచి, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలోని పాలేరు జలాశయంసహా రాష్ట్రంలోని 5 జలాశయాల్లో ప్రయోగాత్మకంగా పెన్‌కల్చర్ (వలల మధ్య చేప పిల్లల పెంపకం) యూనిట్లు స్థాపించనున్నట్లు మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.శ్రీనివాస్ తెలిపారు. పాలేరు జలాశయం వద్ద పెన్‌కల్చర్ యూనిట్ ఏర్పాటు చేయనున్న ప్రాంతాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. జిల్లాలోని పాలేరు, వైరాతోపాటు, నల్గొండ జిల్లా శాలిగౌరారం, సిద్దిపేట జిల్లా శనిగరం, మెదక్ జిల్లా పోచారం జలాశయాల్లో సమీకృత మత్స్య పరిశ్రమ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ విధానంలో చేప పిల్లల పెంపకాన్ని ప్రయోగాత్మకంగా చేపట్టనున్నట్లు వివరించారు. జలాశయాల్లో వదిలే చేప పిల్లల్ని ఎక్కువ శాతం బతికించడం లక్ష్యంగా ఈ విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి యూనిట్‌కు రూ.5లక్షల వరకు వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ యూనిట్ల నిర్వహణ స్థానిక మత్స్య సహకార సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్నట్లు వెల్లడించారు.

ప్రజారోగ్యానికే మా ప్రాధాన్యం

ఫిజీషియన్ల రాష్ట్ర సదస్సులో ఈటల

ఈనాడు డిజిటల్, కరీంనగర్, న్యూస్‌టుడే-కరీంనగర్ పట్టణం: ప్రజారోగ్యానికే ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ అన్నారు. ఆయన శనివారం కరీంనగర్‌లో 4వ రాష్ట్రస్థాయి ఫిజీషియన్ల సదస్సు(అపికాన్-2019)కు ముఖ్యఅతిథిగా ప్రసంగిస్తూ, వైద్యులపై గురుతర బాధ్యత ఉందన్నారు. వ్యాధిని ప్రాథమిక స్థాయిలోనే కనుగొనే ఫిజీషియన్ల అవసరం ఎంతో ఉందని, వైద్యరంగంలో వారి పాత్ర కీలకమని తెలిపారు. కొన్ని సందర్భాల్లో వైద్యులపై దాడులు జరగడం బాధాకరమని చెప్పారు. అంతకు ముందు వార్షిక సమావేశ సావనీర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఫిజీషియన్ల సంఘం జాతీయ అధ్యక్షుడు పారికర్ మాట్లాడుతూ, డిజిటల్ సాంకేతికత వైద్యరంగానికి అత్యవసరమన్నారు. తల్లి జన్మనిస్తే వైద్యుడు పునర్జన్మ ఇస్తాడని కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కొనియాడారు. వైద్యవృత్తి అత్యంత పవిత్రమని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పేర్కొన్నారు. సదస్సులో రాష్ట్ర సంఘం నాయకుడు తిరుపతిరావు, మాజీ అధ్యక్షుడు శంకర్, నిర్వహణ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు రఘురామన్, విజయమోహన్ రెడ్డి పాల్గొన్నారు.

సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి ఈటల రాజేందర్. ఎంపీ సంజయ్, ఎమ్మెల్యే కమలాకర్ తదితరులు

ధర్నాచౌక్‌లో ఆందోళన చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వాహకులు

ఆరోగ్యశ్రీ సేవలు నిలిపేస్తాం

• బకాయిలిస్తేనే సేవల కొనసాగింపు

• వైద్యశాలల సంఘం హెచ్చరిక

కవాడిగూడ, న్యూస్‌టుడే: రాష్ట్రప్రభుత్వం ఇకనైనా స్పందించి 'ఆరోగ్యశ్రీ' నిధుల బకాయిలను విడుదల చేయాలని తెలంగాణ నెట్‌వర్క్ హాస్పిటల్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్ పట్టించుకోనందున, అసలు ఆ పథకాన్ని కొనసాగిస్తారా? లేదా? అనే అనుమానం కలుగుతోందని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాకేశ్ అన్నారు. హైదరాబాద్‌లోని ధర్నాచౌక్‌లో శనివారం చేపట్టిన ఆందోళనను ఉద్దేశించి మాట్లాడుతూ, ప్రభుత్వ నిర్ణయం స్పష్టం కాకుంటే 16వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేస్తామన్నారు. కొత్త అసెంబ్లీ, సచివాలయ భవనాలకు కోట్లాది రూపాయలు ఖర్చుచేస్తామంటున్న సీఎం.. పేదప్రజల వైద్యానికి నిధులు నిలిపివేయడం అన్యాయమని ఎమ్మెల్సీ రామచందర్‌రావు విమర్శించారు. ఎప్పుడో పుష్కరకాలం క్రితం నిర్ణయించిన వైద్యచికిత్సల ధరలను సవరించాలని కోరారు. ధర్నాలో ప్రైవేట్, కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వాహక వైద్యులు హరిప్రసాద్, ప్రవీణ్‌రెడ్డి, విజయభాస్కర్, సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ సవ్యంగా లేదు: ఐఎంఏ

ఈనాడు, హైదరాబాద్: ఆరోగ్యశ్రీని ప్రభుత్వం సక్రమంగా నిర్వహించడం లేదని, రోగులకు సేవలందిస్తున్న ప్రైవేటు ఆసుపత్రులకు నిధులివ్వడం మానేసిందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ)తెలంగాణ శాఖ ఆరోపించింది. బకాయిలు చెల్లించకుండా ఇప్పటికే ఇబ్బందిపెట్టడం సరికాదని సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ బీఎన్‌రావు ఆరోపించారు. ఇతర ప్రతినిధులతో పాటు ఆయన శనివారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు.' 'ఆరోగ్యశ్రీ పథకం గురించి ప్రభుత్వం గొప్పగా చెబుతోంది ఇప్పటివరకు దానికి పూర్తిస్థాయి సీఈవోను నియమించలేదు. ట్రస్టుకు జవాబుదారీతనం లేదు. సత్వరమే సేవలందించాలని ఆసుపత్రులను ఆదేశిస్తున్న ప్రభుత్వం అందుకు అనుగుణంగా నిధులు విడుదల చేయడం లేదు. ప్రైవేటు ఆసుపత్రుల్లో పెద్దసంఖ్యలో రోగులు చికిత్స చేయించుకుంటున్నారు. వారికి సంబంధించిన బిల్లుల మొత్తాలు మాత్రం విడుదల కావడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రూ. 4230 కోట్లను ఈ పథకానికి కేటాయించినా, రూ. 3034 కోట్లను మాత్రమే విడుదల చేసింది. ఇంకా రూ. 1,196 కోట్లు ఆసుపత్రులకు రావాలి. లేదంటే పథకాన్ని ప్రైవేటు వైద్యశాలల్లో అమలుచేయడం ఏమాత్రం సాధ్యం కాదు'' అని ఆయన స్పష్టంచేశారు.

సహనంతో మెలగడమే సెక్యులరిజం

• తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

• ఘనంగా తెలంగాణ వికాస సమితి మూడో రాష్ట్ర మహాసభలు

నారాయణగూడ, న్యూస్‌టుడే: "సెక్యులరిజమంటే ఒక మతాన్ని ముద్దు చేయడమో.. దూరం పెట్టడమో కాదు.. ఒకరి మత విశ్వాసాలు, సంప్రదాయాలు, ఆధ్యాత్మిక భావనలను మరొకరు గౌరవిస్తూ.. పరస్పరం సహనంతో మెలగడమే" అని తెరాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎమ్మెల్యే కేటీఆర్ అన్నారు. ప్రస్తుతం మతం, రాజకీయం, జాతీయవాదం అంశాలు పరస్పరం విడదీయలేనంత పెనవేసుకుపోయాయని పేర్కొన్నారు. దేశంలో మాతో ఉంటే దేశభక్తుడివి, లేదంటే దేశద్రోహివి అనే పరిస్థితులు కనిపిస్తున్నాయన్నారు. తెలంగాణ వికాస సమితి మూడో రాష్ట్ర మహాసభలను శనివారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని ఎన్టీఆర్ కళామందిరంలో ఘనంగా నిర్వహించారు. కేటీఆర్ మాట్లాడుతూ ఒకరి అభిప్రాయాలను విని, ఆలోచించి, తర్కించుకుని విభేదించుకోకపోతే ప్రజాస్వామ్యానికి అర్థమే ఉండదన్నారు. దిల్లీ విశ్వవిద్యాలయం విశ్రాంతాచార్యులు మీరాచందోక్ మాట్లాడుతూ ప్రశ్నించే పరిస్థితి లేకపోతే సమాజ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందన్నారు. రాష్ట్రాలన్నీ బలహీనమైనవి, తామే బలమైన వారమన్న భావనతో కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని వికాససమితి రాష్ట్రాధ్యక్షుడు దేశపతి శ్రీనివాస్ ఆరోపించారు. త్వరలోనే 1969-2019 తెలంగాణ ఉద్యమానికి అర్ధ శతాబ్ది ఉత్సవాలు నిర్వహించాలని వికాస సమితి నిర్ణయించిందన్నారు. సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్ నివేదికను సమర్పించారు. ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య పాపిరెడ్డి, గ్రంథాలయ పరిషత్తు అధ్యక్షుడు అయాచితం శ్రీధర్, తెలంగాణ బెవరేజెస్ కార్పొరేషన్ ఛైర్మన్ జి.దేవిప్రసాదరావు, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య సీతారామారావు, ఉన్నత విద్యామండలి సభ్యులు నర్సింహారెడ్డి, కేంద్ర సమాచార మాజీ కమిషనర్ మాడభూషి శ్రీధర్, పాత్రికేయుడు పి.వేణుగోపాలస్వామి, టీఎన్జీవోస్ రాష్ట్రాధ్యక్షుడు కారెం రవీందర్, తెలంగాణ పారిశ్రామికవేత్తల సంఘం అధ్యక్షుడు సుధీర్‌రెడ్డి పాల్గొన్నారు.

తెవిస రాష్ట్ర మహాసభలో ప్రసంగిస్తున్న కేటీఆర్.

సాంకేతికతతో పరిశ్రమల పురోగతి:'సర్వీస్ నౌ' సీఈవోతో కేటీఆర్

ఈనాడు హైదరాబాద్: సాంకేతికత తోడుంటే పరిశ్రమలు మరింత వృద్ధిని సాధిస్తాయని కేటీఆర్ పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాంకేతిక సంస్థలను ప్రోత్సహిస్తోందని చెప్పారు. అమెరికాకు చెందిన 'సర్వీస్ నౌ' ముఖ్య కార్యనిర్వహణాధికారి జాన్ దోనాహ్ శనివారం కేటీఆర్‌ను ఆయన నివాసంలో కలిశారు. 'సర్వీస్ నౌ' అమెరికా తర్వాత అతిపెద్ద సాంకేతిక అభివృద్ధి కేంద్రాన్ని హైదరాబాద్‌లో ప్రారంభించినందుకు కేటీఆర్ సీఈవోకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకోసం అడోబ్ సీఈవో శంతనునారాయణ్ కృషిని అభినందిస్తున్నట్లు వెల్లడించారు. తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి ఇతర అంశాలను కేటీఆర్ వివరించారు. హైదరాబాద్‌లో పెట్టుబడులకు సానుకూలవాతావరణం ఉందని, ప్రభుత్వ యంత్రాంగం సత్వర సేవలు అందించడం అభినందనీయమని జాన్ దోనాహ్ ఈ సందర్భంగా అన్నారు. జాన్‌ను కేటీఆర్ చేనేతవస్త్రాలతో సత్కరించారు.

జాతీయ పురస్కార విజేతలకు అభినందనలు

జాతీయ చలనచిత్ర పురస్కారాలకు ఎంపికైన 'మహానటి' చిత్రకథానాయిక కీర్తిసురేష్, దర్శకుడు నాగఅశ్విన్, నిర్మాత స్వప్న, చి.ల.సౌ చిత్ర దర్శకుడు రాహుల్, రంగస్థలం, అ!.. చిత్రాల బృందాలకు ట్విటర్‌లో కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు.

సైనికుని కుమార్తెకు చేయూతనిస్తాం

తెలంగాణ వైమానిక విద్యాసంస్థలో చదువుతున్న తన కుమార్తెకు అవసరమైన రుసుములను చెల్లించాలని వీరభద్రాచారి అనే సైనికుని వినతిపై కేటీఆర్ స్పందించారు. తాను కార్గిల్‌లో పోరాడానని, కుమార్తె చదువుకు అవసరమైన రుసుములు చెల్లించలేకపోతున్నానని వీరభద్రాచారి ట్విటర్‌లో పేర్కొన్నారు. కేటీఆర్ ఆయనకు సమాధానమిస్తూ "సైనికుల ధైర్యసాహసాలు అమూల్యమైనవి. త్వరలోనే సాయం అందించే ఏర్పాట్లు చేస్తాం" అని చెప్పారు.

పారా గ్లైడింగ్‌లో అపశ్రుతి

• కులూమనాలిలో యువ వైద్యుడి మృతి

నాగోలు, న్యూస్‌టుడే: వృత్తి జీవితంలో ఇప్పుడిప్పుడే ఎదుగుతున్న హైదరాబాద్‌కు చెందిన ఓ యువ వైద్యుడు సాహసోపేత చర్య చేయబోయి ప్రమాదవశాత్తూ దుర్మరణం పాలయ్యాడు. పారాచూట్ సాయంతో గాలిలోకి ఎగిరే క్రమంలో ఆయన కింద పడి మరణించిన దుర్ఘటన హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం కులూమనాలీలో జరిగింది. బాధిత కుటుంబీకులు, మృతుడి స్నేహితుల కథనం ప్రకారం.. నాగోలు సమీపంలోని సమతాపురి కాలనీలో నివసించే డాక్టర్ లక్క చంద్రశేఖర్‌రెడ్డి(24) ఫిజియోథెరపీ విద్య పూర్తిచేసి ఈసీఐఎల్‌లోని శ్రీకర ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. స్నేహితులైన విశాల్, అఖిల్‌లతో దిల్లీ, సిమ్లాలు తిలకించేందుకు ఈనెల 7న విహారయాత్రకు బయలుదేరారు. శనివారం సిమ్లాలో పారాగ్లైడింగ్ అడ్వెంచర్ ఫీట్‌కు చేరుకున్నారు. మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో శిక్షకుని సాయంతో తొలుత చంద్రశేఖర్‌రెడ్డి ఎత్తయిన కొండ పైనుంచి పారాచూట్ కట్టుకుని దూకారు. గాల్లోకి ఎగిరిన తర్వాత పారాచూట్ తెరుచుకోకపోవడంతో వేగంగా నేలపై పడ్డారు. ఆస్పత్రికి తరలించినా ప్రాణాలు దక్కలేదు. స్నేహితులు కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. అంతకు ముందే తనతో మాట్లాడిన తమ్ముడు ఇక లేడని, తనకు, తన తల్లికి దిక్కు ఎవరని సోదరి చాముండేశ్వరి కన్నీరుమున్నీరైంది. కులూమనాలిలోని ఆస్పత్రిలో ఉన్న సోదరుడి మృతదేహాన్ని నగరానికి తీసుకువచ్చేందుకు సహకరించాలని మరో సోదరి ఉమామహేశ్వరి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని ఆశ్రయించారు. చంద్రశేఖర్‌రెడ్డి స్వస్థలం నంద్యాల సమీపంలోని కొత్తపల్లి. పదేళ్ల క్రితం వీరి కుటుంబం నగరానికి వచ్చి స్థిరపడింది. తండ్రి వేమారెడ్డి నాలుగేళ్లక్రితం మరణించారు. తల్లి లక్ష్మి గృహిణి కుమారుడి వద్ద ఉంటున్నారు.



చంద్రశేఖర్‌రెడ్డి

ఒడిశాలోని సారా బట్టీలో వాహనాల దహనం

సిమిలిగుడ(ఒడిశా), న్యూస్‌టుడే: ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతమైన పొట్టంగిలో సారా తయారీ విక్రయ కేంద్రంలో శుక్రవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విధ్వంసం సృష్టించారు. మూడు వాహనాలను దహనం చేసి, ఎరుపు రంగు బ్యానరును వేలాడదీశారు. పొట్టంగి గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో ప్రభుత్వ అనుమతితో నిర్వహిస్తున్న ఓ సారాబట్టీ ఉంది. గుర్తుతెలియని వ్యక్తులు కొందరు ఇందులోకి చొరబడి ఒక కమాండర్, రెండు ద్విచక్ర వాహనాలకు నిప్పుపెట్టారు. అనంతరం సారా విక్రయాలను నిలిపివేయాలని, లేకుంటే శిక్ష తప్పదని అక్కడి గేటుకు బ్యానర్ కట్టారు. ఇది మావోయిస్టుల పని కావచ్చని నిర్వాహకులు పోలీసులకు తెలిపారు. బ్యానరుపై మావోయిస్టు కమిటీ పేరు లేకపోవడం, ఎలాంటి లేఖ విడిచిపెట్టకపోవడంతో ఇది చేసింది మావోయిస్టులా? లేక బట్టీలో పనిచేసేవారా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పంద్రాగస్టున జెండా వందనం చేసేది వీరే

• 11 జిల్లాల్లో మంత్రులు.. సిద్దిపేటలో శాసనసభాపతి పోచారం

• 16 జిల్లాల్లో జడ్పీ ఛైర్‌పర్సన్లకు అవకాశం

ఈనాడు, హైదరాబాద్: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఈ నెల 15న జిల్లా కేంద్రాల్లో జెండా వందనం చేసే మంత్రులు, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్లు, ఇతర ప్రజాప్రతినిధుల జాబితాను రాష్ట్ర ప్రభుత్వం శనివారం ప్రకటించింది. 16 జిల్లాల్లో జడ్పీ ఛైర్‌పర్సన్లకు జాతీయ పతాకాలు ఎగురవేసే అవకాశం కల్పించింది. 11 జిల్లాల్లో మంత్రులు, సిద్దిపేటలో శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, రంగారెడ్డిలో ఉపసభాపతి పద్మారావు, నల్గొండలో మండలి ఉపఛైర్మన్ నేతి విద్యాసాగర్, రెండు జిల్లాల్లో మండలి విప్‌లు (పల్లా రాజేశ్వర్‌రెడ్డి - వరంగల్ గ్రామీణ, బోడకుంటి వెంకటేశ్వర్లు-ములుగు) జెండా ఎగురవేస్తారు.

మంత్రులు పాల్గొనే జిల్లాలు..

భద్రాద్రి కొత్తగూడెం - మహమూద్ అలీ
జగిత్యాల - కొప్పుల ఈశ్వర్
ఖమ్మం- తలసాని శ్రీనివాస్‌యాదవ్
కరీంనగర్- ఈటల రాజేందర్
మహబూబ్‌నగర్- వి.శ్రీనివాస్‌గౌడ్
మేడ్చల్ మల్కాజిగిరి- మల్లారెడ్డి
నిర్మల్- ఇంద్రకరణ్‌రెడ్డి
నిజామాబాద్ - వి.ప్రశాంత్‌రెడ్డి
సూర్యాపేట- జి.జగదీశ్‌రెడ్డి
వనపర్తి- ఎస్.నిరంజన్‌రెడ్డి
వరంగల్ నగర జిల్లా - ఎర్రబెల్లి దయాకర్‌రావు

తండ్రి ఆత్మ సాక్షిగా.. వివాహం

అందరూ అగ్ని సాక్షిగా వివాహం చేసుకుంటారు. ఈ జంట మాత్రం మృతదేహం సాక్షిగా ఒక్కటైంది. దీని వెనక తండ్రి మీదున్న ప్రేమ దాగుంది. తమిళనాడులోని విల్లుపురం జిల్లా దిండివనం సమీపంలోని సింగనూర్ గ్రామానికి చెందిన దైవమణి కుమారుడు అలెగ్జాండర్ (27) మయిలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఉద్యోగం చేస్తున్నారు. అదే బడిలో పని చేస్తున్న గుణమంగళానికి చెందిన జగదీశ్వరి (23)తో అలెగ్జాండర్‌కు ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఈ విషయాన్ని ఇద్దరూ తమ తల్లిదండ్రులకు తెలియజేశారు. దీనికి అంగీకరించిన వారు సెప్టెంబర్ 2న వివాహానికి నిశ్చయించారు. పెళ్లి ఏర్పాట్లు జరుగుతున్న సమయంలో అనారోగ్యానికి గురైన దైవమణి శుక్రవారం మృతి చెందాడు. అందరి అనుమతితో అలెగ్జాండర్ తన తండ్రి మృతదేహం ఎదుటే వివాహం చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఇందుకు ఇరువురి కుటుంబీకులూ అంగీకరించడంతో జగదీశ్వరిని అలాగే పెళ్లి చేసుకున్నారు.

- న్యూస్‌టుడే, చెన్నై

దైవమణి మృతదేహం వద్ద నూతన దంపతులు

మూడు దశాబ్దాలుగా అమల్లో ఉన్న 34 శాతం బీసీ రిజర్వేషన్లను తగ్గించి మరీ మున్సిపల్ ఎన్నికలకు వెళ్లే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ.. ఆదివారం అఖిల పక్ష సమావేశం జరగనుంది. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్నారు.

కనబడుట లేదు

శ్లోక్ రాథోడ్
వయసు 21 సం.లు., ఎత్తు 5'6", గోధుమ ఛాయ
29 జులై 2019 నుండి కనబడుట లేదు.
సంప్రదించండి: 9672502595, 9414485146
ఇమెయిల్: rathore.sk@gmail.com

ఈనాడు

ఆకలిది ఏ మతం?

కుల, మత, ప్రాంతీయ విభేదాలు, అడపా దడపా విద్వేషాలు మనకు కొత్తవేమీ కావు. భిన్న జాతులతో విభిన్న సంప్రదాయాలతో వివిధ భాషలతో అలరారే మన సువిశాల భారతదేశంలో ఆపాటి అరమరికలు సహజసిద్ధం. కాబట్టే కవి రాయప్రోలు చెప్పినట్లు 'ఏ పూర్వపుణ్యమో ఏ యోగబలమో జనియించినాడనీ భరత ఖండమున' అని మనసులో పొంగిపోతూ, వాటిమధ్యనే జీవనం సాగిస్తూ ఉంటాం. ఒక గొప్ప వ్యక్తినో మహా కవినో లేక ఏ ప్రసిద్ధుణ్నో మా కులంవాడని, మా మతంవాడని, మా ప్రాంతంవాడనీ చెప్పుకొని గర్వపడుతూ ఉంటాం. అదేమీ పెద్ద దోషం కాదు. పెద్దలను స్ఫూర్తిగా తీసుకొని ఆ దారిలో నడవడం మంచి విషయమే. 'సత్కవి చెళ్ళపిళ్ళ వేంకన గురువంచు చెప్పికొనగా అది గొప్ప తెలుంగునాడునన్' అని విశ్వనాథ చెప్పినట్లుగా- మంచి సందర్భాల్లో 'మనవాడు' అనే మాటను తప్పు పట్టవలసిన పనిలేదు. కుల, మత వీరాభిమానాలు ఒకోసారి వెర్రితలలు వేస్తుంటాయి. అద్భుతమైన కవిత్వాన్ని ఆస్వాదిస్తూ పులకించిపోయే సమయంలోనే- ఈ కవి 'మనవాడు' కాదని గుర్తొచ్చి కొందరికి పద్యం వెగటవుతూ ఉంటుంది. జాషువా కంట తడిపెట్టించింది అలాంటి సందర్భమే. తన కవితావధూటి వదనమ్మున కమనీయ రూపురేఖా విలాసాదులను గమనించి 'భళీ' అన్నవారే- ఏదో గుర్తొచ్చినట్లు 'నీదేకులమన్న ప్రశ్న వెలయించి చివాలున లేచిపోవుచో- బాకున కుమ్మినట్లగును... వచింప సిగ్గగున్' అంటూ జాషువా చింతించారు. అందరూ అలాంటివారే ఉండరు. సహృదయులదీ పెద్దసంఖ్యే. హృద్యమైన పద్యం చెప్పిన 'తత్ సుకవీశుండు ఒక వంశ హీనుడగుబో- జోడింతును అవ్వానికి ఉత్సుకతన్ కేల్గవ...' అన్న మధునాపంతుల ఆ తరహా సహృదయ రసజ్ఞులు. మనం చెప్పుకోవలసింది- ఈ రెండో వర్గంవారి గురించి.

గ్రీకు మహాకవి హోమర్ మరణానంతరం- ఆయన మావాడంటే, మావాడంటూ ఏడు నగరాలు కీచులాడుకున్నాయి. గీతగోవిందకర్త జయదేవ సుకవి ఒడిశావాడా, బెంగాలీయా అంటూ చర్చలు నడిచాయి. మన నన్నయ, పోతనల విషయంలోను ఈ తరహా వాగ్వివాదాలు ఒకప్పుడు రాజ్యమేలాయి. 'వాళ్లేం రాశారో అది ప్రధానం' అని విజ్ఞులు తేల్చారు. కాబట్టి- మనవాడు అనే పదం, రూపంలో కనిపించేటంత చిన్నదేమీ కాదు. 'ఒక సూర్యుండు సమస్త జీవులకు తానొక్కొక్కడై తోచును' అని పోతన చెప్పినంత పెద్దది. ఒకో సందర్భంలో ఒక్కో అర్థం స్ఫురింపజేసేంత అతి ఘనమైనది. ప్రపంచకప్ క్రికెట్ పోటీలో పాకిస్థాన్‌పై 'మనవాళ్లు' గెలిచారన్నప్పుడు ఆ మాటకు ఉండే పరువూ మర్యాదా వేరు. అదే పోటీలో శతకం సాధించి విజయానికి కారణమైన ఆటగాడు 'మనవాడు' అన్నప్పుడు ఆ మాటకు బరువు తగ్గుతుంది, పరువు చెడుతుంది. కనుక ఆ మాటను ఎక్కడ వాడాలో అక్కడే వాడాలి. 'ఆకాశంబున నుండి శంభుని శిరంబు, అందుండి శీతాద్రి, సుశ్లోకంబైన హిమాద్రి నుండి భువి...' మందాకిని స్వర్గాన్నుంచి స్థానభ్రంశం పొంది క్రమంగా పాతాళానికి ఎలా జారిపోయిందో భర్తృహరి వర్ణించాడు. అంటే దేన్ని మనం గర్వకారణంగా భావించి విర్రవీగుతున్నామో- దాని ఉదాత్తతను, గౌరవాన్ని ఎల్లప్పుడూ ఎత్తుగానే ఉంచాలి తప్ప 'బుద్ధి బురదలోకి ఈడ్చింది' అన్న తీరులో దిగజార్చరాదని అర్థం. ఈ ఎరుక లేకపోవడమే వివేక భ్రష్టత్వానికి చిహ్నం. 'స్థాన విశేష మాత్రమున తామరపాకున నీటిబొట్టు! నిన్ పూనిక మౌక్తికంబు(ముత్యం) అనుచు పోల్చిన మాత్రనె ఇంత గర్వమా' అన్నట్లుగా తామరాకుపై నిలిచి ఉన్నంతసేపే నీటిబొట్టుకు ఆ గౌరవం. సందర్భోచితంగా వాడినప్పుడే ఆ పదానికి మర్యాద.

ఇంతకూ మనకు కుల, మత భేదాల పట్టింపు అన్ని విషయాల్లోనూ ఉండదు. వీలుకాని సందర్భాల్లో 'వారిజాక్షులందు వైవాహికములందు ప్రాణ విత్త మాన భంగమందు...' అనే శుక్రనీతిలోని సారాంశాన్ని అమలులోకి తెచ్చేస్తాం. లేదా, 'అన్నదమ్ములవలెను జాతులు, మత ములన్నియు మెలగ వలెనోయ్' అన్న గురజాడ సూక్తిని వల్లిస్తాం. ఆకలిలో అలసటలో అనారోగ్యంలో ఎవరికీ అంటూ సొంటూ పట్టవు. వెంగమాంబ అన్నపూర్ణాలయంలో ఆవురావురుమంటూ అన్నం మింగేటప్పుడు- వండివార్చిన వాడెవడో, వడ్డించేవాడెవడో ఎప్పుడైనా ఆరా తీశామా? అత్యవసరమై శస్త్రచికిత్సకు సిద్ధమైతే వైద్యుడు మనవాడో కాడో చూశామా? 'చెరువులోన చెంబు ముంచి నీరు తెద్దామంటె నీకు... చెరువులోని చేపలన్ని ఎంగిలంటున్నాయి లింగా' అన్నట్లుగా తయారైన సమాజంలో ఏది ఆచారం, ఏది అనాచారం? ఆచార వ్యవహారాలను పూర్తిగా విడిచిపెట్టేయమని కాదు దీని అర్థం- వాటిని పదిమందికీ ప్రదర్శించాలన్న చాపల్యం, తనకు నచ్చింది పదిమంది చేతా పాటింపజేయాలన్న చాదస్తం సబబు కాదని ఇటీవల జబల్‌పూర్‌లో జరిగిన ఒక సంఘటన నిరూపించింది. ఒకాయన బయటనుంచి ఆహారం తెచ్చిపెట్టమని ఒక సరఫరా సంస్థను కోరాడు. తీరా తెచ్చాక... ఆహారం నచ్చింది గాని, తెచ్చినవాడు నచ్చలేదు- ఎందుకంటే వాడు 'మనవాడు' కాడు. తీసుకోను పొమ్మనడమే కాదు, తాను చేసింది ఘనకార్యం అంటూ ఈయన సామాజిక మాధ్యమాల్లో వివరించాడు. 'ఎవడో వండిన బయటి తిండి- తెచ్చినవాడివల్ల మైల పడుతుందా? అయినా ఆహారానికి మతం ఏమిటి?' అని ఆ సరఫరా సంస్థ ఎదురు తిరిగింది. ఖాతాదారుణ్ని వదులుకోవడానికి సిద్ధపడిన ఆ సంస్థకే ఇప్పుడందరూ వత్తాసు పలుకుతున్నారు. ఆచారానికి లక్ష్యం- ఆరోగ్యమే కాని, చాదస్తం కాదు. ఆధునిక 'అంటరానితనం' ఆమోదనీయం కాబోదు!

రావమ్మా జల లక్ష్మీ రావమ్మా...

డాక్టర్ జి.వి.ఎల్.విజయకుమార్

నిన్నమొన్నటి వరకు యావత్ భారతావని కరవు పరిస్థితులతో తల్లడిల్లింది. గొంతు తడుపుకొనేందుకు గుక్కెడు నీరైనా లేక సతమతమైంది. రుతుపవనాల రాకలో జాప్యం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంది. ఇప్పుడు పరిస్థితి మారింది. దేశవ్యాప్తంగా వరదలు విలయతాండవం చేస్తున్నాయి. ఉత్తర, దక్షిణ, ఈశాన్య ప్రాంతాలు అనే తేడా లేకుండా అనేక రాష్ట్రాలను వరదలు చుట్టుముట్టాయి. పలు ప్రాంతాలు ముంపు బారినపడ్డాయి. వేల టీఎమ్‌సీల నీరు వృథాగా సముద్రాల పాలవుతోంది. వరద నీటిని సంరక్షించుకునే ప్రయత్నాలు చేపట్టకపోవడమే ఈ దుస్థితికి కారణం. దీంతో మళ్ళీ కొద్దిరోజుల్లో తాగు, సాగునీటి ఎద్దడి సమస్య ఉత్పన్నమవుతుంది. ఈ పరిస్థితిని అధిగమించి వాననీటిని ఒడిసిపట్టే చర్యలు చేపట్టడం తక్షణావసరం. ఇది కేవలం ప్రభుత్వాల బాధ్యతే కాదు- ఈ ప్రక్రియలో అందరూ బాధ్యతగా పాల్గొనాలి. అప్పుడే వాననీటిని సంరక్షించుకోగలం. భవిష్యత్ అవసరాలను తీర్చుకోగలం! కరవు పరిస్థితులు, తాగు సాగునీటి ఎద్దడిని అధిగమించేందుకు కేంద్ర ప్రభుత్వం 'జలశక్తి అభియాన్'ను ప్రారంభించింది. దేశంలో నానాటికీ తరిగిపోతున్న జలవనరులను సంరక్షించుకోవడం, కురిసే ప్రతి వాన నీటి బొట్టునూ ఒడిసి పట్టుకునేలా ప్రజల్లో చైతన్యం తేవడమే లక్ష్యాలుగా జులై ఒకటి నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో నీటి పొదుపు, సంరక్షణ, పునర్వినియోగాలను ప్రోత్సహించడం దీని లక్ష్యం.

నీటి సంరక్షణ అందరి కర్తవ్యం

దేశవ్యాప్త చైతన్యం

దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో నీటికి ఇబ్బంది పడుతున్న 256 జిల్లాలు, 1,592 ప్రాంతాల్లో జలసంరక్షణ కోసం ఉద్దేశించిన 'జలశక్తి అభియాన్' ప్రచార చైతన్యోద్యమాన్ని రెండు విడతలుగా చేపడుతున్నారు. జులై ఒకటిన ప్రారంభమైన తొలివిడత కార్యక్రమం సెప్టెంబరు 15 వరకు కొనసాగుతుంది. రెండో విడత అక్టోబరు ఒకటిన మొదలై నవంబరు 30న ముగుస్తుంది. తొలిదశలో కార్యక్రమాలు నిర్వహించే రాష్ట్రాల జాబితాలో తెలంగాణ; మలిదశ జాబితాలో ఆంధ్రప్రదేశ్‌తోపాటు తమిళనాడు, కర్ణాటక, పుదుచ్చేరి ఉన్నాయి. జలశక్తి అభియాన్ కార్యక్రమానికి తెలంగాణలో 24 జిల్లాల్లోని 137 బ్లాకులను, ఆంధ్రప్రదేశ్‌లో తొమ్మిది జిల్లాల్లోని 64 బ్లాకులను ఎంపిక చేశారు. తీవ్ర మంచినీటి ఎద్దడి ఎదుర్కొంటున్న అన్ని వర్గాల ప్రజలకూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కల్పించారు. 2024 నాటికల్లా గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని ఇళ్లకు కుళాయి నీటిని అందించే దిశగా కృషి సాగుతోంది. ఆ మేరకు బడ్జెట్ కేటాయింపుల్లో జల మంత్రిత్వశాఖకు ప్రాధాన్యం దక్కింది. 2019-20 బడ్జెట్‌లో రూ.28,261.59 కోట్లు కేటాయించారు. నిరుటికన్నా ఇది వెయ్యికోట్ల రూపాయలు అధికం.

వాననీరు భూమిలోకి ఇంకిపోయేలా జాగ్రత్తలు తీసుకోవడంద్వారా భూగర్భ జలాలను పునరుద్ధరించవచ్చు. గృహాల్లోని వ్యర్థ జలాలను వ్యవసాయానికి తిరిగి ఉపయోగించవచ్చు. వీటిపైన ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి సారించింది. జలశక్తి అభియాన్‌లో ప్రధానంగా అయిదు అంశాలమీద ప్రత్యేకంగా దృష్టి సారించారు. వీటిలో జల వనరుల పరిరక్షణ, వాన నీటి సంరక్షణ మొదటిది. సంప్రదాయ జల వనరులైన కుంటలు, చెరువుల పునరుద్ధరణ రెండోది. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ కాకతీయ పథకం ఉద్దేశమిదే. మూడోది- నీటి పునర్వినియోగానికి, పునరుద్ధరణకు వీలు కల్పించే నిర్మాణాలను చేపట్టడం. నీటికుంట(వాటర్‌షెడ్)లను అభివృద్ధి చేయడం నాలుగోది. భారీయెత్తున మొక్కలు నాటడం అయిదో కార్యక్రమం. వీటిలో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం ద్వారా జల సంరక్షణ ఉద్యమాన్ని క్షేత్రస్థాయిలోకి బలంగా తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యం. పంచాయతీరాజ్, పురపాలక, నగరపాలక

సంస్థలు ఈ కార్యక్రమంలో కీలకపాత్ర పోషించాల్సి ఉంది. వాననీటి పరిరక్షణ విభాగాలను ఏర్పాటు చేయాలి. పురపాలక సంఘాలు ఏర్పాటు చేసే విభాగాలు తమ పరిధిలోని ప్రాంతాల్లో భూగర్భ జలాల వెలికితీత, పునరుద్ధరణ తీరును ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. ప్రజల అవగాహన కోసం ఈ వివరాలను ముఖ్యమైన ప్రదేశాల్లో ప్రదర్శించాలి. భవన నిర్మాణ అనుమతులకు వాననీటి పరిరక్షణ నిర్మాణాలను తప్పనిసరి చేయాలి. అవి పూర్తయ్యాక తనిఖీలు చేపట్టి, అన్నీ నిర్దేశించినట్లు ఉంటేనే అనుమతులివ్వాలి.

దేశవ్యాప్తంగా భూగర్భ జలాలు వేగంగా అడుగంటుతున్నాయి. ఎన్నో ప్రాంతాల్లో తాగేందుకూ నీళ్లు లేక ప్రజలు కటకటలాడుతున్నారు. రుతుపవనాల రాకలో జాప్యం, వచ్చినా ఆశించిన మేరకు వర్షాలు కురవకపోవడంతో సామాన్య ప్రజలతోపాటు రైతులూ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు మధ్యప్రదేశ్, గుజరాత్ సహా దేశవ్యాప్తంగా సుమారు 256 జిల్లాల్లోని ప్రజలు తీవ్ర నీటి ఎద్దడి బారినపడ్డారు. ప్రభుత్వ తాజా గణాంకాలే ఈ విషయాన్ని వెల్లడిస్తున్నాయి. దిల్లీ, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ సహా 21 ప్రధాన నగరాల్లో 2020 నాటికల్లా భూగర్భజలాలు సున్నా స్థాయికి చేరుకుంటాయని సాక్షాత్తూ నీతిఆయోగ్ నివేదిక హెచ్చరించింది. గతేడాది నీతి ఆయోగ్ దీన్ని విడుదల చేసింది. 'మిశ్రమ నీటి యాజమాన్య సూచిక' ముమ్ముందు ఎదురవనున్న సంక్షోభాన్ని హెచ్చరించింది. 2030 నాటికి దేశవ్యాప్తంగా అందుబాటులో ఉన్న నీటి వనరుల లభ్యతతో పోలిస్తే ఇప్పుడున్న అవసరాలు రెండింతలు పెరుగుతాయన్నది అంచనా. పల్లెలు, పట్టణాలు, నగరాలు అనే తేడా లేకుండా అన్నిచోట్లా నీటి వనరులు ఆక్రమణలకు గురవుతున్నాయి. నీటి వనరులను పూడ్చివేసి వాటిపైనే భవనాలు నిర్మిస్తున్నారు. ఫలితంగా వాననీటి సంరక్షణకు అవకాశాలు లేకుండా పోతున్నాయి. నీటి ఎద్దడి ప్రభావం వ్యవసాయ రంగానికే పరిమితం కాలేదు. ఇతర రంగాలపైనా ప్రతికూల ప్రభావం చూపుతోంది. నీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చే కొద్దీ బాలికా విద్యపై ప్రభావం పడుతుందని విద్యారంగ నిపుణులు ఆందోళన వ్యక్తీకరిస్తున్నారు. బాలికలు తాగునీటి కోసం దూర ప్రాంతాలకు వెళ్లే క్రమంలో బడి మానేసే ప్రమాదం ఉంది. తమిళనాడులో నీటిఎద్దడి తీవ్రంగా ఉందనడానికి 'ఇడ్లీ పిండి కొంటే బకెట్ నీళ్ళు ఉచితం' అనే ఓ వ్యాపార ప్రకటనే నిదర్శనం. కర్ణాటకలో ముదురుతున్న నీటి సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకున్న ప్రభుత్వం బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలకు అనుమతులే నిలిపేయాలన్న దిశగా ఆలోచిస్తోంది. ఉత్తర్ ప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్‌లో నీటికొరత తీవ్రంగా ఉంది. వరదలతో ప్రస్తుతం సతమతమవుతున్న మహారాష్ట్రలో రెండు నెలల క్రితం నీటి ఎద్దడి తారస్థాయికి చేరింది. గొంతు తడుపుకోవడానికి చుక్కనీరు లేని దుస్థితి నెలకొంది. రాష్ట్రంలో 4,331 పల్లెలు, 9,470 శివారు ప్రాంతాల్లోని ప్రజలు తాగునీటికి అల్లాడిపోయారు. ఆ ప్రాంతాల్లో నిత్యం 5,493 ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసినప్పటికీ, ప్రభుత్వ యంత్రాంగం పూర్తిగా ప్రజల దాహార్తిని తీర్చలేకపోయింది.

బహుముఖ నష్టాలు

కొన్నేళ్లుగా సకాలంలో వానలు కురవకపోవడం, రుతుపవనాల సమయంలో సాధారణ వర్షపాతం కన్నా తక్కువ కురవడంతో, నీటిఎద్దడి నానాటికీ జటిలమవుతోంది. నీటి ఎద్దడి వల్ల రైతాంగం సేద్యంపై పెడుతున్న పెట్టుబడులు వృథా అవుతున్నాయి. ప్రస్తుతం స్థూల దేశీయోత్పత్తిలో వ్యవసాయరంగం వాటా 15 శాతాన్ని మించడంలేదు. వర్షాభావ పరిస్థితులు, కరవు తీవ్రత కొనసాగినట్లయితే సేద్యం కుదేలవడం ఖాయమని వ్యవసాయ, ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇదే జరిగితే దేశప్రజల ఆహార భద్రతకు ముప్పు తప్పదు. పోషకాహార లోపం పేదప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసి, వారిని మరింత పేదరికంలోకి నెట్టేసే ప్రమాదం ఉంది. క్రమంగా నీటి ఎద్దడి ఆర్థిక వ్యవస్థపై చూపే ప్రతికూల ప్రభావంతో నిరంతరం నిత్యావసరాల ధరలు పెరిగి, ప్రజల కొనుగోలుశక్తి పడిపోయే అవకాశమూ ఉంది.

దేశవ్యాప్తంగా 2000-01లో ఉన్న జలవనరుల సంఖ్య 5,56,601. 2006-07 నాటికి మిగిలినవి 5,23,816. ప్రస్తుతం పనికిరాకుండా పోయినవి 80,128. నిరుపయోగమైన జలవనరులు కర్ణాటకలో అత్యధికంగా 51 శాతం ఉన్నాయి. రాజస్థాన్‌లో 40 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 32 శాతం, తమిళనాడులో 30 శాతం, ఉత్తరాఖండ్‌లో 29 శాతం, గుజరాత్‌లో 23 శాతం జలవనరులు పనికిరాకుండా పోయాయి. భూగర్భ జలాలను ఇష్టం వచ్చినట్లుగా తోడేస్తున్నాం తప్ప, అంతే స్థాయిలో వాటిని పునరుద్ధరించే మార్గాల గురించి ఆలోచించడం లేదు. కురిసే కొద్దిపాటి వాననీటినీ భూగర్భంలోకి మళ్లించే ప్రయత్నాలు లోపిస్తున్నాయి. ఈ పరిస్థితిని సరిదిద్దాల్సిన అవసరం ఉంది!

(రచయిత- భూ విజ్ఞానశాస్త్ర నిపుణులు)

పౌర బాధ్యతగా...

చెరువులు, కుంటలను పునరుద్ధరిస్తే అక్కడ నీటి నిల్వతో పాటు, పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టాలూ పెరుగుతాయి. రోడ్ల పక్కన, పార్కుల్లో పాదచారుల మార్గాల వంటిచోట్ల కాంక్రీటు నిర్మాణాలు చేపట్టకుండా, కురిసిన వాననీరు భూమిలోకి వెళ్లేలా చర్యలు చేపట్టడం ద్వారా జల సంరక్షణ సాధ్యమవుతుంది. పరిమితంగా ఉన్న జల వనరులు- పెరుగుతున్న జనాభా, పట్టణీకరణకు అనుగుణంగా అవసరాలను తీర్చలేవు కాబట్టి, వాటిని విచక్షణాయుతంగా వినియోగించుకోవాలి. భూగర్భ జలాలను పొదుపుగా వాడుకోవాలి. ప్రజలందరూ పౌర బాధ్యతగా ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతను నిర్మించాలి. వాననీటిని వృథాగా పోనీయకుండా ప్రతి నీటి బిందువును జాగ్రత్తగా ఒడిసి పట్టుకుంటేనే రానున్న నీటిఎద్దడి నుంచి తప్పించుకోవచ్చు.

బెట్టింగ్ మాఫియా బలిపీఠం

పుణ్యభూమి

నేరం రాజకీయావతారం దాల్చిన పోతుగడ్డ మీద, అది చాపకింద నీరులా సమాజంలోని సకల పార్శ్వాలకూ చొచ్చుకుపోకపోతేనే ఆశ్చర్యపోవాలి. నేరగాళ్లకు రక్షక భటులుగా పోలీసులు కొత్త బాధ్యతలు నెత్తికెత్తుకోవడంతో- నేరాలూ ఘోరాలూ చేసేవారి సంక్షేమానికి రాజ్యవ్యవస్థ పూర్తిగా పూచీపడ్డట్లవుతోంది. కరడుకట్టిన నేరగాడు నయీం డైరీల్లో పాతిక మంది పోలీసు పెద్దల పేర్లు ప్రత్యక్షం కావడం ఒక్కటే అందుకు సాక్ష్యంగా పరిగణించే వీల్లేదు. ఊరూవాడా చిలవలు పలవలు వేసుకుపోయిన బెట్టింగ్ జాడ్యం అభాగ్య కుటుంబాల్లో ఆరని చిచ్చు పెడుతున్నా, ఆ వైపు చూపు సారించని రక్షక భటుల పరోక్ష తోడ్పాటు- దగాకోరులకు ఏ స్థాయి దన్నుగా మారిందో వెల్లడించే రుజువులు ఏటికేడు దండిగా పోగుపడుతున్నాయిపుడు! అవేమిటో చిత్తగించండి!

సప్త మహా వ్యసనాల్లో అత్యంత ప్రమాదకరమైనది జూదం. ఆ బలహీనతే కురుక్షేత్ర మహా సంగ్రామానికి ప్రేరకమైందంటోంది మహాభారతం. పేకాట క్లబ్బుల్లో, కత్తికట్టిన కోడి పందేల్లో, శ్రమజీవుల కష్టార్జితాన్ని కైంకర్యం చేసేలా మట్కా వ్యసనంలో పరకాయ ప్రవేశం చేసిన జూదం- మర్యాదస్తుల క్రీడైన క్రికెట్‌లోకీ ఏనాడో చొరబడింది. ఓ మతంగా క్రికెట్ చలామణీ అయ్యే ఇండియాలో ప్రతి ఆటనూ తుదకంటా ఆస్వాదిస్తూ బంతి బంతికీ ఉద్వేగంతో ఊగిపోయే అభిమాన జనకోటి- అక్షరాలా కాసుల కల్పవృక్షమే మరి! సరదాగా పందెం వేద్దామంటూ బురిడీ కొట్టించి, రెండు మూడు రెట్ల లాభాలపై ఆశ పెంచి, అమాయకుల్ని నిలువునా ముంచేసే బెట్టింగ్ మాఫియా ప్రతిచోటా పాతుకుపోయింది. మొన్నటికి మొన్న హైదరాబాద్‌లో రవికుమార్ అనే ఇంజినీరింగ్ విద్యార్థి బెట్టింగ్ మాయవలకు చిక్కి రూ.80 వేలు బాకీ పడ్డాడు. తన కారణంగా జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డాడంటూ అబద్ధం చెప్పడంతో- రవికుమార్ తండ్రి స్వగ్రామంలో పొలం అమ్మి రూ.40 వేలు సర్దుబాటు చేశాడు. మరో రూ.40 వేలు తీర్చే దారిలేక, బెట్టింగ్ నిర్వాహకుడి ఒత్తిడికి తాళలేక రవికుమార్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అంతకుముందు మరణ వాంగ్మూలంగా రవికుమార్ రాసిన లేఖ- బెట్టింగ్ మాఫియా సాలెగూట్లో చిక్కుకొని అతడు పడ్డ మానసిక క్షోభకు అద్దం పట్టింది. ఏళ్ల తరబడి ఈ నికృష్ట దందా చెలరేగిపోతుంటే- పోలీసులు ఏం చేస్తున్నారన్న ప్రశ్న వెర్రితనం. 2017 అక్టోబరులో క్రికెట్ బెట్టింగ్ నిర్వహణలో గుంటూరుకు చెందిన ఏడుగురు పోలీసుల పాత్ర వెల్లడై, వారిపై సస్పెన్షన్ వేటు పడటాన్ని బట్టి- అందరూ ఆ తాను ముక్కలేనన్నది నిర్ద్వంద్వం!

కోట్లాది అభిమానుల్ని ఉర్రూతలూగించేలా పొట్టి క్రికెట్‌కు శ్రీకారం చుట్టి, ఐపీఎల్ నిర్వహణతో దాన్ని జనావళికి మరింత చేరువ చేసిన నేపథ్యం- బెట్టింగ్ మాఫియా విస్తృతికి రాచబాటలు వేసింది. ఆటపై అవగాహనతో కూడిన అనురక్తి, ఆటగాడి సామర్థ్యంపై నమ్మకం, ఎన్ని ఓవర్లలో ఎన్ని వికెట్లు పడి, ఎంత స్కోరు సాధించగలరన్న అంచనా- ఇవన్నీ క్రికెట్ అభిమానుల సహజ లక్షణాలు. తమ అంచనా నిజమైతే అనాయాసంగా లక్షలు సంపాదించగలమన్న దురాశ పురుగులా కుట్టిందంటే చాలు- బెట్టింగ్ మాఫియా పంట పండినట్లే! ఆంధ్రప్రదేశ్‌లో ఒక్క ఐపీఎల్ సీజన్‌లో రెండు వేల కోట్ల రూపాయల దాకా బెట్టింగ్ లావాదేవీలు సాగుతుంటాయన్నది అంచనా. జిల్లాకు 10-15 మంది చొప్పున రాష్ట్రవ్యాప్తంగా రెండొందల మంది దాకా ప్రధాన బుకీలు బెట్టింగ్ నిర్వహిస్తున్నారని, వారిలో ఒక్కొక్కరూ పదుల సంఖ్యలో ఉపబుకీల్ని నియమించుకుని కార్యకలాపాల్ని మండల స్థాయి దాకా విస్తరించారనీ అందరికీ తెలుసు. కొన్నిచోట్ల డీఎస్పీ స్థాయి అధికారులూ బుకీలతో చేతులు కలిపిన సందర్భాల్ని వార్త కథనాలెన్నో వెల్లడించాయి. బెట్టింగ్ వ్యసనానికి బానిసలై ఉన్నత చదువులు అభ్యసించే విద్యార్థులూ గొలుసుల చోరీ ముఠాలుగా మారుతున్న వైపరీత్యం, ఉభయ తెలుగు రాష్ట్రాల్లోనూ కళ్లకు కడుతోంది. అంతకు దిగజారలేక కన్నవాళ్లకు గర్భశోకం మిగిల్చి ఆత్మహత్యలకు పాల్పడుతున్న అభాగ్యుల ఉదంతాలూ లెక్కకు మిక్కిలిగా వెలుగు చూస్తున్నాయి. బెట్టింగ్ మాఫియా సృష్టిస్తున్న పెనుసామాజిక సంక్షోభం ఇది!

రెండేళ్ల క్రితం బెంగళూరుకు చెందిన ఓ మాజీ కార్పొరేటర్ నివాసంపై ఒక అపహరణ కేసుకు సంబంధించి పోలీసులు చేసిన దాడి, అతగాడి చీకటి సామ్రాజ్యాన్ని ప్రపంచానికి పరిచయం చేసింది. హత్యలు, అపహరణల వంటి క్రమబద్ధ వ్యాపకాలతోపాటు, క్రికెట్ బెట్టింగుల పోషణలోనూ తలమునకలై ఉన్నాడని- మూడంతస్తుల భవనంలో అయిదు గదుల్ని లాకర్లుగా మార్చేసిన అతగాడి వైభవం ఎలుగెత్తి చాటింది. బుకీలు (సూత్రధారులు), ఏజెంట్లు (మధ్యవర్తులు), పంటర్లు (పందెంరాయుళ్లు) ఒక నెట్‌వర్క్‌గా వ్యవస్థీకృతమై సాగించే ఈ దందాలో- దీపం పురుగుల్లా జీవితాల్ని కాల్చేసుకొంటున్నది విద్యార్థులే. పిల్లల భవిష్యత్తుపైనే ఆశలన్నీ పెట్టుకొన్న వేలాది కుటుంబాల్లో రగులుతున్నవి కన్నీటి కాష్టాలే!

రాజకీయ నాయకులు, ఖాకీలు, బుకీలు ఒక్క తాటిమీదకొచ్చి సాగిస్తున్న ఈ పాపిష్టి వ్యాపార పరిమాణం 2012 నాటికే ఏకంగా మూడు లక్షల కోట్ల రూపాయలకు చేరిందని 'ఫిక్కీ' నివేదికే చాటింది. దాన్ని నిలువరించే లేదా నియంత్రించే విషయంలో ప్రభుత్వాల శక్తియుక్తుల పట్ల పూర్తి విశ్వాసంతో మరో ఉచిత సలహా సైతం దయచేసింది. ఆ 'వ్యాపారం'పై 20 శాతం పన్నువేసినా సర్కారుకు రూ.12-19 వేలకోట్ల ఆదాయం వస్తుందంటూ ప్రభుత్వాల్నీ పంటర్లుగా మార్చే యత్నం చేసింది. సుప్రీంకోర్టు కొన్నేళ్ల క్రితం ఏర్పాటుచేసిన ఎమ్‌బీ షా కమిటీ- నల్లధనం ఉత్పత్తి కేంద్రంగా మారిన బెట్టింగ్ మార్కెట్‌ను నియంత్రించడానికి విస్పష్ట నిబంధనల్ని కూర్చాలని సిఫార్సు చేసింది. అవన్నీ కొరగానివన్నట్లుగా నిరుడు జులైలో న్యాయసంఘం చేసిన సూచనలు ఆలోచనాపరులందర్నీ దిగ్భ్రాంతపరచాయి!

క్రీడలపై పందేలు కాయడం, జూదాన్ని నిషేధించడం వల్ల మేలుకన్నా కీడే ఎక్కువ అన్న న్యాయసంఘం- బెట్టింగును చట్టబద్ధం చేశాక మ్యాచ్ ఫిక్సింగ్, మోసాలు చోటు చేసుకోకుండా కఠిన చట్టాలు తీసుకురావాలంది. ధర్మరాజు కాలంలోనే ఇలాంటి నియంత్రణలుంటే, మహాభారతం గాథే లేకపోయేదనీ సూత్రీకరించింది. ఇంకా నయం- కేంద్ర రాష్ట్రప్రభుత్వాలు ఏటా తమ బడ్జెట్లలో కొంత మొత్తాన్ని బెట్టింగుల్లోకి మళ్లించడం ద్వారా ఆ 'విపణి' విలువను పెంచాలని సూచించలేదు! యూకే, స్పెయిన్, జర్మనీ, కెనడా వంటి దేశాలు అన్ని రకాల జూదాన్నీ ప్రోత్సహిస్తున్నా- అక్కడి సామాజిక జీవన ప్రమాణాలకు ఇక్కడి జీవన చిత్రానికీ లంగరందదు. ఈ కనీస జ్ఞానం లేకుండా వెలువడే ప్రతిపాదనలు- భయాందోళనల్ని పెంచుతున్నాయి. భావితరం బతుకుల్ని బలిపీఠం మీదకు నెడుతున్న బెట్టింగ్ జాడ్యాన్ని సమూలంగా తుడిచిపెట్టడం- ప్రభుత్వాలు తలచుకోవాలేగాని, ఎంత పని? ప్రజల కోసం ప్రాణాలిస్తామంటూ నాటకీయత ఒలకబోసే నేతాగణాలు, జనం ప్రాణాలు తోడేస్తున్న బెట్టింగ్ భూతానికి ఊడిగం చెయ్యడం మానేస్తే- దాన్ని దుంపనాశనం చెయ్యడం సాధ్యపడుతుంది. ఏమంటారు?

– పర్వతం మూర్తి

జీవన గమనం

అంతర్యామి

'నీటి బుడగ నీ బతుకు... అది చిటికెలోనే చితుకు' అన్నది తాత్త్వికుల ఉవాచ. జీవిత పరమార్థాన్ని వారు రెండు ముక్కల్లో నిర్వచించి 'తస్మాత్ జాగ్రత' అంటూ హెచ్చరించారు. మనుషుల జనన మరణాలు జయాపజయాల్లాగే దైవాధీనాలు! జీవితం మన చేతుల్లో, చేతల్లోనే ఉంది. బాగుపడినా దారి తప్పినా కేవలం స్వయంకృతమే. లేకుంటే విధి వక్రించింది అని భావిస్తూ ఆ తప్పు పైవాడి మీదకు నెట్టేస్తాం!

బాల్యం ఒక వరమని, యౌవనం ఒక సమరమన్నది ఆంగ్లసూక్తి. యౌవనంలో మనం చేసే తప్పులకు, ఒప్పులకు మనమే జవాబుదారీ కావాలి. చాలామంది ఈ దశలో పొరపాట్లు చేస్తూ ఫలితాన్ని ఇతరులపైకి తోసేస్తూ ఆత్మానందం పొందుతుంటారు. కాలం విలువ గుర్తెరిగి ప్రవర్తించరు. విద్యాభ్యాస కాలంలోనే చెడుస్నేహాలు మరిగి జీవితాన్ని చేతులారా నాశనం చేసుకొని చివరలో విలపిస్తారు. అప్పటికే ముఖ్యఘట్టాలన్నీ చేజారిపోతాయి.

మరికొందరు పేదరికమే తమకు శాపమైందని వాపోతుంటారు. కటిక దారిద్ర్యంలో పుట్టి స్వయంకృషితో అనేక రంగాల్లో రాణించి అత్యున్నత శిఖరాలు అధిరోహించిన వారెందరో ఉన్నారు. అలాంటివారి జీవితాలు ఆదర్శంగా తీసుకోక కేవలం నిరాశావాదంలో పడతారు. మరికొందరు అతి సున్నిత మనస్కులు ఆత్మహత్యలకు పాల్పడతారు. పుట్టిన నాటి నుంచీ ఏ బాధ, ఆవేదన లేకుండా గిట్టేవరకు ఒకేరీతిలో ఆనందంగా ఉన్న వ్యక్తి ఈ భూమ్మీద ఎవరైనా ఉన్నారా? రాజైనా పేదైనా దీనికి మినహాయింపు కాదు. మానసిక బలహీనత కారణంగా ఆవేశంలో నిర్ణయం తీసుకుని ప్రాణాలు బలిపెట్టడం అవివేకం!

కాలం కలిసిరాలేదని, అందుకే ఈ ప్రపంచం నుంచి నిష్క్రమిస్తున్నానని లేఖ రాసి బావిలోనో పొంగి ప్రవహిస్తున్న నదీప్రవాహంలోనో దూకి మరణించేవారు మరికొందరు! కాలం అందరికీ ఒకే రీతిగా ఉంటుంది. కొందరు అదృష్టవంతులని, మరికొందరు దురదృష్టవంతులని అది భావించదు. ఈ భావన కేవలం మన భ్రమే!

ఏ రంగంలో విజేతలను పరిశీలించినా వారి గతం కష్టాలమయంగానే కనిపిస్తుంది. కఠోర పరిశ్రమ, దృఢసంకల్పం, రాజీలేని పోరాటం వల్లనే వారు విజయాలు సాధించారన్నది తేటపడుతుంది.

విత్తు ఒకటైతే ఫలం మరొకటి ఎలా వస్తుంది? వేప విత్తనం నాటి మామిడి పండు ఆశించడం ఎంత అవివేకం? సమ్యక్ దృష్టి లేకుండా సరైన రీతిలో స్పందించకుండా సర్వం తమ వశం కావాలని కోరుకోవడం సహేతుకమవుతుందా? ఓటమి, వైఫల్యం లేకుండానే విజేతలు చరితార్థులయ్యారా?

బాల్య కౌమార దశలను మినహాయిస్తే కేవలం యౌవనం మాత్రమే దిశానిర్దేశం చేస్తుందని భావించడమూ సరైనది కాదు. వృద్ధాప్యంలో సైతం అద్భుతాలు సృష్టించిన వారెందరో ఉన్నారు. పీజీ ఓడ్‌హౌస్ అనే ఆంగ్ల నవలారచయిత తన నూట రెండో సంవత్సరంలో ఒక నవల రాసి పలువురి ప్రశంసలు పొందాడు. ఆశావహ దృక్పథంతో జీవించడమే జీవితం!

అపజయం, ఆందోళన, ఆవేదన, కలతలు, కన్నీళ్లు జీవితంలో కేవలం ఒక భాగం. అవి శాశ్వతం కాదు. జీవితాంతం వెంటాడేవీ కాదు. పరాజయం పాలైన క్షణంలో కుంగుబాటు కలగడం సహజం. అది తాత్కాలికమేనని భావించి, మనో నిబ్బరంతో ముందుకు సాగడమే వివేకవంతుల లక్షణం.

జీవన గమనంలో ఆశ నిరాశలు, ఆటుపోట్లు, ఎత్తుపల్లాలు అత్యంత సహజం. ఓటమిలో కుంగిపోవడం, విజయంలో పొంగిపోవడం స్థితప్రజ్ఞత అనిపించుకోదు.

జీవితాన్ని ఒక సవాలుగా భావించి సాగిపోవడమే సమర్థత, విజ్ఞత!

– కిల్లాన మోహన్‌బాబు

పథకం ప్రకారం బహుమానం

ఇటీవలి కాలంలో పెరిగిన భూముల గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్లు ◆ 3 నెలల్లో రాష్ట్ర వ్యాప్తంగా 44,886 నమోదు ◆ ప్రభుత్వ పథకాల్లో లబ్ధి కోసమే అంటున్న అధికారులు

ఈనాడు డిజిటల్ - హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా మూడు నెలల్లో గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్లు భారీగా పెరిగాయి. ఏప్రిల్ నెలలో 13,195 రిజిస్టర్ కాగా..మే నెలలో ఆ సంఖ్య 15,367కు, జూన్‌లో 16,304కు పెరిగింది. ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏప్రిల్ నెలలో 81గా ఉన్న ఆ సంఖ్య, మే నెలలో ఏకంగా 163కి పెరిగింది. గతంలో ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో నెలలో 50-70 మధ్య ఇలాంటివి జరుగుతుండగా.. ఇప్పుడు వందకు పైచిలుకు జరుగుతున్నాయని రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. రాష్ట్రం మొత్తం దాదాపు ఇదే పరిస్థితి ఉందని, ప్రభుత్వ పథకాల్లో లబ్ధి కోసమే ఇలాంటివి జరుగుతున్నట్టు సమాచారం ఉందని వారు పేర్కొంటున్నారు. కారణమేదైనా తమ శాఖకు ఆదాయం గణనీయంగా పెరిగిందని చెబుతున్నారు.

నిబంధనల భయంతో

ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకంతో

పాటు అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ పథకాలకు అర్హత సాధించాలంటే ఐదు ఎకరాల లోపు భూమి కలిగి ఉండాలనేది నిబంధన. తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు బీమా రావాలంటే రైతు పేరిట పట్టాదారు పాసు పుస్తకం తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఇన్ని రోజులు తన పేరు మీద ఉన్న భూమిని కుటుంబ సభ్యులు, బంధుల పేరుతో బదిలీ చేసి, పట్టాలు పొందేందుకు ఎక్కువ మంది ప్రయత్నిస్తున్నారు. దీనికితోడు పెరిగిన మార్కెట్ ధరకు అనుగుణంగా భూముల ధరలు పెంచేందుకు అనుమతివ్వాలంటూ రిజిస్ట్రేషన్ శాఖ ఇటీవల ప్రభుత్వాన్ని కోరింది. అదే జరిగితే పెరిగిన ధర మేరకు రిజిస్ట్రేషన్ శాఖకు రుసుము(స్టాంప్‌డ్యూటీ) చెల్లించాలి. మరోవైపు కేంద్ర ప్రభుత్వం మాదిరే రాష్ట్రంలో రైతుబంధు పరిమితిని ఐదు ఎకరాలకు కుదిస్తారని కొన్ని రోజులుగా విస్తృత ప్రచారం జరుగుతోంది. దీంతో భూముల పట్టాలు మార్చుకునేందుకు ఇదే సరైన సమయమని చాలా మంది భావిస్తున్నారు.

రుసుము తక్కువనే

సాధారణంగా ఇతరుల నుంచి భూమిని కొనుగోలు చేస్తే, కొనుగోలు చేసిన ధరలో రిజిస్ట్రేషన్ శాఖకు 9 శాతం రుసుము చెల్లించాలి. అదే గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్‌లో ఇతరుల పేరుమీద చేస్తే మూడు శాతం, రక్త సంబంధీకులు, కుటుంబ సభ్యులైతే ఒక శాతం చెల్లిస్తే సరిపోతుంది. దీంతో చాలా మంది రైతులు తక్కువ వ్యయంతో రిజిస్ట్రేషన్ చేయించుకునే వీలున్న దీనివైపు మొగ్గు చూపుతున్నారు.

2019 ఏప్రిల్, మే, జూన్ నెలల్లో గిఫ్ట్ డీడ్ రిజిస్ట్రేషన్లు అత్యధికంగా జరిగిన 10 జిల్లాలు, అదే జిల్లాల్లో గడిచిన ఏడాది ఆ మూడు నెలల్లో జరిగిన గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ల వివరాలివీ.

జిల్లా	2019	2018
రంగారెడ్డి	3,884	3,802
నల్గొండ	3,690	2,273
మహబూబ్‌నగర్	2,254	1,140
ఖమ్మం	2,249	1,080
మేడ్చల్ మల్కాజిగిరి	2,215	2,384
హైదరాబాద్	2,232	2,199
నిజామాబాద్	2,009	1,376
వరంగల్	1,993	325
సిద్దిపేట	1,877	1,123
సంగారెడ్డి	1,762	1,377

మహాత్మునితో మాతరం

జాతిపిత మహాత్మాగాంధీని నాటి తరంతోపాటు నవతరం సైతం ఆరాధిస్తోందనేందుకు ఈ చిత్రమే నిదర్శనం. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో 'మన గాంధీ' పేరిట ఛాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేశారు. అక్కడ మహాత్ముని కటౌట్ వద్ద స్వీయ చిత్రాలు తీసుకునేందుకు యువత ఆసక్తి చూపారు. స్వీయచిత్రమే కాదు.. ఆయన సిద్ధాంతాలనూ, ఆదర్శాలనూ ఆచరిస్తే వారికీ, జాతికీ ఎంతో ఉపకరిస్తుంది.
-ఈనాడు, హైదరాబాద్

చట్టబద్ధ పాలన 'ప్రజాస్వామ్యాని'కి ఆత్మవంటిది

- యువ పోలీసు అధికారులు జాతి నిర్మాతలు
- సర్దార్ పటేల్ స్మారకోపన్యాసంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి

ఈనాడు, హైదరాబాద్: ఆధునిక ప్రజాస్వామ్య దేశాల్లో చట్టబద్ధ పాలన ఆత్మవంటిదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయి పేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలకు చట్టబద్ధ పాలనతో ఘర్షణ తలెత్తినప్పుడు న్యాయసమీక్ష కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రజాస్వామ్యమంటే చట్టం ముందు సమానత్వం, రాజకీయ స్వాతంత్ర్యం, చట్టబద్ధ పాలనలేనని స్పష్టంచేశారు. వ్యక్తి పాలనకు, చట్టబద్ధపాలనకు స్పష్టమైన వ్యత్యాసముందని వెల్లడించారు. శనివారమిక్కడ జాతీయ పోలీసు అకాడమీలో జరిగిన సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ 33వ స్మారకోపన్యాస కార్యక్రమంలో 'ఆధునిక ప్రజాస్వామ్యంలో చట్టబద్ధ పాలన' అనే అంశంపై జస్టిస్ రంజన్ గొగొయి ప్రసంగించారు. మాతృభూమి కోసం జీవితాన్ని అంకితం చేయడానికి ముందుకొచ్చిన యువఅధికారులు అభినందనీయులన్నారు. పోలీసు శిక్షణ పొందుతున్న వీరు యువసాధకులు, జాతి నిర్మాతలుగా అభివర్ణించారు. విధి నిర్వహణలో చనిపోతున్న పోలీసులు.. యుద్ధంలో మరణించేవారికంటే తక్కువేమీ కాదని తెలిపారు. వ్యక్తిగత నిబద్ధత, వ్యవస్థాపరమైన నిబద్ధతల మధ్య తేడాను గమనించాలన్నారు. చట్టబద్ధమైన అధికారాలను వినియోగించే సమయంలో వారు తగిన రీతిలో వ్యవహరిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. విధి నిర్వహణలో పరీక్షా సమయాలు ఎదురవుతాయని.. అప్రమత్తంగా ఉండాలన్నారు. అంతకుముందు పోలీసు అకాడమీ డైరెక్టర్ అభయ్ ప్రారంభోపన్యాసం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్, పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, హోంమంత్రి మహమూద్ అలీ, తెలంగాణ, ఏపీ డీజీపీలు మహేందర్‌రెడ్డి, గౌతం సవాంగ్, మాజీ ఐపీఎస్ అరుణ ఎం. బహుగుణ తదితరులు పాల్గొన్నారు.

సరిహద్దుల్లో ఈ-కంచె

- పాక్ శ్రుతిమించితే దీటైన చర్యలు
- బౌద్ధారామాలుగా లేహ్.. లద్దాఖ్... కార్గిల్
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి

ఈనాడు,హైదరాబాద్: "ఆర్టికల్ 370ని రద్దు చేసినందుకు పాకిస్థాన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తోంది.. పాక్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ బాధ్యతారాహితమైన ప్రకటనలు చేస్తున్నారు. పాక్ శ్రుతిమించితే దీటైన చర్యలు తీసుకుంటాం" అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డి హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీర్స్ ఆధ్వర్యంలో 'సైబర్ భద్రత, ఇమేజ్ ప్రాసెసింగ్' అంశంపై శనివారం జరిగిన జాతీయస్థాయి సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎన్డీయే ప్రభుత్వం తీసుకున్న సాహసోపేత నిర్ణయం ఫలితంగా జమ్మూ-కశ్మీర్‌లో శాంతిభద్రతలు మెరుగుపడుతున్నాయన్నారు. బౌద్ధులు ఎక్కువగా ఉండే లేహ్, లద్దాఖ్, కార్గిల్‌లు భవిష్యత్‌లో బౌద్ధారామాలుగా మారనున్నాయని, టిబెట్ తరహాలో ఆధ్యాత్మిక సౌరభాలు వెదజల్లనున్నాయని కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దేశభద్రత కోసం సరిహద్దును అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ఎలక్ట్రానిక్ కంచెతో మరింత బలోపేతం చేస్తున్నామన్నారు. అంతర్జాల పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించడం ద్వారా భవిష్యత్తులో డిజిటల్ ఇండియాను ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని కిషన్‌రెడ్డి అన్నారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు చేపట్టాల్సిన చర్యలపై వివిధ రాష్ట్రాల పోలీస్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. చిన్నారిపై అత్యాచారం, హత్య కేసులో నిందితుడ్ని సాంకేతిక పరిజ్ఞాన ఆధారాలతో అరెస్టు చేసి ఉరిశిక్ష పడేలా కృషి చేసిన వరంగల్ పోలీసులను కిషన్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ అంజనీకుమార్, ఐఈఐ ఛైర్మన్ డాక్టర్ జి.రామేశ్వరరావు, ఎమ్మెల్సీ రామచంద్రరావు, విశ్రాంత ఇంజినీర్లు, ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

'సైబర్ భద్రత, ఇమేజ్ ప్రాసెసింగ్' అంశంపై నిర్వహించిన సదస్సులో ప్రసంగిస్తున్న కిషన్‌రెడ్డి

ఓఎన్‌జీసీని బలోపేతం చేయాలి

కవాడిగూడ, న్యూస్‌టుడే: ఓఎన్‌జీసీ సంస్థను బలోపేతం చేసి దేశనిర్మాణంలో ఉద్యోగులు భాగస్వాములు కావాలని జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం హైదరాబాద్‌లో అఖిల భారత ఓఎన్‌జీసీ ఓబీసీ, ఎంబీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 12వ జాతీయస్థాయి ఎగ్జిక్యూటివ్ సమావేశాలను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఓబీసీలకు విధించిన క్రీమీలేయర్ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నాలు చేపట్టామన్నారు. భాజపా రాష్ట్ర అధ్యక్షుడు డా.లక్ష్మణ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో దేశవ్యాప్తంగా ఓబీసీల గణన శాస్త్రీయంగా లేకపోవడటంతో అన్యాయానికి గురయ్యారన్నారు. రోహిణి కమిషన్ నివేదిక అందిన తరువాత న్యాయం జరుగుతుందన్నారు. తెలంగాణ ప్రభుత్వం బీసీల వ్యతిరేకిగా మారిందని ముఖ్యమంత్రి కేసీఆర్‌పైన ధ్వజమెత్తారు. రాజ్యసభ సభ్యుడు ఠాకూర్ జుగల్‌సింగ్ లోకండ్‌వాలా, జాతీయ బీసీ కమిషన్ సభ్యుడు తల్లోజు ఆచారి, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కాటం నరసింహ, ఓఎన్‌జీసీ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఈబీసీ రిజర్వేషన్లు అమలు కాకపోవడం దురదృష్టకరం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే:ఆర్థికంగా వెనుకబడిన వారిని దృష్టిలో ఉంచుకుని మోదీ ప్రభుత్వం ఆ వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. దురదృష్టవశాత్తు అవి తెలంగాణలో అమలు కావడం లేదన్నారు. వాసవీ సేవా కేంద్రం వ్యవస్థాపకులు కొత్తూరు సీతయ్య గుప్తా 108వ జయంత్యుత్సవాల నేపథ్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కిషన్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పక్కనే ఉన్న ఏపీ, మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో ఈబీసీ రిజర్వేషన్లను అమలు చేస్తున్నా తెలంగాణలో పట్టించుకోవడం లేదన్నారు.

రూ.50లక్షల బీమా సొమ్ము స్వాహాకు యత్నం

ప్రభుత్వ ఉపాధ్యాయుడి నిర్వాకం

గూడూరు, న్యూస్‌టుడే: పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పే ప్రభుత్వ ఉపాధ్యాయుడే మోసానికి తెరదీసిన ఉదంతమిది. చనిపోయే వ్యక్తిపై రూ.50 లక్షలకు బీమా చేయించి ఆ సొమ్మును కాజేయాలని చూశాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు సమీపంలోని ఆళ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడైన బానోత్ నెహ్రూ.. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం చక్రుతండాకు చెందిన దివ్యాంగుడు బానోత్ బాలు(29) మధ్య దూరపు బంధుత్వం ఉంది. అనారోగ్యంతో బాధపడుతుండే బాలు ఎలాగూ చనిపోతాడని భావించిన నెహ్రూ ఓ పథకం పన్నాడు. అతడు చనిపోవడానికి నెల రోజుల ముందు ఇల్లెందు శ్రీరాం లైఫ్ ఇన్సూరెన్స్‌లో రూ.50 లక్షలకు బీమా చేయించాడు. నామినీగా తన పేరు పెట్టుకున్నాడు. ఈ వ్యవహారంలో రక్త సంబంధీకుల పాత్ర కూడా ఉన్నట్టు ఆరోపణలున్నాయి. బీమా పొందాలంటే చనిపోవడానికి కనీసం మూడు నెలల ముందు ప్రీమియం చెల్లించాలనే నిబంధన ఉంది. అందుకే మార్చి 26న బాలు చనిపోయినా బయటకు పొక్కనీయలేదు. మే 26న మృతి చెందినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసి తప్పుడు ధ్రువపత్రం సృష్టించి నెహ్రూ బీమా కంపెనీకి అందజేశాడు. విచారణ నిమిత్తం గ్రామపంచాయతీ కార్యాలయానికి వచ్చిన కంపెనీ ప్రతినిధులు వాస్తవాన్ని గ్రహించారు. గ్రామ కార్యదర్శి రజిత పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టి శనివారం నెహ్రూని అదుపులోకి తీసుకుని చీటింగ్, ఫోర్జరీ కేసులు నమోదు చేసినట్లు ఎస్సై యాసిన్ తెలిపారు.

దక్షిణాంధ్రపై ఉపరితల ఆవర్తనం

3 రోజులపాటు తేలికపాటి వర్షాలు

ఈనాడు, హైదరాబాద్ : దక్షిణాంధ్రపై 7.6 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. బంగాళాఖాతం ఉత్తర ప్రాంతంలో 3.1 కిలోమీటర్ల ఎత్తున మరో ఉపరితల ఆవర్తనం ఏర్పడిందని పేర్కొన్నారు. సోమవారం నాటికి బంగాళాఖాతం వాయవ్య ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని చెప్పారు. తెలంగాణలో ఆదివారం నుంచి 3 రోజుల పాటు తేలికపాటి నుంచి ఒక మాదిరి వర్షాలు పడే అవకాశాలున్నాయని ఆయన వివరించారు. శనివారం పగలు రాష్ట్రంలో 58 ప్రాంతాల్లో తేలిక పాటి వర్షాలు కురిశాయి. అత్యధికంగా దోమ(వికారాబాద్ జిల్లా)లో 8.5 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

కాంగ్రెస్ దుకాణం బంద్

- భాజపా రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ ఎద్దేవా
- సెప్టెంబరు 17న అమిత్‌షా తెలంగాణకు వస్తారు
- విమోచన దినోత్సవం జరిపి తీరుతామని వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: "ఉమ్మడి రాష్ట్రంలో రోశయ్య సీఎంగా ఉన్నప్పుడు తెలంగాణ విమోచన దినోత్సవం అధికారికంగా నిర్వహించాలని తెరాస డిమాండ్ చేసింది. అధికారంలోకి వచ్చాక ఎందుకు మాట తప్పింది? నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్నా." అని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ పేర్కొన్నారు. సెప్టెంబరు 17న భాజపా జాతీయాధ్యక్షుడు అమిత్‌షా తెలంగాణకు వస్తున్నారని.. ఆ రోజున విమోచన దినోత్సవాన్ని నిర్వహిస్తామని, బహిరంగసభ కూడా జరుపుతామని స్పష్టం చేశారు. శనివారం సాయంత్రం పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌లపై లక్ష్మణ్ ధ్వజమెత్తారు. కాంగ్రెస్ దుకాణం బంద్ అయిపోతుందని.. తెరాసలో ఎందరు నేతలు మిగులుతారో చూడాలని వ్యాఖ్యానించారు. "కేటీఆర్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయి. దేశభక్తి, లౌకికవాదంపై ఆయన మాట్లాడుతుంటే జనం నవ్వుకుంటున్నారు. హిందువుల మనోభావాల్ని గాయపరిచిన మజ్లిస్‌తో అంటకాగడం.. తెరాస దృష్టిలో లౌకికవాదమా? అని ప్రశ్నించారు. తెలంగాణలో తెదేపా ఖాళీ కాబోతుందని.. ఆ పార్టీలో మిగిలిన నేతలు భాజపాలో చేరబోతున్నారని అన్నారు.

కేటీఆర్ భాషలో ఉత్తమ్ వ్యాఖ్యలు

అన్ని పార్టీల నేతలు భాజపాలోకి వస్తుంటే కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని.. కేటీఆర్ భాషలో ఉత్తమ్ కుమార్‌రెడ్డి మాట్లాడుతున్నారని లక్ష్మణ్ విమర్శించారు.

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్. పక్కన రామచందర్‌రావు

కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేవారే తప్ప.. ఆ పార్టీలోకి ఎవరూ చేరరని.. ఆ పార్టీ కార్యాలయానికి టూ-లెట్ కాదు. ఫర్ సేల్ బోర్డు పెట్టుకోవాలంటూ ఎద్దేవా చేశారు. "మాజీ ఎంపీ వివేక్ ఇంటికి ఉత్తమ్ వెళ్లి గంటసేపు బతిమలాడినా ఆయన భాజపాలోకే వచ్చారు. భవిష్యత్తు భాజపాదే. అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడొచ్చినా భాజపా జెండా ఎగరేయడం ఖాయం" అని ధీమా వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టు తప్ప పాలనను గాలికి వదిలేశారని మండిపడ్డారు. సచివాలయ భవనం కూల్చివేత, ఇతర అంశాల్ని అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లామని లక్ష్మణ్ చెప్పారు.

పీఆర్‌సీ జాప్యంపై సీఎం సమాధానం చెప్పాలి: ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

ఈనాడు, హైదరాబాద్: గత ఏడాది జులై నుంచి అమలుకావాల్సిన 11వ పీఆర్‌సీలో జరుగుతున్న జాప్యానికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. శనివారమిక్కడ జరిగిన టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ విషయంపై ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం శోచనీయమన్నారు. ఉపాధ్యాయుల పదోన్నతులకు వెంటనే కాలపట్టిక ప్రకటించాలని.. నగదు రహిత వైద్యం పక్కాగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి, సంఘం నేతలు మాణిక్‌రెడ్డి, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబరు 14 నుంచి 'భద్రాద్రి ఆట బాలోత్సవం'

ఈనాడు, హైదరాబాద్: వచ్చే నెల 14, 15 తేదీల్లో 'భద్రాద్రి ఆట బాలోత్సవం' జరగనుంది. పలు స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఉత్తమ ఉపాధ్యాయుల అసోసియేషన్ - తెలంగాణ (ఆట) ఈ కార్యక్రమాన్ని భద్రాచలంలో నిర్వహిస్తోంది. ఉత్సవ కరపత్రాన్ని విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు జనార్దన్‌రెడ్డి, రఘోత్తమ్‌రెడ్డి, నిర్వాహకుడు బెక్కంటి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దిల్లీ తుగ్లకాబాద్ లో గురు రవి దాస్ ఆలయం కూల్చివేతతో పంజాబ్‌లో దావోబా ప్రాంతంలో దళితులు ఆందోళనకు దిగారు. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలతో అధికారులు శనివారం దిల్లీ తుగ్లకాబాద్‌లో ఉన్న ఈ ఆలయాన్ని కూల్చివేశారు. .పంజాబ్‌లోని నవాషార్, ఆదంపూర్, జలంధర్, హోషియార్‌పూర్ లలో దళితులు నిరసన తెలిపారు.

EDUCATION
★ Ag.BSc Seats Avlble in ICAR Colleges@ Maharastra ✆ 7993680148 /9100948360.
★ SPOT ADMISSIONS. College Estd: 2001, Degree, PG, M.Sc, B.Ed & Ph.D. Principal ✆ 8186047777

నో ఎంట్రన్స్ టెస్ట్-For D.Ed (TTC)-2018-20 MED -2019-21 (EM&TM) Govt Fee Only
శ్రీగౌతమి విద్యాసంస్థలు దర్శి, ప్రకాశం జిల్లా, ఎ.పి. 91775 36054 94928 17397

సాగర్ నుంచి సాళ్లలోకి

- నేడు సాగర్ కుడి, ఎడమ కాలువలకు నీటి విడుదల
- తుంగభద్ర గేట్ల ఎత్తివేత

ఈనాడు, హైదరాబాద్, నాగార్జునసాగర్, న్యూస్‌టుడే : సాళ్లను తడిపేందుకు కృష్ణమ్మ ఉవ్విళ్లూరుతోంది. ఎగువ నుంచి వస్తున్న ప్రవాహం క్రమంగా పెరుగుతుండటంతో ముందుగానే నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేయాలని తెలంగాణ, ఏపీ రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఆదివారం తెలంగాణ విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఏపీ జలవనరుల శాఖ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్ కలిసి రెండు రాష్ట్రాల ఆయకట్టుకు నీటిని విడుదల చేయనున్నారు. శనివారం పొద్దుపోయే సమయానికి సాగర్‌లో నీటిమట్టం 590 అడుగులకు 524.30 అడుగుల వద్ద ఉంది. పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యం 312.05 టీఎంసీలకుగాను 156.30 టీఎంసీలకు చేరుకుంది. మరోవైపు కర్ణాటకలో భారీ వర్షాలు కురుస్తుండటంతో పెద్ద ఎత్తున ప్రవాహం కృష్ణానదిలోకి చేరుతోంది. దీంతో ఆలమట్టి జలాశయానికి వరద ఉప్పొంగుతోంది. శనివారం సాయంత్రానికి ఇక్కడ ఆరు లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా దిగువకు 5.30 లక్షల క్యూసెక్కులు వదులుతున్నారు. నారాయణపూర్ నుంచి 6.15 లక్షల క్యూసెక్కులు, భీమా నది నుంచి 95 వేల క్యూసెక్కుల వరద దిగువకు వస్తోంది. శనివారం రాత్రికి జూరాల జలాశయం నుంచి శ్రీశైలం వైపు 6.30 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉంది. తుంగభద్ర జలాశయం కూడా నిండటానికి వచ్చింది. శనివారం రాత్రి ఈ జలాశయం 20 గేట్లను ఎత్తి దిగువకు నీటి వదిలారు. ప్రస్తుతం శ్రీశైలంలోకి 6.61 లక్షల క్యూసెక్కులు వస్తోంది. శ్రీశైలం నుంచి విద్యుదుత్పత్తి, పది గేట్ల ద్వారా 4.61 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. మరోవైపు గోదావరి పరీవాహకంలో ఎల్లంపల్లి, కడెం జలాశయాల నుంచి దిగువకు 5 వేల క్యూసెక్కులకు పైగా దిగువకు వదులుతున్నారు. పేరూరు వద్ద నదిలో 7,41,573 క్యూసెక్కుల ప్రవాహం కొనసాగుతోంది.

నాగార్జునసాగర్ జలాశయంలో శనివారం నాటికి నిల్వ ఉన్న నీరు

మేడిగడ్డ బ్యారేజీ 65 గేట్ల ఎత్తివేత

కాళేశ్వరం, మహదేవపూర్ (న్యూస్‌టుడే): భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టు మేడిగడ్డ బ్యారేజీ 65 గేట్లను శనివారం ఎత్తి నీటిని కిందికి వదిలిపెట్టారు. ఇన్‌ఫ్లో 2.65 లక్షల క్యూసెక్కులు ఉండగా అంతేస్థాయిలో కిందికి వదులుతున్నారు. అన్నారం బ్యారేజీ 10 గేట్లను ఎత్తగా దిగువకు 45,400 క్యూసెక్కుల ప్రవాహం వెళ్తోంది. పెద్దపల్లి జిల్లా మంథని మండలంలోని సుందిళ్ల బ్యారేజీ 12 గేట్లు ఎత్తి 17,940 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు.

సాగర్ నుంచి 22.50 లక్షల ఎకరాలకు నీరు

నాగార్జునసాగర్ జలాశయం నుంచి తెలుగు రాష్ట్రాల్లోని 22.50 లక్షల ఎకరాలకు నీటిని విడుదల చేయనున్నట్లు ప్రాజెక్టు ముఖ్య ఇంజినీరు నర్సింహ తెలిపారు. ఎడమ కాల్వ పరిధిలో తెలంగాణలోని 6.40 లక్షల ఎకరాలు, ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టులో కాలువల కింద 2.50 లక్షల ఎకరాలకు నీటిని అందించేందుకు తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. ఏపీ పరిధిలో ఎడమ కాలువ కింద 3.60 లక్షల ఎకరాలకు, కుడి కాలువ కింద పది లక్షల ఎకరాలకు నీటిని విడుదల చేస్తామన్నారు.

కృష్ణాగోదావరి బేసిన్లలోని ప్రాజెక్టుల్లో శనివారం నాటి నీటి నిల్వలు, ప్రవాహాల వివరాలు

ప్రాజెక్టు పేరు	పూర్తిస్థాయి నీటినిల్వ (టీఎంసీల్లో)	ప్రస్తుత నీటినిల్వ (టీఎంసీల్లో)	వస్తున్న ప్రవాహం (క్యూసెక్కుల్లో)	దిగువకు విడుదల (క్యూసెక్కుల్లో)
కృష్ణా పరీవాహకం				
ఆలమట్టి	129.72	89.29	6,00,833	5,30,000
నారాయణపూర్	37.64	25.39	6,20,000	6,15,420
ఉజ్జయిని	117.24	117.24	47,109	95,935
జూరాల	9.66	5.90	6,25,000	6,30,000
తుంగభద్ర	100.86	81.58	2,11,272	75,000
శ్రీశైలం	215.81	204.79	6,61,760	4,61,560
నాగార్జునసాగర్	312.05	156.30	3,93,907	15,157
పులిచింతల	45.77	1.03	--	--
ప్రకాశం బ్యారేజీ	3.07	3.07	14,275	14,275
గోదావరి పరీవాహకం				
సింగూరు	29.91	0.47	20	20
నిజాంసాగర్	17.80	0.14	0	10
శ్రీరామసాగర్	90.31	15.04	11,850	372
మధ్యమానేరు	25.87	3.53	235	83
దిగువ మానేరు	24.07	3.53	--	204
కడెం	7.60	6.50	5,557	5,359
ఎల్లంపల్లి	20.18	19.51	5,568	5,568
ధవళేశ్వరంబ్యారేజీ	2.93	3.18	14,05,320	13,97,620

DIRECTORATE OF ADMISSIONS
OSMANIA UNIVERSITY, HYDERABAD
Notification for Entrance Test for Admission into MBA (2 yrs) & M.C.A. (3 yrs) through Distance Mode
Applications through online mode are invited for entrance test and admissions into M.B.A.(2 yrs.) and M.C.A.(3 yrs.) courses offered by PGRR Centre for Distance Education, Osmania University under distance mode for the academic year 2019-20. The last date without late fee for application is 31.08.2019 (with a fine of Rs.500/-, it is 10.09.2019). For eligibility criteria, online application, syllabi of entrance test, registration fee, entrance test date and other rules & regulations, candidates are advised to visit the websites: www.ouadmissions.com, www.osmania.ac.in and www.oucde.net.
Note: TS ICET-2019 qualified candidates can get direct admission. Therefore, they need not apply. They are advised to visit the website after 10th September, 2019.
HYDERABAD
Date: 09.08.2019
Prof. N. KISHAN
DIRECTOR

DIRECTORATE OF ADMISSIONS
OSMANIA UNIVERSITY, HYDERABAD
Notification for Entrance Test for Admission into DBT Sponsored P.G Diploma Program: 2019-20
Applications are invited from eligible candidates for entrance test and admission into Department of Biotechnology (DBT) sponsored one year Postgraduate Diploma Program in Medical Biotechnology on Genetic Counseling with Special Emphasis on Prenatal and Postnatal Diagnostics offered by Institute of Genetics & Hospital for Genetics Diseases, Osmania University, Begumpet, Hyderabad. For eligibility criteria, application form, entrance test syllabi and for detail Information visit the websites, www.osmania.ac.in, www.instituteofgeneticsou.org and www.ouadmissions.com, The last date for the submission of filled in application is 03.09.2019.
HYDERABAD
Date: 09.08.2019
Prof. N. KISHAN
DIRECTOR

ఈనాడు పెళ్లిపందిరి

అనువైన సంబంధాల ఎంపికలో మీ ఆత్మీయ బంధువు

TG

వధువు కావలెను

KAPU 28 5'10" BE MBA MNC 25(L) P.A ★ 26 5'7" BE (BITS) MNC 30L PA ★ 29 5'9" MBBS DM 20Cr ★ 29 6' BE (BITS) MBA (IIM) MNC 30(L) P.A ★ 27 5'8" MS 180K ★ 9989019945 (A)

Goud 29/ 5'5" MS Presently Working @ USA / WIPRO Own House Hyd. Seeks Bride PG CNB Cont: Parents: 8686907116 / 6301927704 (A)

బ్రాహ్మణ, మధ్వాధులస, 41 సం॥, 5.5', లేట్ మ్యారేజ్, 25 వేలు, 2 కోట్ల ఆస్తిగల వరుడికి బ్రాహ్మణ వధువు కావలెను. శాఖాబేదం లేదు. Cell: 91779 60482. (G)

రెడ్డి 1990/ 5'10" B.Tech/ M.Tech (IIT)/ 25L PA / Hyd ★ 1986/ 5'10" B.Tech/ Business/ 12L PA/ Hyd. 9505551788 / 9848221166 (A)

రెడ్డి 1992/ 5'6" B.Tech/ MS/ Business/ 2Cr. P.A/ 100Cr ఆస్తి /Hyd. ★ 1991/ 5'11" B.Tech/ MS/ కెనడా P.R/ Rich 8885559579 / 9848221166 (A)

రెడ్డి 1991/ 5'11" B.Tech/ MS/ US/ 110K/ Rich ★ 1991/ 5'6" B.Tech/ MS/ Australia/ 60K. నవీన్‌రెడ్డి M.B. 7893333726 / 9848221166 (A)

Reddy/ Business/ Very Huge Property ★ B.Th/ MS ★ 27/6' ★ 28/ 5'11" ★ 31/ 5'8" ★ 31/ 5'11" ★ 25/ 5'10" ★ 29/ 6' ★ Cont K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309 (A)

Reddy/ MBBS/ PG/ Very Huge Property ★ 30/ 5'11" ★ 26/ 5'10" ★ 27/ 5'11" ★ 30/ 6' ★ USA 29/ 6'/ 50 Cr ★ 32/ 6' ★ Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015 (A)

Reddy/ B.Th/ MS/ H1/ USA/ Very Huge Property ★ 28/ 5'10" ★ 29/ 5'10" ★ 29/ 5'7" ★ 28/ 5'11" ★ 26/ 6 ★ 34/ 5'10" ★ Cont: K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309 (A)

విశ్వబ్రాహ్మణ 28 5'9" B.Tech SWE HCL 12 Lakhs PA వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన తగిన వధువు కావలెను. 9959354361. (A)

కమ్మ 28, 5'9", B.Tech, Sr. SWE, MNC 20 Lakhs PA వెల్‌సెటిల్డ్ వరునికి సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువు కావలెను. 9866158793. (A)

కాపు/ కుల కట్న ప్రసక్తి లేదు/ 27/ 5'10"/ B.Tech/ SWE/ Dell America/ 6L P/M 15 Cr. ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. 9246191907. (A)

రజక: CA/ చార్టర్డ్ అకౌంటెంట్/ 80,000/- PM, 6' ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271. (A)

బెస్త గంగపుత్ర: M.Sc/ C. Govt. ట్యాక్స్ ఆఫీసర్/ ఇన్‌కమ్ టాక్స్ Dept./ 70,000/- PM, 5'10" ఎత్తు, 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9618008271. (A)

ముదిరాజ్: కట్న ప్రసక్తి లేదు. B.Tech/ C. Govt. క్యాషియర్ & క్లర్క్/ SBI బ్యాంక్/ 40000/- PM, 6' ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 6309319756. (A)

గౌడ: కట్న ప్రసక్తి లేదు. B.Tech/ C. Govt. అకౌంటెంట్ ఆఫీసర్/ పోస్టల్ Dept./ 45,000/- PM, 5'11" ఎత్తు, 27 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9908222406. (A)

హిందుమాల: కట్న ప్రసక్తి లేదు. B.Tech/ C. Govt. Asst. మేనేజర్/ SBI బ్యాంక్/ 60,000/- PM, 5'11" ఎత్తు, 28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. ✆ 9966760501. (A)

రెడ్డి/ కట్న ప్రసక్తి లేదు/ 27/ 5'11"/ B.Tech SWE/ Sony/ 14L PA, 50 Cr ప్రాపర్టీ గల అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246171703. (A)

బ్రాహ్మణ 26/ B.Tech (NIT)/ 28 L/ ★ 28/ B.Tech 22L ★ 33/ B.Tech MBA 15L ★ 30/ B.Tech (MS/ US) $ 130K ★ 31/ MD ★ 9440449285 (A)

'పెళ్లిపందిరి' ప్రకటనలు పాఠకులకు అనుకూలంగా వర్గీకరించి ప్రచురింపబడతాయి. ఈ విషయంలో ఎట్టి కంప్లయింట్లకు ఆస్కారం లేదు.

కమ్మ 38Y, 5'11", ఫెయిర్ SR SWE వెల్‌సెటిల్డ్ 2వ పెళ్ళి (USA లో జాబ్) H1 వీసా 1, 2వ వధువు కావలెను. ఫోటో వివరాలు డైరెక్ట్- వాట్సప్: ✆ 9700018048 (A)

కుల ప్రసక్తిలేని 49 సం॥ల MBBS, MD డాక్టర్ వరునికి తగిన వధువు కావలెను. వాట్సప్: 9110227411/ 8277279565 (A)

కమ్మ ప్రత్యేకం 1 to 50 Cr above ఆస్తి, 25 to 42Y USA/Aust/ Ind వరులకు వధువు కావలెను. సంప్ర: శారద: ✆ 9849413031 (A)

కమ్మ 63, 5'5", Hyd, MBA రిటైర్డ్ మేనేజర్, సింగిల్‌కు ఏ బాదరబందీలేని ఒంటరి యువతి 50 to 58Y కమ్మ/ FC వధువు కావలెను. డైరెక్ట్: 9618510985 (A)

Vysya 37/5'3" 2nd మ్యారేజి 2.5L P.M Qlfi CA ACA (UK) B.Com 2Cr స్థిరాస్తి గల వరుడికి సాంప్రదాయమైన 1st మ్యారేజి వధువు కావలెను. ✆ 7330791587 (A)

కమ్మ 27/5'11/ B.Tech/ SWE/ Microsoft/ 14L P/A 15 Cr స్థిర ఆస్తులు గల సాంప్రదాయ కుటుంబం వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246964555 (A)

కాపు: 26, 5'11" Doctor, Property, 70Cr. వరుడికి Any Doctor Engg. PG సాంప్రదాయమైన వధువు కావలెను. ✆ 9346344474 (A)

SC హిందుమాల (కట్న ప్రసక్తిలేదు) 27/ 5'10" B.Tech/ Govt. బ్యాంక్ మేనేజర్/ 80,000/- PM అందమైన వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9246151501 (A)

రెండోపెళ్ళి/ కుల, కట్న ప్రసక్తిలేదు/ 50/5'5" 90 వేల PM గవర్నమెంట్ జాబ్ వరునికి వెల్‌సెటిల్డ్ వైశ్య లేదా బ్రాహ్మణ లేదా పద్మశాలి వధువు కావలెను. వాట్సప్: 9949595523 (A)

కాపు/ కుల/ కట్న ప్రసక్తిలేదు/ 2nd మ్యారేజ్ 38/ 5'8" B.Tech/ SWE 40L P/A వెల్‌సెటిల్డ్ వరుడికి తగిన 1st/ 2nd మ్యారేజ చదువుకున్న వధువు కావలెను. ✆ 9246333320 (A)

విశ్వబ్రాహ్మణ/ 26/5'8"/ B.Tech (ECE)/ SWE/ 20 Lakhs. PA/ వరునికి తగిన సాంప్రదాయ కుటుంబానికి చెందిన వధువు కావలెను ✆ 9676812525. (A)

SC హిందుమాల/ 29/ 5'10"/ M.Tech/ SWE/ Hyd/ 1లక్ష. PM/ అందమైన వరుడికి తగిన వధువు కావలెను ✆ 9390380026. (A)

ముదిరాజ్/ B.Tech/ C.Govt. J.T.O (BSNL)/ 70,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 9052296834 (A)

గౌడ/ M.Tech, NIT/ Govt. కమర్షియల్ టాక్స్ ఆఫీసర్ (ACTO)/ 12 Lakhs P.A/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరునికి తగిన వధువు కావలెను ✆ 9908209244. (A)

పద్మశాలి/ B.Tech, MBA/ C.Govt క్వాలిటి కంట్రోల్ ఆఫీసర్ (FCI)/ 15 Lakhs. P.A/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను ✆ 9985395014. (A)

వెలమ/ B.Tech/ C.Govt. A.E (రైల్వే) 70,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 7288048678. (A)

మాదిగ/ M.Tech/ C.Govt. A.E (BHEL) 80,000/-PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 8886512010. (A)

రజక/ B.Tech/ Govt. A.E (ఇరిగేషన్ Dept)/ 68,000/-PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను ✆ 9581317506 (A)

మాల/ B.Tech, MBA/ C.Govt. మెకానికల్ ఇంజనీర్ (రైల్వే)/ 11 Lakhs. P.A/ 5'9" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను ✆ 9542179041 (A)

పెరిక/ కట్న ప్రసక్తి లేదు/ B.Tech/ C.Govt. Asst మేనేజర్ (SBI)/ 65,000/- PM/ 5'10" ఎత్తు/ 28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. ✆ 7288048678 (A)

రెడ్డి: 29Y/ 5'11"/ B.Tech (IIT), MBA/ S/W in Ban., 35 Lakhs P/A/ 12 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 93461 24845 (D)

కాపు/బలిజ: 29Y/ 5'10"/ B.Tech (VIT), M.Tech (VIT), S/W in Hyd/ 11 Lakhs PA/ 10 Cr. property ఉన్న వరునికి తగిన వధువు కావలెను. 97005 55508 (D)

రాజులు: 32 సం॥, 5.9 ఎత్తు, M.B.A. L.L.M. M.Com చేసి హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్న ఫెయిర్ కలర్ గల అబ్బాయికి కులం పట్టింపు లేని డిగ్రీ చదివి అందంగా ఉన్న వధువు కావలెను. డైరెక్టుగా సంప్ర: karaaju9936@gmail.com, వాట్సప్: 7036404503కు పంపగలరు. (Q)

ఉద్యోగపర్వంతోనే హుషారు!

గృహిణులకు స్వావలంబన చాలా అవసరం. నవదంపతులు ఈ విషయం గుర్తించాలి. ఒకప్పటిలా భార్య కేవలం ఇల్లు, పిల్లల్ని చూసుకుంటూ ఉండాలనుకోవడం సరైనది కాదు. నేడు జీవిత ప్రాథమ్యాలు మారాయి. ఆధునిక మహిళ చిన్నాచితక అవసరాలకు భర్తమీద ఆధారపడటం ఇష్టపడట్లేదు. ఒకవేళ భర్త మొదట్లో ప్రేమతో భార్య అడిగినవన్నీ కొనిపెడుతున్నా ఆమె నిస్సహాయస్థితిని అలుసుగా తీసుకుని పుల్లవిరుపుగా మాట్లాడవచ్చు. అప్పుడు భర్త మాటలు ములుకుల్లా గుచ్చుకుని మనస్సులో కలుక్కుమంటుంది. అది సంసారంపై పెను ప్రభావం చూపించవచ్చు. పైగా పెరుగుతున్న కుటుంబ అవసరాలు తీర్చేందుకు భార్య కూడా సంపాదించాల్సిన అవసరమేర్పడింది. ఇద్దరూ కష్టపడితేకానీ ఇల్లు గడపడం సాధ్యం కావడంలేదు. పిల్లల చదువులు, వైద్యఖర్చులతో పాటు ఇంట్లోకి కావాల్సినవి సమకూర్చుకునేందుకు దంపతులిద్దరూ ఆర్జించాల్సి ఉంటుంది. భర్తకు అన్నింట్లోనూ చేదోడువాదోడుగా ఉండాలని నేటితరం భార్య కోరుకుంటుంది. ఇంటి అద్దె చెల్లించేందుకు, కిరాణా దినుసులు తెచ్చేందుకు, ఆస్పత్రి ఖర్చులు, విద్యుత్ ఛార్జీలు, ఫోన్ బిల్లు, లోన్ వాయిదాలు చెల్లించేందుకు వేన్నీళ్లకు చన్నీళ్లలా ఉండాల నుకుంటుంది. ఉద్యోగం చేసే మహిళలతో పోల్చితే, సంపాదన లేని వారికి మతిమరుపు వచ్చే ప్రమాదం పొంచివుందని లాస్‌ఏంజిలెస్‌లోని అల్జీమర్స్ అసోసి యేషన్‌కు చెందిన పరిశోధకురాలు ఎలిజబెత్ రోస్ మయేదా పరిశోధనలో తేలింది. ఆవిడ ఆరువేల మంది ఉద్యోగినులు, గృహిణులపై అధ్యయనం చేసి ఎన్నో విషయాలు వెల్లడించారు. సొంత ఆదాయం లేకుండా, భర్తపై ఆధారపడే మహిళలు అభద్రత, ఆత్మన్యూనతకు గురవుతారట. భార్య సంపాదనతో ఆర్థికంగా కుటుంబానికి చేయూతనిస్తుంటే అందులోని హుందాతనం మాటల్లో చెప్పలేనిదట. తద్వారా ఆమెలో ఆత్మస్థైర్యం పెరుగుతుంది. అందువల్లనే మానసికరుగ్మతలు దరికి చేరవట.

ఖరీదు కట్టే షరాబు ఎవరు?

భార్య బయటికెళ్లి ఉద్యోగం చేయకపోయినా, పిల్లల్ని చూసుకుంటూ, ఇంటి పనినంతా తనొక్కతే సంబాళించుకుంటుంది. పొద్దున్న ఐదు గంటల నుంచి రాత్రి పదిదాకా ఆవిడ ఓ యంత్రంలా విరామమెరుగక పరిశ్రమిస్తూనే ఉంటుంది. ఆమె ఇంటిపట్టున ఉంటూనే గృహకృత్యాల్లో తిరగడం లెక్కిస్తే అది రోజుకు ఐదారు కిలోమీటర్లకు పైనే ఉంటుంది. పైగా నిద్రను కూడా గృహిణి త్యాగం చేస్తుంది. అంతేకాకుండా అన్ని పనుల్లోనూ మానసికంగా భర్తకు అండగా ఉంటూ, ధైర్యాన్నిస్తుంది. రోజుకు మరో ఇరవైనాలుగు గంటలు తోడయినా ఆమె పనులు ముగియవని పిస్తుంది. చాలా కుటుంబాల్లో అర్ధాంగి ఇంటిపని, వంటపని చేసుకుంటూనే భర్తకు తీసిపోకుండా ఉద్యోగాల్లో రాణిస్తోంది. ఇంకా కొన్ని కుటుంబాల్లో భార్య గడపదాటి బయటికెళ్లి ఉద్యోగాలు చేయకపోయినా ఇంటివద్దే కుట్లు, అల్లికలు చేయడం, పిల్లలకు ట్యూషన్లు చెప్పడం, చిరు వ్యాపారాలు నిర్వహించడం లాంటివి చేస్తున్నారు. కానీ భార్య ఎంత చాకిరీ చేసినా దానికి తగ్గ విలువ, గుర్తింపు, ప్రశంస భర్తవైపునుంచి అనుకున్నంతగా రావట్లేదు. దాంతో భార్యలో నిర్లిప్త భావన చోటు చేసుకుంటుంది. సంపాదించుకుని రావడం వరకే తన బాధ్యత అన్నట్లుగా భర్తలు మెలగడం సరైనది కాదు. ఆఫీసు పని ఏడెనిమిది గంటలు మాత్రమే ఉంటుంది. కానీ ఓ గృహిణి బాధ్యతలు రోజుకు పన్నెండునుంచి పదహారు గంటల వరకూ ఉంటాయి. అందువల్ల ఇంటికొచ్చాక భర్త తన మానాన తను కాలక్షేపం చేయకుండా భార్యకు ఇంటిపనుల్లో సాయపడితే బాగుంటుంది. తద్వారా వారి మధ్య మాటామంతీ, సహకారం, సానుభూతిలాంటి ధనాత్మక భావనలు పెరుగుతాయి. వారు మరింత దగ్గరవుతారు. నవదంపతులు ఇంటిపనుల్లో ఒకరికొకరు సాయపడుతుంటే వారి సంసారం ఆనంద సాగరమవుతుంది.

\- కె. రఘు

ఈ కథనాలపై మీ అభిప్రాయాలు, సూచనలు **pelli@eenadu.net** కు మెయిల్ చేయండి.

కమ్మ/ USA/ 31 Y, 5'5", MS (CS), $ 150K P/A, H1B, 10 Cr ★ 27 Y 5'5", Fair, MS, 4 L P/M, H1B, 3 Cr. ✆ 80196 58575, 73863 38574. (B)

అమెరికాలో జాబ్‌చేస్తున్న Sunni Muslim వధువుకు B.Tech/ M.Tech/ MS/ CA/ MBA/ MCA చేసి Age: 31 to 33 Yrs. Height: 5'6" to 5'9" వుండి Job చేస్తున్న వరుడు కావలెను. నెం.: ✆ 70363 68469. No Brokers. (B)

నాయిని బ్రాహ్మిణ్ అమ్మాయి B.Tech/ C.Govt. SBI క్లర్క్ & క్యాషియర్, 35,000 PM, 5'4" ఎత్తు 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7286966723 (A)

★ ★ ★

SC మాల, Rcm/ క్రిస్టియన్, MBBS, 5.1', Fair, 23yr వధువుకు PG చేస్తున్న, చేసిన వరుడు కావలెను (Direct). ✆ 94405 79953, 95153 64280.

పద్మశాలి: డైవర్సీ, 34 సం॥, 5'5", MCA, SW, బెంగళూర్, 10 L PA, ఫెయిర్ గల అమ్మాయికి సాఫ్ట్‌వేర్ జాబు ఉన్న 1, 2 వరుడు కావలెను. డైరెక్టు: ✆ 70324 79321 (F)

ముదిరాజ్ 37 Yrs. 5'3" Fair BAMS/ MD Govt.Job 45K P/M ★ 27 Yrs 5'3" B.Tech (EEE) SWE 50K P/M వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. అర్జెంట్ ✆ 9398782825 (A)

నాయీ బ్రాహ్మణ/ 26 సం॥/ 5'2"/ M.PED/ Govt. Contract Lecturer/ ఖమ్మం/ అందమైన వధువుకి వరుడు కావలెను. సంప్ర: 9652545643, 9100337527. (Q)

గౌడ్/ 27/ 5'5"/ బిటెక్ 30K, 2 కోట్లు; 24/ 5'1"/ బిటెక్/ MBA, 2 కోట్లు; 26/ 5'4"/ బిటెక్/ 25K, 2 కోట్లు తగిన వరుడు కావలెను. 9440454842. (A)

గంగపుత్ర (బెస్త) B.Tech 23/ 5'4" SWR Job Sal: 60,000/- PM ఒక్కరే కుమార్తె వధువుకు వరుడు కావలెను. No - బ్రోకర్స్. ✆ 8897091964. (A)

★ ★ ★

గమనిక

పెళ్ళిపందిరి ప్రకటనలకు ప్రతిస్పందించేముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. వధువు/వరుడి హోదా, వయస్సు, ఆదాయం గురించిన వివరాలకు సంబంధించి ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిమ్‌లతో మరియు మీరు చేసుకునే ఆర్థిక లావాదేవీలతో (వధువు/వరుడు పూర్తి వివరాల కోసం డబ్బు డిపాజిట్ చేయడం/ట్రాన్స్‌ఫర్ చేయడం వగైరా) ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధంలేదు. "భవిష్యత్‌లో కలగబోయే సంతానానికి ఎలాంటి జన్యుపరమైన వైకల్యాలు లేకుండా నివారించుకునేందుకు జీవిత భాగస్వామిని ఎంచుకునే ముందు ఆరోగ్యపరీక్ష చేయించవలసినదిగా కూడా సూచించడమైనది". పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఫ్రీ రిజిస్ట్రేషన్, అన్ని కులముల వారికి Govt/ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ NRI/ Pvt బిజినెస్ 1, 2వ లేట్, AP/TS 15 సం॥ల Exp. అన్ని స్థాయిల వారికి సంబంధాలు కలవు. ✆ 7095940444 (A)

మాల, మాదిగ, IAS, IPS, ITRS, IFS, MBBS, MS, MD, Govt.Jobs, SWE, USA, Group-I, II; 7893013265 (N)

స్పెషల్లీ డాక్టర్స్: (5వేల ప్రొఫైల్స్) MBBS, MD, MS, DM, MCH, MDS & డా॥ కి మాత్రమే. 1వ, 2వ, లేటు, దేశ, విదేశీ సంబంధాలు అన్నికులములకు కుదర్చబడును. ✆ 9701655685 (A)

Since 1989 శ్రీకన్య వివాహవేదిక Hyd అన్ని కులాల & కులాంతర లేట్ మ్యారేజ్, ఇండియా/ అబ్రాడ్ వేల్పుల భిక్షపతి ✆ 9396617778/ 9849027778 (A)

విశ్వబ్రాహ్మణ పెళ్ళిసంబంధాల ప్రత్యేక వివాహ వేదిక, గుంటూరు, బ్రహ్మముడి, కమీషన్ డిమాండ్ లేదు. ✆ 0863-2261898, 94911 25725 (I).

Kamma Choudhary Marriages Hi Range/ Hi Studies/ Engg/ Dr's, Ind/ Abroad Late 1st/ 2nd/ Divorce Ph: 9100189499/ 040-48526061 (A)

What'sApp Your Photo & Biodata to 9347262769. we will send the suitable Matches. www.pellisandadi.com (A)

Mala (SC) Free మాలమహానాడు ఆధ్వర్యంలో వివాహ సంబంధాల సెటిల్‌మెంట్ కొరకు సంప్ర॥ 90109 22444/ 75694 60054.

డాక్టర్స్ డాక్టర్స్ 6000 ప్రొఫైల్స్ అన్ని కులాల MBBS/MD/ MS/DM/ MCH/ BDS/MDS, బిజినెస్‌లకు 1వ, 2వ ఇండియా & విదేశాల సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును. మా బ్రాంచీలు వైజాగ్, హైదరాబాద్. ✆ 9966808059 (A)

స్పెషల్లీ కాపు: డాక్టర్స్, డాక్టర్స్, సాఫ్ట్‌వేర్స్, అబ్రాడ్స్, బిజినెస్ & అందరికీ AP/ తెలంగాణ/ కర్ణాటక & దేశ, విదేశీ సంబంధాలు ఫాస్ట్‌గా కుదర్చబడును. ✆ 9121010959. (A)

నోవా మ్యాట్రిమోని కళ్యాణవేదిక అన్ని కులాల వారికి మొదటి, రెండవ డైవర్సీ, విడో సంబంధాలు కుదర్చబడును. ✆ 8012949999/ 8121546789 (A)

★ ★ ★

కురుమ యాదవ వివాహ సంబంధాలకు విదేశీ, డాక్టర్స్, ఇంజనీర్ 2వ వివాహ సంబంధాలకు సం॥ kurumapellipandiri.com 9396649499/ 9393001666 Hyd (A)

ఓన్లీ మున్నూరుకాపు మ్యారేజ్ బ్యూరో, కరీంనగర్: డాక్టర్స్/ ఇంజనీర్స్/ NRI/ Govt. మీరు కోరిన పెళ్ళి సంబంధాలకు సంప్ర॥ భ్రమరాంబ MB ✆ 99484 83542 (F)

శుభం గౌడ్స్ మ్యాట్రిమోని గౌడ్స్ వధూవరులకై దేశ, విదేశ, 1వ, 2వ, డా॥ ఇంజనీర్ PG డిగ్రీ బిజినెస్ సం॥లకై సంప్ర॥ బుర్ర శ్రీనివాస్ గౌడ్, Hyd. ✆ 9347519673 / 9247257445 (A)

శ్రీవజ్రావతమ్మ మ్యారేజ్‌బ్యూరో అన్నికులముల వారికి 1వ / 2వ Govt/ SW వివాహ సంబంధాలు శ్రద్ధతో చూపించబడును. ✆ 9908290394/ 7680979053 (A)

★ ★ ★

M.Tech సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ 5'.7" ఎ॥ 29 సం॥ బ్రాహ్మణవైశ్య వరుడికి గ్రాడ్యుయేట్/ ఉద్యోగం చేస్తున్న బ్రాహ్మణ వధువు కావలెను. కట్న కానుకల ప్రసక్తిలేదు. ✆ 9985543717. (C)

కాపు, 40 Yrs, 5'5", బిజినెస్ 1 లక్ష PM, రెండో పెళ్లి, హైదరాబాద్‌లో స్థిరపడిన వరుడికి తగిన వధువు కావలెను. సం॥ 7993702279 (డైరెక్ట్) క్యాస్ట్ నో బార్. (A)

బ్రాహ్మణ/ 6K/ నియోగి/ 30/ 6'/ బి.టెక్/ కౌండిన్యస/ పూర్వాభాద్ర 4 పాదం/ నెలకు 25,000/-+/ రాజమండ్రి దగ్గర. * 9441968176/ 9866664964. (C)

2nd మ్యారేజ్ 35, 5'6", MSc, 60,000/- PM వరునికి అందమైన వధువు కావలెను. Caste No Bar. గౌడ్స్/ కాపు వారు సంప్ర॥ 9347033171 (A)

Arya Vysya, 33 Yrs, 5'5", M.Tech, Govt. Teacher, Suryapet, 80L, ప్రాపర్టీ వరుడికి వైశ్య వధువు కావలెను. ✆ 9966035660 (A)

బ్రాహ్మణ, 31 సం॥ 5'9", ఫెయిర్, B.Tech, IT చేసిన సొంత వ్యాపారం, హైదరాబాద్‌లో స్థిరాస్తి గల, వెల్‌సెటిల్డ్ అందమైన వరుడికి తగిన ఏదైనా డిగ్రీ చేసిన 28 సం॥ లోపు అందమైన వధువు కావలెను. ✆ 9396998643, 8790329047 (A)

గౌడ 1990 B.Tech IIM SWE, 1991 B.Tech IIT SWE, డాక్టర్స్, MD, PG & MBBS వరులకు వధువులు కావలెను. ✆ 7093458237. (A)

★ ★ ★

రెడ్డి 38 సం HIV ఉన్న వరునికి HIV ఉన్న వధువు కావలెను. Business PM 50000 Contact 6304556325.

హిందు, మాదిగ 35 yrs, 6 ft, BA, B.Ed, Pvt. టీచర్, లేట్ మ్యారేజ్ సాంప్రదాయ వధువు కావలెను. డైరెక్ట్. సెల్: 63008 85655.

Reddy 37/ 5'6" Divorced Sr. Software Engg. US Citizen, Family Financially Welloff. Looking for like minded Educated from same community. ✆ 7337462349. (A)

పద్మశాలి 43, 5'7", BA, బిజినెస్ గల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9248011114 (ఇల్లరికం OK, కుల పట్టింపు లేదు). (A)

Hindu Mala 33 Yrs. 5'8" MS USA SWE Working Hyd (Divers in 3 Months) seeks Pair Girl working. ✆ 8639885166/ 9493967474. (A)

★ ★ ★

రెడ్డి మటాటి, M.Tech, 5.10', 32y, 5.4 LPA, 15 కో.ఆస్తి, 40L ఇన్‌కం గల అందమైన అబ్బాయికి వధువు కావలెను. ✆ 96409 67300. మిర్యాలగూడ. డైరెక్ట్.

వరుడు కావలెను

KAPU 24 5'4" BE MBA MNC 10Cr ★ 27 5'2" BE MS/ MNC 20 Cr ★ 28 5'6" BE MS 120K ★ 26 5'5", MBBS MS (Gynic) 10 Cr ★ 25 5'4" BE (IIT) MNC 24L P.A ✆ 9989019945 (A)

రెండో పెళ్ళి / కులపట్టింపు లేదు / 54/ 5'5"/ Govt / 70 వేలు / ఒక కోటి & 47 / 5'3"/ Govt / 50 వేలు / 80 లక్షలు & 36 / 52 / 30 వేలు / 50 లక్షలు / " మాసేవ " ✆ 9291503949 (A)

కాపు, 24, 5'5", MBBS, MD, జనరల్ మెడిసిన్ చేస్తున్న అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన డాక్టర్/ వెల్‌సెటిల్డ్ S/W వరుడు కావలెను. 7893269621 (A)

యాదవ: 24, 5'4", MBBS, MS, గైనిక్ చేస్తున్న అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు డాక్టర్/ వెల్‌సెటిల్డ్ సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. 8790119700 (A)

SC, 25, 5'4", MBBS, MD, పీడియాట్రిక్ చేస్తున్న అందమైన మంచి ప్రాపర్టీగల వధువుకు తగిన డాక్టర్/ వెల్‌సెటిల్డ్ సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. Ph: 9010247013 (A)

రెడ్డి, 24, 5'5", MBBS, MD, రేడియాలజి చేస్తున్న మంచి ప్రాపర్టీగల అందమైన అమ్మాయికి తగిన డాక్టర్/ వెల్‌సెటిల్డ్ సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. 8897400721 (A)

CNB, 24, 5'5", MBBS, MD, పీడియాట్రిక్స్ చేస్తున్న మంచి అందమైన అమ్మాయికి తగిన డాక్టర్/ సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. 9010244671 (A)

వెలమ, 25, 5'4", MBBS, MS, జనరల్ సర్జన్ చేస్తున్న మంచి ప్రాపర్టీగల వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన డాక్టర్/ సాఫ్ట్‌వేర్ వరుడు కావలెను. Ph: 9010249131 (A)

కులపట్టింపులేదు, బ్రాహ్మణ/ 38y/ 5'4" 2nd మ్యాచ్, ఫెయిర్/ MA. BED/ Govt. Asst. టీచర్./ 70 K.P.M., 2 సొంత ఇల్లులు, వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 7893744393 (A)

కులపట్టింపులేదు, రెడ్డి/ 55y/ 5'5" 2nd మ్యాచ్/ ఫెయిర్/ Govt. స్కూల్ H.M (రిటైర్డ్ ఎంప్లాయి)/ 55K P.M., సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను. (ఇల్లరికం OK). 8897587747 (A)

Kapu 29/ 5'2" B.Tech/ Fair, Rich looking, forfair & Handsome boy from welltodo family ✆ 9848019231 (A)

రెడ్డి 1987/ 5'4" MBBS/ MS / Super Speciality 1st Yr./ Fair & Rich ★ 1996 / 5'3" B.Tech, Fair ✆ 9505551788 / 9848221166 (A)

రెడ్డి 1994/ 5'6" B.Tech/ MS / Fair ★ 1994 / 5'3" B.Tech/ SWE/ Hyd/ 8L PA / 4 Cr. నవీన్‌రెడ్డి మ్యారేజ్ బ్యూరో 8885559579 / 9848221166 (A)

రెడ్డి 1990 / 5.7 1/2 B.Tech/ Fashion Designer / Hyd/ 36L PA/ ★ 25 Cr ★ 1996/ 5'5" Diploma/ Fair / 100 Cr. 7893333726 / 9848221166 (A)

Reddy/ B.Th/ Most Beautiful/ V.Huge Property ★ 29/ 5'4" ★ 29/ 5'3"/ ★ 26/ 5'6" ★ 24/ 5'5" ★ 26/ 5'5" ★ 26/ 5'5 1/2 ★ Cont K.C.Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015 (A)

Reddy/ MBBS/ PG/ Rich ★ 25/ 5'6"/ 30 Cr ★ 29/ 5'5"/ 30 Cr ★ 23/ 5'3"/ 40 Cr ★ 23/ 5'5"/ 30 Cr ★ 26/ 5'3"/ 50 Cr ★ Cont K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9347807015/ 9849321309 (A)

Reddy/ B.Th/ MS/ H1/ USA/ Rich ★ 28/ 5'3"/ 30 Cr ★ 25/ 5'2"/ 40 Cr ★ 27/ 5'7"/ 30 Cr ★ 29/ 5'4"/ 30 Cr ★ 26/ 5'4"/ 25 Cr ★ Cont K.C.Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309 (A)

కాపు/ 24, 5'6", Fr. B.Tech, SWE, 40,000 PM అందమైన సాంప్రదాయక కుటుంబానికి చెందిన వధువుకు తగిన వరుడు కావలెను. 9618483383. (A)

యాదవ: 50 లక్షల ఆస్తి B.Tech/ C. Govt./ మేనేజర్/ SBI బ్యాంక్/ 60,000/- PM, 5'5" ఎత్తు 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8008939651. (A)

మున్నూరు కాపు 24, 5'5"/ B.Tech/ SWE/ Accenture 50,000/- PM, V.Fair అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9246555529. (A)

బ్రాహ్మణ 21/ BSc/ ★ 25/ MBA/ 3L ★ 23/ B.Tech/ SWE/ 3.6L/ ★ 29/ MA ★ 26/ B.Tech MS (US)/ $72K/ ★ 32/ B.Com/ ★ 24 MBBS/ ★ 9494096081 (A)

2వ పెళ్ళి, కాపు, Govt. టీచర్, 55000/- PM, 41Yrs, పిల్లలులేని అందమైన వధువుకు వరుడు కావలెను. (Any FC/BC) Ph: 9666405928 (A)

బ్రాహ్మిణ్స్, 26, 5'4", డిగ్రీ/ 28, 5'4", డిగ్రీ/ అందమైన వధువులకు వరుడు కావలెను. పురోహితము జాబ్, B.Tech, బిజినెస్: 8978691424/ 040-40035518 (A)

వైశ్య 22Y, 5'4" V/ Fair, B.Tech, Pvt. జాబ్ 25K PM సాంప్రదాయపు వధువుకు తగిన వరుడు కావలెను. ✆ 9059158811 (A)

బ్రాహ్మణ 28Y/ 5'4" లోహితసగోత్రం/ డిగ్రీ/ Pvt. జాబ్/ రిక్వైర్‌మెంట్/ ఎనీవెల్‌సెటిల్ ఫ్యామిలీ/ Govt, Pvt. జాబ్ & పురోహితం Ok. ✆ 9959725419/ 9121423830 (A)

రెడ్డి/ విడో/ 30Y/ 5'4"/ రైల్వేజాబ్/ 15 కోట్ల ప్రాపర్టీగల అందమైన వధువుకు కులపట్టింపులేని వరుడు కావలెను. ✆ 9121540854 (A)

SC మాదిగ 23/ 5'5" ఫెయిర్ B.Tech (EEE) SBI PO 45 వేల P/M అందమైన సాంప్రదాయక కుటుంబపు వధువుకు వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. ✆ 9666567123 (A)

కమ్మ 23 5'6" ఫెయిర్ B.Tech SWE TCS 40,000 p/m అందమైన వెల్‌సెటిల్డ్ వధువుకి వెల్‌సెటిల్డ్ వరుడు కావలెను. సంప్రదించండి. ✆ 8499059047 (A)

Yadava 24/5'3" B.Tech/ IBM/ Hyd. 9440831748 ★ 29/ 5'1" B.Tech/ Irrigation Dept/ Karimnagar. 9441735157 ★ 26/ 5'8" M.Tech/ Tirupathi 9440759945 (A)

బ్రాహ్మణ/ 30/5'3"/ BA ★ 34/5'2"/ B.Sc ★ 38/5'3"/ B.Ed పేద వధువులకు వరులు కావలెను జాబ్/ బిజినెస్ Ok. అన్ని శాఖలకై సంప్ర॥ వాట్సప్: 8374994855 (A)

క్రిస్టియన్ మాల/ 25/5'4"/ B.Tech, MBA/ SWE/ Amazon/ Hyd/ 70,000/- PM/ అందమైన వధువుకు తగిన వరుడు కావలెను ✆ 8919759359 (A)

బలిజ-కాపు, 25, 5'4", వైట్, B.Tech, SWE, Infosys, 40 K.P-M, వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. 0877 2230289, 76610 24448 (D)

రెడ్డి, 25, 5'5", వైట్, B.Tech, SWE, TCS, 60 K.P-M, 10 Cro. property వధువుకి వరుడు కావలెను. 0877 2280007, 79010 12671 (D)

కమ్మ: 24 Yrs/ 5'5"/ V.Fair/ B.Tech (CSE), S/W in Bangalore/ 50,000 P/M, 4 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. ✆ 95735 53746 (D)

రెడ్డి: 24 Yrs/ 5'5"/ V.Fair/ B.Tech, CSE, S/W in Bangalore/ 50,000 PM/ 5 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 93902 10126 (D)

గౌడ/ B.Tech/ C.Govt. క్వాలిటి ఇన్‌స్పెక్టర్ (FCI)/ 35,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9052296834 (A)

పద్మశాలి/ ఏకైక కుమార్తె/ B.Tech/ Govt. Jr. Asst (పంచాయితీరాజ్ Dept)/ 28,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 7288048678 (A)

విశ్వబ్రాహ్మణ/ ఏకైక కుమార్తె/ B.Tech/ Govt. Jr. Asst (R&B)/ 28,000/- PM/ 5'4" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 8886512010 (A)

యాదవ/ M.Tech/ C.Govt. Asst. మేనేజర్ (SBI)/ 55,000/- PM/ 5'4" ఎత్తు/ 25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9515755529 (A)

మున్నూరుకాపు/ B.Tech (EEE)/ Govt. A.E. (ఇరిగేషన్ Dept)/ 45,000/- PM/ 5'5" ఎత్తు/ 24 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. ✆ 9912280929 (A).

బ్రాహ్మణ/ లేట్‌మ్యారేజ్/ 33/ 5'3"/ ఇంటర్/ Pvt. జాబ్/ 10,000/- PM అందమైన వధువుకు తగిన జాబ్/ బిజినెస్ వరుడు కావలెను. ✆ 9030056547 (A)

కాపు 26 5'8" M.Tech IIT-Madras అందమైన వధువుకు సెంట్రల్/ స్టేట్ గవర్నమెంట్/ సాఫ్ట్‌వేర్ ఉద్యోగ వరుడు కావలెను. డైరెక్ట్: 94411 45190 (I).

Reddy Fair & beautiful bride 33/5'5" fellowship Hemoncology, USA from top university, rich & highly status, aristocratic family. Seeks age group below 36, 1st match handsome smart & dynamic grooms. Doctors/IIM/IIT Engrs who are working/business in USA or Graduates from top University from Reddy Traditional family Cont: 91+9121204339 Email: reddynh05@gmail.com (A)

బ్రాహ్మణ 21/ 5'3"/ 9th ★ 26/ 5'2"/ 10th ★ 30/ 5'2"/ 7th కట్నాలు ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. పురోహితం అయినా OK. వాట్సప్: 8712244110 (A)

ఆర్యవైశ్య/ 22/ 5'3"/ 10th ★ 26/ 5'2"/ ఇంటర్ ★ 30/ 5'3"/ 10th. కట్నాలు ఇచ్చుకోలేని వధువులకు వరులు కావలెను. వాట్సప్: 7288942198 (A)

బ్రాహ్మణ 22 సం॥ 10th, 5'5" ★ 28సం॥, Inter, 5'4" గల వధువులకు పురోహితం, Job or బిజినెస్‌గల వరుడు కావలెను. శాఖభేదం లేదు. ✆ 9703254044 (A)

కమ్మ: 25Y/ 5'4"/ B.Tech (CSE)/ S/W in Infosys, 4.8 Lakhs P/A/ 5 Cr. property ఉన్న వధువుకి తగిన వరుడు కావలెను. 83097 63574 (D)

కమ్మ/ 25 Y, 5'5", Fair, B.Tech (C.S), Hyd, 4.2 P/A 3 Cr ★ 27 Y, 5'6", Fair, M.Tech, 7.5 L P/A, B'Lore 6 Cr. ✆ 73863 38574, 80196 58575. (B)

వివాహ వేదిక

20 సం॥లు అనుభవం కల్గిన బ్రాహ్మణ వివాహ వేదిక శ్రీ సత్యసాయి వివాహ వేదిక 9849414098, 040-66317515 satyasaivivahavedika.com (A)

గౌడ / శెట్టిబలిజ / ఈడిగ కులస్తులకు / మంజు మ్యారేజ్‌బ్యూరో ఆధ్వర్యంలో / D 01-09-2019 ఆదివారం వధూవరుల వివాహ పరిచయవేదిక జరుగును / హోటల్ సితార/ అమీర్‌పేట / హైదరాబాద్ Cont: 9248001517 / 9246799111 (A)

ఉచిత నాయీబ్రాహ్మణ వివాహ పరిచయవేదిక 8-9-19 ఆదివారం VJA పోరంకి లక్ష్మీనరసింహగార్డెన్. వధువు, వరుడు తప్పనిసరి. సెల్: 94901 95049, 94406 96250. (B)

KAPUNADUPELLIPANDIRI.COM కాపులకు మాత్రమే 15 సం॥ అనుభవం రిచ్ కాపు బాయ్స్ & గర్ల్స్‌కు India & Abroad Matches 9390557593 (A)

కేవలం యాదవ/ కుర్మ వివాహసంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజాయాదవ్ www.gokulmarriage.com Hyd: 9440831748, Gunt:9440759945, VSP:9441735157 (A)

బ్రాహ్మణ వధువు, వరుల సంబంధాల్లకై సంప్రదించండి. S.N.శర్మ, Hyd. ✆ 9248600342, 8019207503, brahmininformationmatri@gmail.com (A)

కులపట్టింపు లేనివారికి, అన్నికులాల/ 1వ/ 2వ/ లేట్/ డైవర్సీ/ విడో/ విడోయర్స్/ పెన్షనర్స్ Age: 20-70 సం॥ స్త్రీలకు... ఫ్రీ, పురుషులకు సర్వీస్ చార్జ్ ఓన్లీ. Ph: 8897587747 (A)

P. Supriyareddy, Rich Reddy Boys & Girls, India & Abroad Matches, all Emp/ Govt/ Pvt/ SWE/ Doc's/ Business/ Divorcees from all Rgions. Contact: Srinagar Colony, Hyd. Ph: 040-23544820, 23545762. EMail: paletisupriyareddy@gmail.com (A)

విశ్వబ్రాహ్మణపారాణి, అత్యధిక బయోడాటాలతో డాక్టర్స్/ సాఫ్ట్‌వేర్, USA మ్యాచెస్ కొరకు/ www.paarani.com, Ongole/ కొండపి విశ్వరూపాచారి. Ph: 9989166590 (A)

జామ్-2020లో జీవశాస్త్రం ఉండదు

ఈనాడు, హైదరాబాద్: ఐఐటీలు, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్(బెంగళూరు)లోని ఎంఎస్సీ, ఎంఎస్సీ-పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాలకు ఏటా నిర్వహించే జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎంఎస్సీ(జామ్)-2020లో.. ఈసారి బయొలాజికల్ సైన్సెస్ ప్రశ్నపత్రం ఉండదు. దాన్ని రద్దుచేస్తున్నట్లు.. ఈసారి పరీక్ష నిర్వహణ బాధ్యతలు తీసుకున్న ఐఐటీ కాన్పూర్ ప్రకటించింది. అంటే బయోటెక్నాలజీ, భౌతిక, రసాయన శాస్త్రాలు, గణితం, జియాలజీ, మేథమేటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్) అనే ఆరు సబ్జెక్టుల్లోనే పరీక్ష జరుగుతుంది. ఇది వచ్చే ఏడాది ఫిబ్రవరి 9 (ఆదివారం) ఉంటుంది. పరీక్ష కేంద్రాలు తెలంగాణలోని హైదరాబాద్, వరంగల్; ఏపీలోని విశాఖపట్టణం, విజయవాడ, తిరుపతిలలో ఉంటాయి. దరఖాస్తులకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ సెప్టెంబరు 5 నుంచి ప్రారంభమవుతుంది. ఫలితాలు వచ్చే మార్చి 20న విడుదల చేస్తారు. వచ్చిన స్కోర్ ఆధారంగా ఎన్ఐటీలు, మరికొన్ని ఇతర సంస్థలు ప్రవేశాలు కల్పిస్తాయి.

నెలనెలా వేతనాలు చెల్లించాలి: పంచాయతీ ఐకాస

కవాడిగూడ, న్యూస్‌టుడే: ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ ప్రకారం గ్రామపంచాయతీ కార్మికులకు రూ. 8,500 వంతున నెలవారీ వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నరసింహన్ కోరారు. ఆయన శనివారం ధర్నాచౌక్‌లో గ్రామపంచాయతీ ఉద్యోగ-కార్మిక సంఘాల ఐకాస ఆధ్వర్యంలోని ఆందోళన కార్యక్రమంలో మాట్లాడుతూ, పలు విధులు నిర్వర్తిస్తున్నా అందుతున్న జీతాలు చాలా తక్కువగా ఉంటున్నాయన్నారు. వేతన బకాయిలను వెంటనే విడుదల చేయడంతో పాటు పంచాయతీ కార్మికుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, అర్హులైన గ్రామ కార్మికులను కార్యదర్శులుగా నియమించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం డిమాండ్ చేశారు.

పసుపు స్థితిగతులపై అభిప్రాయ సేకరణ

కమ్మర్‌పల్లి, న్యూస్‌టుడే: పసుపు పంటకు మరింత ప్రోత్సాహం అందించడానికి.. కేంద్ర వ్యవసాయశాఖ శనివారం నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లిలోని 'కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ పసుపు పరిశోధన స్థానం' ఆవరణలో రైతులతో విస్తృత చర్చ నిర్వహించింది. ఉన్నతాధికారులు గత జులై 26న దిల్లీలోని కృషి భవన్‌లో సమావేశం నిర్వహించడం విదితమే. ఆ కృషిలో భాగంగానే కేంద్ర ఉద్యానశాఖ కమిషనర్ బీఎస్ఎస్ మూర్తి, రాష్ట్ర కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి ఈ కార్యక్రమం చేపట్టారు. నిజామాబాద్‌తో పాటు నిర్మల్, జగిత్యాల జిల్లాల నుంచి వచ్చిన రైతులు, పసుపు వ్యాపారుల నుంచి అభిప్రాయాలు సేకరించారు. పెట్టుబడి ఖర్చు, ఉత్పత్తి ప్రాతిపదికన క్వింటాలుకు రూ. 15,000 మద్దతు ధర కల్పించాలని, సమస్యలకు శాశ్వత పరిష్కారంగా పసుపు బోర్డును ఏర్పాటుచేయాలని పలువురు కోరారు. నివేదిక రూపొందించి కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖకు అందిస్తామని కమిషనర్ తెలిపారు.

కమ్మర్‌పల్లి పసుపు పరిశోధన స్థానంలో రైతు అభిప్రాయం వింటున్న కేంద్ర ఉద్యానశాఖ కమిషనర్ బీఎస్ఎస్ మూర్తి

కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ తెలంగాణ (మార్క్సిస్ట్-అంబేడ్కరిస్ట్) ఆవిర్భావం

ఖైరతాబాద్, న్యూస్‌టుడే: రాజ్యాధికారమే లక్ష్యంగా బహుజనులు ముందుకు సాగాలని బీసీ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షులు జాజుల శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. వృత్తులు వేరైనా నెత్తురు ఒక్కటేనని అందరమూ కలిసికట్టుగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పులిజాల గెల్వయ్య ఆ పార్టీకి రాజీనామా చేస్తూ కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ తెలంగాణ (మార్క్సిస్ట్- అంబేడ్కరిస్ట్) (సీపీటీ(ఎం-ఎ)) పేరుతో పార్టీని స్థాపించారు. దాని ఆవిర్భావ గోడ పత్రికను సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా జాజుల హాజరై మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఇచ్చే తాయిలాలు వద్దని, రాజ్యాధికారం దిశగా బహుజనులు సామాజిక ఎజెండాతో ముందుకు వెళ్లాలని పిలుపునిచ్చారు. సీపీటీ(ఎం-ఎ) వ్యవస్థాపక అధ్యక్షుడు గెల్వయ్య మాట్లాడుతూ.. కమ్యూనిస్టు పార్టీలు నాయకత్వ లోపం, కుల సంఘాలను దూరంగా ఉంచడం వల్లనే విఫలమయ్యాయని అభిప్రాయపడ్డారు. మతోన్మాదాన్ని అంతం చేయాలంటే మార్క్సిస్టుతోపాటు అంబేడ్కరిస్ట్, పూలే వాదమూ సజీవంగా ఉండాలని స్పష్టం చేశారు.

'పంచాయతీరాజ్'లో పదోన్నతులు

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి చర్యలు ఆరంభమయ్యాయి. వివిధ స్థాయుల్లో పదోన్నతులు కల్పించే ప్రక్రియను అధికారులు ఇప్పటికే చేపట్టారు. జిల్లా, మండల పరిషత్తులు; గ్రామ పంచాయతీల ద్వారా మరిన్ని సేవలు అందేలా శాఖను శక్తివంతం చేయాలని, 60 రోజుల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సీఎం కేసీఆర్ నిర్దేశించడం తెలిసిందే. ఇందులో భాగంగా అర్హులకు పదోన్నతుల కోసం అంతర్గత ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాకు ఒక డీపీవో, డివిజన్‌కు కార్యనిర్వహణాధికారి (ఈవో పీఆర్, ఆర్డీ), మండలానికి ఎంపీడీవో, గ్రామ పంచాయతీకి కార్యదర్శి ఉండేలా.. ఇప్పుడు దిగువస్థాయిలోని వారికి పదోన్నతులు కల్పిస్తారు. పంచాయతీల్లో గ్రేడ్ 3,4 కార్యదర్శులుగా అర్హులను ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు 15వ తేదీలోగా నియమించాలని పేర్కొన్నారు. ఇంతకుముందే ఎంపిక చేసిన కొందరు కార్యదర్శులను గ్రేడ్ వన్ పోస్టుల్లోకి తీసుకుంటున్నామన్నారు. పదోన్నతుల వల్ల ఏర్పడే ఖాళీల్లో నేరుగా నియామకాలను ప్రభుత్వం త్వరలోనే చేపడుతుంది.

ఇదీ విధానం

పోస్టు	ఎవరికి పదోన్నతి..
మండల పరిషత్ అభివృద్ధి అధికారి(ఎంపీడీవో)	జిల్లా, మండల పరిషత్ సూపరింటెండెంట్లు
కార్యనిర్వహణాధికారి (పీఆర్, ఆర్డీ)	సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్ 1 పంచాయతీ కార్యదర్శి, గ్రేడ్ 1 వీడీవో
పంచాయతీకార్యదర్శి గ్రేడ్ 3, 4	ఫీడర్ క్యాటగిరీల నుంచి

ఇక బయోపిక్స్ చేయను!

కన్ను గీటితే... శశిరేఖ, కంట నీరొలికితే... పార్వతి, కంట నీరు తెప్పిస్తే... సుమంగళి... పాత్ర ఏదైనా ఆమెకు ఆమే సాటి. నటిగా సావిత్రిది ఎవరెస్టు స్థాయి... అంతటి మహానటి పాత్రలో ఒదిగి, నటిగా ఎంతో ఎదిగిన కీర్తి సురేష్ ఇప్పుడు జాతీయ అవార్డుతో మరోస్థాయిని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆమెను పలకరిస్తే... ఎన్నో కబుర్లు చెప్పారు.

జాతీయస్థాయి కీర్తి

● నేను పుట్టి పెరిగింది సినిమా నేపథ్యం ఉన్న కుటుంబంలో. అమ్మ మేనక మంచి నటి. నాన్న సురేష్‌కుమార్ నిర్మాత. మా అక్క రేవతి ప్రస్తుతం ఈ రంగానికి సంబంధించి అకాడమీ బాధ్యతలను నిర్వహిస్తోంది.

● మలయాళం, తమిళ చిత్రాల్లో నటించిన అమ్మ తెరపైనే నటి. ఇంటి ముందు ముగ్గు పెట్టడం నుంచి మా ఆలనాపాలనా వరకు అంతా ఆమే చూసేది. స్కూల్ ఫస్ట్ వచ్చేయాలి, వందకు వంద మార్కులు తెచ్చుకోవాలని ఇబ్బంది పెట్టేది కాదు. జీవితానికి చదువు ముఖ్యం. చదువే జీవితం కాకూడదు అనేది. 70శాతం మార్కులు తెచ్చుకునే వాళ్లం.

● జాతీయ ఉత్తమ నటి పురస్కారానికి ఎంపికైనట్లు తెలిసినప్పుడు అమ్మ, నాన్న దగ్గరే ఉన్నాను. చాలా సంతోషమేసింది. తెరపై అమ్మ నటన అద్భుతంగా ఉంటుంది. ఆమె నటించిన 'ఓ పోల్' (తోబుట్టువు) చిత్రంలో ఆమె పాత్ర జాతీయ ఉత్తమ నటి అవార్డుకు నామినేట్ అయ్యింది. అయితే చివరి ఎంపికలో అమ్మ పేరు లేదు. ఆ సందర్భంలో తనకు కలిగిన నిరుత్సాహం అమ్మ ఎప్పుడూ గుర్తు చేసుకుంటూనే ఉంటుంది. ఇప్పుడు నాకు దక్కిన ఈ గౌరవాన్ని అమ్మకు అంకితమిస్తున్నా.

● మహానటి ప్రాజెక్టు గురించి చెప్పినప్పుడు ముందుగా అమ్మ చాలా భయపడింది. సహజసిద్ధమైన నటన ఉంటేనే ఆ పాత్రకు న్యాయం చేయగలుగుతాం అంది. నిర్మాతలు, దర్శకుడు ఇచ్చిన ధైర్యంతో ముందడుగు వేశా.

● ముందుగా మాయాబజార్ సినిమాలోని షాట్ చిత్రీకరించారు. చాలా టేక్స్ తీసుకున్నా. దానికి ముందుగా చాలాసార్లు రిహార్సల్స్ చేశాం. ఎడమ కంటి నుంచి రెండు నీటి బొట్లు, కుడి కంటిలో ప్రేమ కనిపించే సీన్ కోసం రెండు గంటలపాటు ప్రయత్నించాను.

● మహానటి చిత్రం పూర్తిగా భావోద్వేగాలమయం. మనసులోని భావాలు ముఖంపై ప్రతిఫలించాలి. ఆమె నడక, తలకట్టు, దుస్తులు అన్నింటిలో ఆమెలా మారిపోతేనే పాత్ర పరిపుష్టి అవుతుంది. దాదాపు వంద రకాలకు పైగా దుస్తులను ధరించా. మొదటి రోజు మేకప్‌కు నాలుగు గంటలకు పైగా పటింది. ఏడాదికి పైగా ఆ పాత్రలో లీనమైపోయా. చాలారోజులు నిద్రపట్టేది కాదు. పగలు షూటింగ్‌లో ముఖం వాడినట్లు కనిపిస్తుందని భయం. ఇలా ఎన్నో ఇబ్బందులకు గురయ్యేదాన్ని.

● మహానటి చిత్రం విడుదలైన తరువాత అభిమానులే కాదు, విమర్శకులూ బ్రహ్మరథం పట్టారు. ఇప్పుడు జాతీయ స్థాయిలో గౌరవాన్ని అందుకోబోతున్నా. దీనికి సహకరించిన టెక్నీషియన్స్ అందరికీ కృతజ్ఞతలు చెప్పుకొంటున్నా. అలాగే ఈ చిత్రంలోని కొన్ని సంఘటనలు, సన్నివేశాల వల్ల ఎవరైనా బాధపడి ఉంటే వారిని క్షమాపణలు కోరుకుంటున్నా.

● మరో బయోపిక్ ఒప్పుకొంటారా అని చాలామంది అడుగుతుంటారు. ఇదే మొదటిది, చివరిది అని చెబుతుంటా. ఎందుకంటే మహానటి లాంటి పాత్రలో నటించి మరో పాత్ర చేయాలని లేదు. అంతగా ఈ పాత్రకు ప్రభావితురాలినయ్యా. షూటింగ్ పూర్తయ్యే 10 రోజుల ముందు నుంచే మనసులో ఏదో బాధ మొదలైంది. చిత్రీకరణ పూర్తయిన తరువాత ఏడ్చేశా. ఏదో పదిలివెళుతున్నట్లే అనిపించింది. పెద్దనాన్న పాత్రలో చేసిన రాజేంద్రప్రసాద్ షూటింగ్ ముగిసి, వెళ్లిపోతుంటే కళ్లల్లో నీళ్ల కారిపోయాయి. ఆయనను గట్టిగా హత్తుకుని ఏడ్చేశా. అందుకే నేను అంటుంటా... 'మహానటి ఓ మహాద్భుతం...ఓ ప్రయాణం. మనషులనే కాదు, మనసులను కూడా కట్టిపడేసే మాయాజాలం ఆ చిత్రం' అని.

● హాలీవుడ్‌లో టామ్‌క్రూస్ అభిమానిని. బాలీవుడ్‌లో షారూఖ్‌ఖాన్, దీపికా పదుకోణే, ఆలియాభట్ అంటే చాలా ఇష్టం. నయనతార డ్రెస్ సెన్స్, సిమ్రాన్ డ్యాన్స్ అంటే ఫిదా అయిపోతా.

– సీహెచ్ వసుంధరాదేవి

సామాజిక సేవలో

గతేడాది కేరళలో వరద బాధితులకు చేయూత అందించాలనుకున్నా. ఒక బృందంతో కలిసి ఆయా ప్రాంతాలన్నీ చుట్టివచ్చి, ఇబ్బందులన్నీ తెలుసుకున్నా. వెంటనే స్థానిక ప్రభుత్వ కాలేజీలో కొన్ని రోజులు బృందంతో కలిసి ఉండి ఫ్యామిలీ కిట్‌లు తయారుచేసి పంపిణీ చేశాం. ఆ కిట్‌లో బియ్యం, పప్పు, ఉప్పు, వంట సరుకులు, కూరగాయలు వంటివన్నీ ఉండేలా దగ్గరుండి చూసుకున్నా. అలాగే మహిళలకు కావాల్సిన శానిటరీ న్యాప్‌కిన్స్ నుంచి లోదుస్తుల వరకు అందేలా కృషి చేశా. అమ్మ నుంచి ఇవన్నీ నేర్చుకున్నా.

క్రేజీగా

ఓసారి ఒక నగల దుకాణం ప్రారంభోత్సవానికి వెళ్లినప్పుడు ఓ అభిమాని నావద్దకు వచ్చి కానుకిచ్చి వెళ్లాడు. అదేంటంటే నా ఫొటోలన్నింటినీ పొందుపరిచిన అల్బంలాంటిది. వాటితోపాటు ఒక ఉత్తరం కూడా ఉంది. నన్ను ప్రపోజ్ చేస్తూ రాసిన ఆ లేఖను ఉంచుకున్నా. ఎందుకంటే కాలేజీ రోజుల్లో ఒక్క ప్రేమలేఖా రాలేదు కాబట్టి.

తరగతులెగ్గొట్టి

సినీ రంగంలోకన్నా కాలేజీ స్నేహితులే నాకు ఎక్కువ. తరగతులు ఎగ్గొట్టి చాలా సినిమాలు చూసేవాళ్లం. ఇప్పుడు బిజీ అవడంతో వారందరినీ కలవలేకపోతున్నా. దుస్తుల్లో పార్టీవేర్ కన్నా సాదాసీదా అవుట్‌ఫిట్స్ అంటే ఇష్టపడతా. ఆకుపచ్చ రంగంటే ఇష్టం. నేను చదివిన కాస్ట్యూమ్ డిజైనింగ్ కోర్సును నా వృత్తిలో ఉపయోగిస్తూ ఉంటా.



జీవిత కథకు పురస్కారం

'మహానటి'కి జాతీయ పురస్కారం వచ్చిందని ఒక జర్నలిస్ట్ మిత్రుడే తొలుత నాకు ఫోన్ చేశారు. తర్వాత టీవీ పెట్టి చూశాను. ఇది సావిత్రి గారికి ఇచ్చిన గౌరవం. ఆమె ఎంతో గొప్ప నటి... అయినా ఎందుకో ఎప్పుడూ జాతీయ పురస్కారం అందుకోలేదు. ఇప్పుడు ఆమె జీవిత కథకు వచ్చింది. చాలా సంతోషంగా ఉంది. ఈ చిత్రానికి సహకరించిన సావిత్రిగారి కుమార్తె చాముండేశ్వరి, కుమారుడు సతీష్‌లకు ముందుగా కృతజ్ఞతలు. తీయడానికి ముందుకొచ్చిన ప్రియాదత్, స్వప్నదత్‌లకు అభివందనాలు. ఈ సినిమా పూర్తిచేయడానికి సహకరించిన నటులు, సాంకేతిక నిపుణులు.. ఇలా ప్రతీ ఒక్కరికీ ధన్యవాదాలు.

సావిత్రిగారు ఎప్పుడూ నటించలేదు

చిన్నప్పటి నుంచి ఇంట్లో పాత సినిమాలు చూసేవాళ్లు. నేనూ వాటిని చూసేవాడ్ని. అలా సావిత్రిగారి హావభావాలు, ఆహార్యం నాకు ఎంతో నచ్చేవి. సావిత్రి గారు ఎప్పుడూ, ఎక్కడా నటించలేదు. సినిమాల్లోని పాత్రల్లోనూ ఆమె జీవించారు. జీవితంలోనూ తనకు ఇష్టమొచ్చినట్లే జీవించారు. మనసులో ఎలా ఉంటే అలాగే బయటికి నడుచుకునేవారు. అందుకే ఆమె నన్ను ఇన్‌స్పైర్ చేశారు. ఆమె కథ నేటి తరానికి చెప్పాలనిపించింది. ఆమె తాగి చనిపోయిందని, ఏవేవో ఆమె జీవితంలో జరిగాయని... రకరకాల కథలు ప్రచారంలో ఉండేవి. అలా కాదు.. ఆమెను గొప్పగా గుర్తు పెట్టుకోవాలని ఈ ప్రయత్నం చేశా. రెండేళ్లు కష్టపడ్డాం. ఈ చిత్రాన్ని సావిత్రిగారి గురించి తెలిసిన పెద్దలే కాక, యువత, ఇప్పటి పిల్లలు కూడా ఇష్టపడటం నాకు చాలా సంతోషాన్నిచ్చింది.

కీర్తి మొదట చేయనంది

ఈ కథకు మొదట ఎంతో మందిని మనసులో అనుకున్నాం. ప్రియా, స్వప్నలు... మేమనుకున్న వారి ఫొటో, సావిత్రిగారి ఫొటో పక్కపక్కన పెట్టి... చాలా మందికి వాట్సప్ గ్రూపుల్లో పంపారు. వారి అభిప్రాయాలు స్వీకరించారు. కీర్తిసురేష్‌ను అనుకున్నాక.. ఆమె చేయలేను అని చెప్పింది. మిగతా సినిమాలు ఎప్పుడైనా చేయొచ్చు... ఇలాంటి అవకాశం మళ్లీ రాదని చెప్పి ఒప్పించాం. ఆమె కష్టానికి ప్రతిఫలం దక్కింది. దీపికపదుకొనే, ఆలియాభట్ వంటి వారు పోటీలో ఉన్నా... కీర్తి ఉత్తమ నటిగా ఎంపికవడం చాలా గొప్ప విషయం. అవార్డు ప్రకటించిన వెంటనే ఫోన్ చేసి అభినందించా.

నాగ అశ్‌విన్



తొలి సంపాదన నాలుగువేలు

స్కూల్ మేగజీన్ ఎడిటర్ని

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివేటప్పుడు స్కూల్ మేగజీన్ ఎడిటర్‌గా ఉండేవాడ్ని. కథనాలు, వ్యాసాలు రాసేవాడ్ని. అప్పుడు రానా నా క్లాస్‌మేట్. స్కూల్ ఆవరణలో ఎక్కువగా కొండరాళ్లు, చెట్లు ఉండేవి. విరామంలో అలా బండరాళ్లలోకి వెళ్లిపోయి... బెల్ కొట్టగానే మళ్లీ వెనక్కి పరిగెత్తుకొచ్చే వాళ్లం. ఒకసారి అలా అక్కడి బండరాళ్ల పగలగొడుతుంటే చూశా. ఫొటోలు తీశా. 'అసలు స్కూల్‌లో ఏం జరుగుతోంది? అడవి నాశనం చేస్తున్నదెవరు? అంటూ... ఓ పరిశోధన కథనం రాసి పత్రికలో ప్రచురించా. మా స్కూల్ మేగజీన్‌కి ఒక టీచర్ పర్యవేక్షకురాలిగా ఉండేవారు. ఆమెకు తెలియకుండా... ఈ పనిచేశాం. తర్వాత ప్రార్థన సమయంలో ప్రిన్సిపల్‌గారు ఆ టీచర్‌కి చీవాట్లు పెట్టారు. నాకూ చీవాట్లు పడ్డాయి.

ఇంజినీరింగ్, మెడిసిన్ నచ్చక

నాన్న జయరామ్‌రెడ్డి, అమ్మ జయంతి. ఇద్దరూ వైద్యులే. చిన్నప్పటి నుంచి నేను తక్కువే మాట్లాడతా. అయితే యాక్టివ్‌గా ఉంటా. ఎప్పుడూ ఏదో ఒకటి చేయాలని చూస్తుంటా. అమ్మా, పిన్నమ్మ అందరూ ఫస్ట్ ర్యాంకర్లే. నేను ఎప్పుడూ ఫస్ట్ వచ్చేవాడ్ని కాదు. ఈ విషయంలో అమ్మ బాధపడేది. ఫస్ట్‌ర్యాంకర్ని కాదు గానీ... టాప్ టెన్‌లో అయితే ఉండేవాడ్ని. ఏదో ఒక సబ్జెక్టులో మంచి మార్కులొచ్చేవి. నాకు ఇంజినీరింగ్, మెడిసిన్ లాంటి రెగ్యులర్ కోర్సులు చదవడం ఇష్టం లేదు. అందుకే ఇంటర్ అయ్యాక... ఎన్ని పోటీ పరీక్షలుంటే అన్నీ రాశా. మణిపాల్‌లో మల్టీమీడియా కోర్సులో సీటొచ్చింది. అక్కడికి వెళ్లిపోయా. అక్కడే నాకు వీడియో ఎడిటింగ్‌పై అవగాహన వచ్చింది. అమ్మానాన్నలు ఎప్పుడూ నామీద ఒత్తిడి చేయలేదు. నేను ఏది చేసినా ప్రోత్సహించారు. మొదట మీడియాలో స్థిరపడతాడేమో అనుకున్నారు. తర్వాత యాడ్స్... చివరికి ఇలా దర్శకుడ్ని అయ్యా.

సొంతంగా తీద్దామనుకున్నా

'లైఫ్‌ఈజ్ బ్యూటిఫుల్' తర్వాత... ఫ్రెండ్స్‌తో కలిసి ఒక బృందంగా ఏర్పడి పనిచేసేవాళ్లం. అప్పుడు ఒక యాడ్ తీశాను. ఏదో రాసుకొని కొంతమందికి వినిపించేవాడ్ని. ఇదే సమయంలో ఒక షార్ట్ ఫిల్మ్ తీశా. అది ఫిల్మ్ ఫెస్టివల్‌కు వెళ్లింది. దీంతో ప్రియాంక, సప్నలకు నాపై నమ్మకం వచ్చింది. వాళ్లకే ఒక కథ వినిపించాను. అది చర్చల దశలో ఉన్నప్పుడే 'ఎవడే సుబ్రమణ్యం' రాసుకున్నా. తక్కువ బడ్జెట్‌లో సొంతంగా అయినా తీసి... నన్ను నేను నిరూపించుకోవాలని ఏర్పాట్లు చేసుకున్నా. ఈ కథ సప్నదత్ వాళ్లకు నచ్చింది. వాళ్లు నానీని తీసుకొచ్చి ఈ కథకు మరింత న్యాయం చేశారు. విజయ్ పాత్రకు ముందునుంచి తననే అనుకున్నా. తను నాకు లైఫ్‌ఈజ్ బ్యూటిఫుల్ నుంచి పరిచయం. విజయ్ మంచి నటుడు అవుతాడని అప్పుడే అనుకునేవాడ్ని.

మూడో చిత్రం వాళ్లతోనే..

వైజయంతీ మూవీస్, స్వప్న సినిమాస్‌లతో కలిసే మూడో చిత్రం చేయాలనుకుంటున్నా. ఇందులో మరో నిర్మాణ సంస్థ ఎవరైనా భాగస్వామ్యం అయ్యే అవకాశం ఉంది. ఎన్నో ఏళ్ల క్రితమే ఈ సబ్జెక్టుపై సినిమా తీయాలని అనుకుంటున్నాం. అన్నీ అనుకూలిస్తే... ఇదే చేపడతాం. కథ ఇంకా స్క్రిప్ట్ దశలోనే ఉంది. నటీనటులను ఎవరనేది అప్పుడే అనుకోవడం లేదు.

తొలి రెమ్యునరేషన్‌పై ఇంక్ పడింది

ఏవేవో రాసి తీయాలని ఆశపడేవాడ్ని. అది చూసి అమ్మనే నన్ను దర్శకులు శేఖర్‌కమ్ముల దగ్గరికి పంపారు. అప్పటికే ఆయన 'గోదావరి' సినిమా పనులతో బిజీగా ఉన్నారు. 'నెక్స్ట్ ప్రాజెక్టుకు చేద్దాం' అన్నారు. నేను మంచు మనోజ్ నటించిన 'నేను మీకు తెలుసా?' సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశాను. అప్పట్లో నాకు నాలుగువేలు రెమ్యునరేషన్ ఇచ్చారు. అదే నా తొలి సంపాదన. నాలుగు వెయ్యిరూపాయల నోట్లు. వాటిపై ఇంక్ పడింది. ఎక్కువ ఇంక్ పడ్డ నోట్‌ని అమ్మకిచ్చి దాచాను. మిగతా డబ్బు మామూలుగానే ఖర్చు పెట్టాను. తర్వాత లీడర్, లైఫ్‌ఈజ్ బ్యూటిఫుల్ చిత్రాలకు అసిస్టెంటుగా చేశాను. క్యాస్ట్యూమ్స్ చూసుకునేవాడ్ని. 'లీడర్' ట్రైలర్‌ను కట్ చేశా. అది శేఖర్‌కమ్ములకు నచ్చి విడుదల చేశారు. సినిమాను ఎంత ఫ్రెండ్లీ వాతావరణంలో తీయొచ్చో ఆయన వద్దే నేర్చుకున్నా.

విమర్శలు బాధ పెట్టలేదు

'మహానటి' చిత్రంపై వచ్చిన విమర్శలు నన్ను ఏమీ బాధ పెట్టలేదు. మంచి హిట్ ముందు అవన్నీ చిన్నవిగా కన్పించాయి. స్క్రీన్‌ప్లే కోసం కొన్ని మార్పులు చేశాం. ఆమె జీవితంలో ముఖ్యమైన ఇంకా కొంతమంది గురించి ఈ సినిమాలో ప్రస్తావించలేకపోయాం. స్క్రిప్ట్‌లో రాసుకున్నాం గానీ... చిత్రీకరించలేకపోయాం. కొన్ని సన్నివేశాలు తీసీ ఫైనల్ కాపీలో ఉంచలేకపోయాం. సావిత్రి గారి జీవితం మొత్తం చేయాలంటే మూడు గంటల సినిమా సరిపోదు. సీరీస్ చేయాల్సి ఉంటుంది. మాకు వీలైనంత వరకూ ఆమె గౌరవానికి ఎలాంటి ఇబ్బందీ లేకుండా తీయగలిగాం.

ఇష్టమైన వంట :	ముద్దపప్పు అన్నం, పచ్చిపులుసు
బాగా చేసేవంట :	బిర్యానీ
ఆరాధ్య దర్శకులు :	కేవీ. రెడ్డి, సింగీతం శ్రీనివాసరావు, కె.విశ్వనాథ్
రచయిత :	జంధ్యాల
ఇష్టమైన ప్రదేశం :	కొండప్రాంతాలు
నచ్చిన నటుడు :	వెంకటేశ్(చిన్నప్పుడు)...
నచ్చిన నటి :	ఐశ్వర్యారాయ్
మెచ్చే ఆట :	టెన్నిస్
పుస్తకం :	స్కూల్ రోజుల్లో 'కర్పూర దీప యాత్ర'(నాన్ డీటెయిల్డ్) బాగా ఆకట్టుకుంది. ఆ పుస్తకమిప్పుడు దొరకడం లేదు.
సామాజిక సేవ :	సామాజిక సేవ చేయడం గొప్ప కాదు. మన బాధ్యత. నీటి పొదుపు, కాలుష్య నియంత్రణ, నదుల సంరక్షణలాంటివి ప్రతి ఒక్కరూ చేయాలి.

కూరగాయలు పండిస్తా

ఉప్పల్ దగ్గర చిన్న పొలం ఉంది. అక్కడికి వెళ్లి కూరగాయల సాగులో పనులు చేస్తా. పొలం దున్నడం, విత్తనాలు వంటి వాటిల్లో సాయపడతా. పొలంలో ఏదో నాకు తోచిన పనిచేస్తుంటా.

టైం అంతా మా అబ్బాయితోనే!

ఎవడే సుబ్రమణ్యం అయ్యాక... పెళ్లి చేసుకుంటే బాగుంటుందని అనుకున్నా. అప్పటికే రెండేళ్లుగా ప్రియాంకదత్‌తో స్నేహం ఉండేది. ఒకానొక సందర్భంలో సరే మనమే చేసుకుందామని నిర్ణయించున్నాం. ఇంట్లో ఒప్పుకొన్నారు. సంతోషంగా ఉన్నాం. మా బాబు రుషి. ఇప్పుడు సమయం మొత్తం వాడికే సరిపోతోంది. చూశారుగా ఎత్తుకొని తిప్పమని ఒకటే అల్లరి...(నవ్వు).

– అయితరాజు రంగారావు, ఈనాడు, హైదరాబాద్
రాళ్లపల్లి రాజావలి, ఫొటోలు : రాజమౌళి

ఈనాడు సినిమా

ప్రభాస్

స్టేడియంలో సిక్స్ కొడితేనే ఒక రేంజ్

"నటుడిగా 'బాహుబలి' ప్రభావం నుంచి బయటికి రావడం అంత సులభం కాదు. 'బాహుబలి' చరిత్ర సృష్టించిన చిత్రం. 'సాహో'ని ప్రేక్షకులకు మంచి వినోదాన్ని అందించడమే లక్ష్యంగా చేశాం. కాబట్టి 'బాహుబలి'తో 'సాహో'ని పోల్చి చూడాల్సిన అవసరం లేదు" అన్నారు ప్రభాస్. అయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'సాహో'. శ్రద్ధా కపూర్ కథానాయిక. సుజీత్ దర్శకుడు. యువీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించారు. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో దాదాపు రూ.300 కోట్ల వ్యయంతో రూపొందించిన ఈ చిత్రం ఈ నెల 30న విడుదల అవుతోంది. శనివారం ముంబయిలో ట్రైలర్ విడుదల కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా చిత్రబృందం పంచుకున్న విశేషాలివీ.

పోలీసు అధికారిగా నటించా: ప్రభాస్

"ప్రేక్షకులకి విజువల్‌గా ఒక సరికొత్త అనుభూతిని పంచాలనే లక్ష్యంతోనే 'సాహో' చేశాం. ఇదొక లార్జర్ దేన్ లైఫ్ కథ. 'బాహుబలి' కోసం ఐదేళ్లు కేటాయించాక, మళ్లీ ఈ సినిమాకి రెండేళ్లు వెచ్చించడానికి నేను ఇష్టపడలేదు. ఇందులో క్లిష్టమైన యాక్షన్ సన్నివేశాలున్నాయి. వాటికి సన్నద్ధం కావడానికే సమయం పట్టింది. ఈ సినిమా నిర్మాతలు నా స్నేహితులు. యాక్షన్ ఘట్టాలు తీస్తున్నప్పుడు రిస్క్ చేయొద్దని వారు వారించారు. సుజీత్ బలమైన స్క్రీన్‌ప్లేతో తెరకెక్కించాడు. నేను పోలీసు అధికారిగా నటించా. ఇందులో మలుపులు ఆకట్టుకుంటాయి. అవి నా అభిమానుల్ని మరింతగా అలరిస్తాయని నమ్ముతున్నా. నా తొలి హిందీ సినిమా ఇదే కాబట్టి ఆత్రుతగా ఉన్నా. హిందీలో డబ్బింగ్ చెప్పడం కష్టమనిపించింది. తెలుగు నేర్చుకునే విషయంలో శ్రద్ధాకపూర్‌కి నేను పెద్దగా సాయం చేయలేదు. కానీ ఆమె హిందీ విషయంలో నాకు సాయం చేసింది".

నేనూ ఫైట్లు చేశా: శ్రద్ధాకపూర్

"కథ రీత్యా నేను కూడా యాక్షన్ ఘట్టాల్లో నటించాల్సి వచ్చింది. ప్రభాస్‌తో కలిసి నటించడం మంచి అనుభవం. ఆయనొక గొప్ప స్టారే కాదు, మంచి హృదయమున్న వ్యక్తి అని అందరికీ తెలుసు. యువీ క్రియేషన్స్ సంస్థ నన్ను వారి కుటుంబంలో ఒకరిగా చూసింది. హైదరాబాద్‌కి ఎప్పుడు షూటింగ్‌కి వెళ్లినా చాలా ఆనందంగా ఉండేది. ఇప్పుడు హైదరాబాద్ నా రెండో ఇల్లు అయ్యింది".

4500 తెరలపై విడుదల

"మన దేశంలో రూపుదిద్దుకొన్న భారీ యాక్షన్ చిత్రమిది. ఉత్తర భారతదేశంలో 4500 పైచిలుకు తెరలపై పలు భాషల్లో చిత్రాన్ని విడుదల చేయబోతున్నాం. ఈ చిత్రంతో దక్షిణాది పరిశ్రమలోకి అడుగు పెడుతున్నందుకు ఆనందంగా ఉంది".
– హిందీ నిర్మాత భూషణ్ కుమార్

గల్లీలో ఎవడైనా కొడతాడు

2 నిమిషాల 46 సెకన్ల నిడివిగల 'సాహో' ట్రైలర్ కనులవిందుగా సాగింది. యాక్షన్ ఘట్టాలు, అంతర్జాతీయ స్థాయి విజువల్స్ ఆకట్టుకున్నాయి. అదంతా ఒకెత్తైతే ప్రభాస్ కనిపించిన తీరు, ఆయన చెప్పిన సంభాషణలు మరో ఎత్తు. 'గల్లీలో సిక్స్ ఎవడైనా కొడతాడు... స్టేడియంలో కొట్టేవాడికే ఒక రేంజ్ ఉంటుంది...' అని ప్రభాస్ చెప్పిన సంభాషణ ప్రధానాకర్షణ.

ఇది విన్నారా!

ఆస్ట్రేలియా యూనివర్సిటీలో షారుఖ్ స్కాలర్‌షిప్

ఒక కథానాయకుడి పేరు మీద ఒక విదేశీ విశ్వవిద్యాలయంలో ప్రత్యేక స్కాలర్‌షిప్‌ను ఏర్పాటు చేయడం అంటే విశేషమే. ఆ ఘనత షారుఖ్ ఖాన్‌కు దక్కింది. సామాజిక సేవలోనూ చురుగ్గా ఉంటూ నిజమైన హీరో అనిపించుకుంటున్నారు షారుఖ్. ఆయన మీర్ ఫౌండేషన్ ద్వారా స్త్రీ సాధికారికత కోసం పాటు పడుతున్నారు. ఆయన కృషిని ఆస్ట్రేలియాలోని 'లా ట్రోబ్' విశ్వవిద్యాలయం గుర్తించింది. షారుఖ్ పేరు మీద ఓ ప్రత్యేక స్కాలర్‌షిప్‌ను ఏర్పాటు చేసింది. 'ది షారుఖ్ ఖాన్ లా ట్రోబ్ యూనివర్సిటీ' పేరుతో ఉన్న స్కాలర్‌షిప్ ద్వారా ఏటా ఒక భారత మహిళకు పరిశోధన కోసం రెండు లక్షల డాలర్ల ఆర్థిక సహకారం అందించనుంది.

షారుఖ్

పాయల్... హొయల్

పాయల్ రాజ్‌పుత్

తెలుగులో తొలి చిత్రంతోనే కుర్రాళ్ల హృదయాల్ని కొల్లగొట్టింది పాయల్ రాజ్‌పుత్. 'ఆర్ఎక్స్ 100' విడుదలైనప్పట్నుంచి ఆ చిత్రం పేరుతోనే ప్రచారంలో ఉన్న ఈ నాయిక, ఇకపైన 'ఆర్.డి.ఎక్స్...' నాయిక అనిపించుకోబోతోంది. ఇక్కడ చిత్రంలో ఆమె ఇలా హొయలుపోయింది 'ఆర్.డి.ఎక్స్.లవ్' చిత్రం కోసమే. పాయల్ రాజ్‌పుత్, తేజస్ కంచర్ల జంటగా నటించిన చిత్రమిది. శంకర్ భాను దర్శకుడు. సి.కల్యాణ్ నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. వచ్చే వారంలో టీజర్‌ని విడుదల చేస్తారు. "పాయల్ మరోసారి తన అందం, అభినయంతో ఆకట్టుకోబోతోంది. త్వరలోనే విడుదల చేస్తామ"ని చిత్రవర్గాలు తెలిపాయి.

'ట్రూప్' పాటలు వచ్చాయి

కాత్యాయని, ఫణీంద్ర, స్వర్ణలత, రసమయి బాలకిషన్

మహేందర్ ఎప్పలపల్లి, కాత్యాయనీ శర్మ జంటగా వి.ఎస్.ఫణీంద్ర తెరకెక్కిస్తున్న చిత్రం 'ట్రూప్'. బ్రహ్మాజీ ముఖ్య పాత్రధారి. స్వర్ణలత నిర్మిస్తున్నారు. శనివారం హైదరాబాద్‌లో విడుదల ముందుస్తు వేడుక జరిగింది. తెరాస ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ముఖ్య అతిథిగా హాజరై ట్రైలర్‌ని, పాటల సీడీని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ "ఏది పెద్ద సినిమా, ఏది చిన్న సినిమా అనేది ప్రేక్షకులే నిర్ణయిస్తారు. నిర్మాణంలో కష్టాలు ఉంటాయని తెలిసినా స్వర్ణలత ధైర్యంగా ముందడుగు వేశారు. ప్రచార చిత్రాలు ఆకట్టుకునేలా ఉన్నాయి. ఈ సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నా" అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "కథ చెప్పగానే సినిమా తీయడానికి సిద్ధమయ్యారు నిర్మాత. ఆద్యంతం ఆసక్తికరంగా సాగే ఈ చిత్రంలో బ్రహ్మాజీ పాత్ర అత్యంత కీలకం. ఈశ్వర్, హర్ష సమకూర్చిన సంగీతం చిత్రానికి ప్రధాన బలం" అన్నారు. త్వరలోనే చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తామన్నారు నిర్మాత. ఈ కార్యక్రమంలో తుమ్మలపల్లి రామసత్యనారాయణ, మోహన్ వడ్లపట్ల, సురేష్ చౌదరి, హర్ష, జోజో తదితరులు పాల్గొన్నారు.

అనుకోని అతిథి ఎవరు?

సాయిపల్లవి, ఫహద్ ఫాసిల్ ప్రధాన పాత్రల్లో నటించిన మలయాళ చిత్రం 'అధిరన్'. తెలుగులో 'అనుకోని అతిథి' పేరుతో విడుదలవుతోంది. అన్నంరెడ్డి కృష్ణకుమార్ తెలుగులోకి తీసుకొస్తున్నారు. దీప సురేందర్‌రెడ్డి సమర్పిస్తున్నారు. ఈ చిత్రానికి వివేక్ దర్శకుడు. నిర్మాత మాట్లాడుతూ "కేరళలో 1970లో జరిగిన వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందింది. ఈ కథలో అనుకోని అతిథి ఎవరన్నది తెరపైనే చూడాలి. త్వరలోనే ప్రచార చిత్రాల్ని, సినిమానీ విడుదల చేస్తామ"న్నారు. ప్రకాష్‌రాజ్, అతుల్ కులకర్ణి తదితరులు నటించారు.

సాయిపల్లవి

'ఎఫ్ 2'

కొన్ని కథలు ఎన్నిసార్లు విన్నా బాగుంటాయి. కొన్ని కథలు ఎక్కడ చెప్పినా వినే వాళ్లుంటారు. అలాంటి కథలు కావాలి ఇప్పుడు. అలాంటి కథల్ని సినిమాలుగా తీయాలిప్పుడు. మనవాళ్ల ప్రయత్నమూ అదే. రీమేక్ అనుకోండి, సీక్వెల్ అనుకోండి... చెప్పిన కథని మళ్లీ చెప్పడం, ఓ భాషలో విజయవంతమైన సినిమాని మరో భాషలో తెరకెక్కించడం ఓ కళ. మన దర్శకులకు, నిర్మాతలకు 'రీమేక్'పై గురి ఎక్కువ. తెలుగులో వచ్చినన్ని రీమేక్ చిత్రాలు మరే భాషలోనూ రావేమో. కాకపోతే.. ఇది వరకు మనం పరాయి కథల వెంట పరుగులు పెట్టేవాళ్లం. ఇప్పుడు వాళ్లు మన కథల్ని కొనుక్కెళుతున్నారు. తెలుగు సినిమా కథకు విలువ పెరిగింది. స్థాయి పెరిగింది. టాలీవుడ్‌లో మెరిసిన కొన్ని చిత్రాలు ఇప్పుడు బాలీవుడ్‌లో తిరిగి పురుడు పోసుకుంటున్నాయి. ఇక్కడి దర్శకులు, రచయితలకు ఇదో కొత్త గౌరవం.

బాలీవుడ్ వాకిట్లో టాలీవుడ్ కథలు

లోకం బూచికి మా గుండె వణికితే
మాకు ధైర్యం ఇచ్చేది
మీ లాలింపే
అమ్మనాన్నలిద్దరూ వేరు వేరయి
అనాథలను చేయకండి
పసిపిల్లలని

గీతం: మీ ప్రేమకోరే..
చిత్రం: దేవుళ్లు
రచన: జొన్నవిత్తుల
– పంపినవారు: ఎస్.కరీముల్లా, భువనగిరి

తెలుగులో 'అర్జున్‌రెడ్డి' తెరకెక్కిస్తున్నప్పుడు ఆ సినిమాపై ఎవ్వరికీ అంచనాలు లేవు. కానీ విడుదల తర్వాత సంచలనాలు సృష్టించింది. హిందీలో రీమేక్ చేస్తున్నప్పుడూ 'ఇక్కడి మ్యాజిక్ అక్కడ వర్కవుట్ అవుతుందా?' అని అనుమానించారు. కానీ అవన్నీ పటాపంచలైపోయాయి. బాలీవుడ్‌లో రూ.200 కోట్ల క్లబ్‌లో చేరింది. షాహిద్ కపూర్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా మారింది. తెలుగు కథ సత్తా మరోసారి బాలీవుడ్‌కి తెలిసొచ్చింది. ఈ చిత్రంతోనే సందీప్ రెడ్డి వంగా దర్శకుడిగా హిందీలో అడుగుపెట్టారు. ఓ తెలుగు చిత్రాన్ని, అదే దర్శకుడు బాలీవుడ్‌లో రీమేక్ చేసి, విజయం సాధించడం ఆషామాషీ వ్యవహారం కాదు. కానీ సందీప్ రెడ్డి ఆ ఘనత సాధించారు. 'అర్జున్ రెడ్డి' ఇచ్చిన స్ఫూర్తితో ఇప్పుడు ఈ రీమేక్‌ల జోరు మరింత ఎక్కువైంది. తెలుగు కథల్ని కొనడానికి బాలీవుడ్ దర్శక దిగ్గజాలు, నిర్మాణంలో కాకలు తీరినవాళ్లూ ఉత్సాహం చూపిస్తున్నారు. 'జెర్సీ', 'ఎఫ్ 2', 'ఎవడు', 'ఇస్మార్ట్ శంకర్' చిత్రాలు ఇప్పుడు బాలీవుడ్‌లో రీమేకులుగా మారడానికి రెడీ అవుతున్నాయి. 'ప్రస్థానం' బాలీవుడ్‌లో తయారవుతోంది. త్వరలోనే విడుదలకు సిద్ధమైంది. క్రికెట్ నేపథ్యంలో రూపొందిన చిత్రం 'జెర్సీ'. నాని కథానాయకుడు. ఓ దురదృష్టవంతుడైన క్రీడాకారుడి జీవితానికి అద్దం పట్టిన దృశ్యరూపం అది. భావోద్వేగాలు బలంగా పండాయి. ఇలాంటి కథలు బాలీవుడ్‌లో బాగా వర్కవుట్ అవుతుంటాయి. అందుకే తెలుగులో ఈ సినిమా మంచి విజయాన్ని సాధించిన వెంటనే బాలీవుడ్ వాళ్లు కర్చీఫ్ వేసేసుకున్నారు. వెంకటేష్, వరుణ్‌తేజ్‌ల మల్టీస్టారర్ 'ఎఫ్ 2' ఇక్కడ రూ.వంద కోట్లు రాబట్టింది. ఇద్దరు హీరోల ఫార్ములా అనేసరికి హిందీవాళ్లు ఇట్టే ఆకర్షితులైపోతారు. అందుకే ఈ చిత్రాన్ని అక్కడ పునఃనిర్మించేందుకు సిద్ధమయ్యారు. పూరి జగన్నాథ్ - రామ్‌ల 'ఇస్మార్ట్ శంకర్' మాస్‌ని ఓ ఊపు ఊపేసింది. రామ్ కెరీర్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచింది. ఇప్పుడీ చిత్రాన్ని బాలీవుడ్‌లో రీమేక్ చేస్తున్నట్టు సమాచారం. కథానాయకుడు ఎవరు? ఈ చిత్రానికి ఎవరు దర్శకత్వం వహిస్తారు? అనే విషయాలు తెలియాలి. పాత కథలూ మనకు ఉపయోగపడతాయా? అనే దృష్టితో బాలీవుడ్ ఆలోచిస్తోంది. 'ప్రస్థానం' విడుదలైన పదేళ్ల తరవాత హిందీలో రీమేక్ అవుతోంది. తెలుగులో సాయికుమార్ పోషించిన పాత్రలో అక్కడ సంజయ్‌దత్ నటించారు. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్నారు. 2014లో వచ్చిన 'ఎవడు' కూడా వాళ్లని ఆకర్షించింది. ఈ కథనీ రీమేక్ చేసే ఆలోచనలు ఉన్నాయి. 'కాంచన' మన కథ కాకపోయినా తెలుగు ప్రేక్షకులకు తెలిసిన కథే. తెలుగులో బాగా ఆడింది కూడా. ఈ చిత్రాన్ని అక్షయ్ కుమార్ హిందీలో రీమేక్ చేస్తున్నారు. 'డియర్ కామ్రేడ్' హక్కుల్ని విడుదలకు ముందే కరణ్ జోహర్ కొనుగోలు చేశారు. 'ఓ బేబీ' కూడా హిందీలో వినోదాలు పంచడానికి రెడీ అవుతోంది. కాకపోతే 'ఓ బేబీ' మన సొంత కథ కాదు. ఓ విదేశీ కథని ఎంచుకున్న దర్శకురాలు నందినిరెడ్డి తెలుగు నేటివిటీకి తగినట్టుగా మార్పులూ, చేర్పులూ చేశారు.

'అర్జున్‌రెడ్డి'

'జెర్సీ'

'ప్రస్థానం'

'ఇస్మార్ట్ శంకర్'

'ఎవడు'

పంచ్ డైలాగ్

మన గుండెలాడడం మానేసినా మన సినిమాలాడడం మానవు.
చిత్రం: ఎన్టీఆర్ కథానాయకుడు
– పంపినవారు: వీబీ శంకర్, సికింద్రాబాద్

యథార్థ సంఘటనలతో


పి.రామ్మోహన్‌రావు, అదిత్ అరుణ్, అమలాపాల్

అమలాపాల్, అదిత్ అరుణ్ ప్రధాన పాత్రల్లో తెలుగు, తమిళ భాషల్లో ఓ చిత్రం తెరకెక్కుతోంది. అనూప్ పనికర్ దర్శకుడు. జె.ఫణీంద్రకుమార్, ప్రభు వెంకటాచలం నిర్మిస్తున్నారు. తమ్మారెడ్డి భరద్వాజ సమర్పకులు. శనివారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది చిత్రం. ముహూర్తపు సన్నివేశానికి తెలంగాణ చలన చిత్ర అభివృద్ధి సంస్థ ఛైర్మన్ పి.రామ్మోహన్‌రావు క్లాప్ నిచ్చారు. దర్శకుడు రమేష్ పర్మ కెమెరా స్విచ్చాన్ చేశారు. తమ్మారెడ్డి భరద్వాజ స్క్రిప్టుని అందజేశారు. అమలాపాల్ మాట్లాడుతూ "తమిళంలో ఈ చిత్రానికి నిర్మాతని నేనే. తొలిసారి నేను నిర్మాతగా మారి తీస్తున్న చిత్రమిది. ఫోరెన్సిక్ డాక్టర్ పాత్రలో నటిస్తున్నా. చెన్నైలో జరిగిన కొన్ని యథార్థ సంఘటనల ఆధారంగా రచయిత అభిలాష్ ఈ కథని సిద్ధం చేశారు. అరుణ్ అదిత్ వాస్తవికతకి దగ్గరగా ఉన్న పాత్రని చేస్తున్నారు. ఆయన కెరీర్‌కి ఈ సినిమా ఓ పెద్ద మలుపు అవుతుంది" అన్నారు. నటనకి అవకాశమున్న పాత్రలో కనిపిస్తానన్నారు అదిత్. ఫోరెన్సిక్ నేపథ్యంలో సాగే విభిన్నమైన కథ ఇదన్నారు దర్శకుడు. ఒక కొత్త జోనర్‌లో రూపొందుతున్న చిత్రమిదన్నారు నిర్మాతలు. ఈ కార్యక్రమంలో వినోద్ సాగర్, అరవింద్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

వసుంధర



నవ్వేయండి మరి!

నవ్వితే నాలుగు విధాల చేటు అనేవారు గతంలో. నవ్వుతూ ఉంటే ఎక్కువ కాలం ఆరోగ్యంగా ఉండొచ్చు అంటున్నారు ఇప్పుడు. శారీరక, మానసిక ఆరోగ్యంపై మంచి ప్రభావం చూపించే శక్తి నవ్వుకు మాత్రమే ఉందంటున్నారు నిపుణులు. అందాన్ని పెంచడంలోనూ నవ్వు కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు.

- హాయిగా నవ్వడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్లు విడుదల అవుతాయి. మానసిక ఆనందం సొంతమై... ఒత్తిడి అదుపులోకి వస్తుంది. శరీరానికి శక్తి అంది... అలసటా దూరమవుతుంది.
- సరదాగా నవ్వుతూ మాట్లాడటం వల్ల సత్సంబంధాలు పెరుగుతాయి. అవతలివారు మన గురించి సానుకూలంగా ఆలోచిస్తారు. కుటుంబబంధాలూ బాగుంటాయి.
- రక్తపోటు అదుపులో ఉండాలన్నా, రోగనిరోధకశక్తి పెరగాలన్నా హాయిగా నవ్వేయండి అని చెబుతున్నారు నిపుణులు. మెదడూ చురుగ్గా పని చేసి, ఆలోచనాశక్తి మెరుగవుతుంది. గుండె ఆరోగ్యమూ బాగుంటుంది.
- కోపం ఒక్కటే కాదు... ఇతర ఉద్వేగాలు అదుపులో ఉంటాయని అధ్యయనాలు చెబుతున్నాయి.
- మనసారా నవ్వినప్పుడు ముఖంలో 15 రకాల కండరాలకు వ్యాయామం అందుతుంది. రక్తప్రసరణ సజావుగా సాగి, ముఖం కాంతిమంతంగా మారుతుంది. చర్మ రంధ్రాలూ శుభ్రపడతాయి.
- మనసారా నవ్వేందుకు మీరేం చేయక్కర్లేదు. అలాంటి పుస్తకాలు చదవండి లేదా సినిమాలు చూడండి. పిల్లలతో ఎక్కువసేపు గడిపేలా చూసుకోవాలి. తాము ఆనందంగా ఉంటూ... ఎదుటివారిని నవ్వించే వారితో తరచూ మాట్లాడుతుండాలి.
- రోజులో పది నుంచి పదిహేను నిమిషాలు నవ్వితే చాలు... దాదాపు నలభై కెలోరీలు కరుగుతాయి.

అమ్మమ్మే అన్నీ అయితే...

ఉద్యోగినులకు ఊపిరి సలపనంత పని. హడావుడి లేని రోజు ఉండదు. ఈ బిజీలో పిల్లలతో గడిపే తీరిక ఎక్కడిదంటారు కొందరు తల్లులు. ఇలాంటివారు తమ చిన్నారుల్ని అమ్మమ్మ లేదా నానమ్మ దగ్గర వదిలేసి చూడండని చెబుతున్నారు మానసిక నిపుణులు. ఆప్యాయత, అనురాగాన్ని గోరుముద్దలతో పంచిపెడతారు. విలువలు, విజ్ఞానాన్ని కథల రూపంలో చెబుతారు. ప్రేమగా పెంచి క్షేమంగా మీకప్పగిస్తారు. మరికొన్ని లాభాలూ ఉన్నాయి.

పిల్లలు - పెంపకం

కప్పుడు అన్నీ ఉమ్మడి కుటుంబాలే. పిల్లలు పెద్దవాళ్ల మధ్యే పెరిగేవారు. నడక నేర్చుకున్నప్పటి నుంచి ఓ స్థాయికి వచ్చే వరకు తాత, నాయనమ్మ లేదా అమ్మమ్మ సంరక్షణలో ఉండేవారు. క్రమంగా ఉమ్మడి కుటుంబాలు తగ్గాయి. ఉద్యోగాలరీత్యా పెద్దవాళ్లకు దూరంగా ఉండాల్సిన పరిస్థితి. అయినప్పటికీ ఈ తరం తల్లిదండ్రుల్లో చాలా మంది తమ పిల్లల్ని కేర్‌సెంటర్ల కన్నా... పెద్దవాళ్ల పర్యవేక్షణలో ఉంచడానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. దానికి కారణాలు ఉన్నాయనీ అంటున్నారు. 'ఈ రోజుల్లో కెరీర్‌లో ఎదగాలనుకునే మహిళలకు పిల్లల పెంపకం ఓ సవాలే. నేను బ్యాంకు ఉద్యోగిని. పని ఒత్తిడి ఎక్కువే. మా దగ్గర నాలాంటి సహోద్యోగుల్ని గమనిస్తుంటా. వాళ్లల్లో కొందరు తమ పిల్లల్ని కేర్‌సెంటర్‌లో వదిలేస్తారు. మరికొందరు ఇంట్లో సహాయకురాలిని పెట్టుకుని నెట్టుకొస్తున్నారు. రెండింటితోనూ సమస్యలే. పిల్లల్ని కేర్‌సెంటర్‌లో వదిలితే ఆ తల్లి సమయానికి కచ్చితంగా వెళ్లిపోవాలి. లేదంటే నిర్వాహకులు అదనంగా డబ్బు తీసుకుంటారు. ఒకవేళ ఇంట్లో సహాయకురాలిని పెట్టుకున్నా... సీసీటీవీ సదుపాయం ఏర్పాటు చేసుకున్నా... ఆమె తొమ్మిది లేదా పది గంటలకు మించి ఉండకపోవచ్చు. ఇలాంటి ఒత్తిళ్లేవీ లేకుండా ఉండాలంటే... పెద్దవాళ్ల సంరక్షణలో పిల్లల్ని ఉంచాలి. నా లాంటి ఉద్యోగినులకు ఏ చింతా ఉండదు. నేను అదే చేస్తున్నా.

అమ్మాయి పుట్టినప్పటినుంచీ మా అమ్మానాన్నల దగ్గరే పెంచుతున్నా. నాతో పోలిస్తే... వాళ్లే మా పాపకు అన్నీ నేర్పిస్తున్నారు. సంస్కృతీ, సంప్రదాయాలు తెలుస్తున్నాయి. కథల ద్వారా నైతిక విలువలు నేర్చుకుంటోంది. మాతృభాష స్పష్టంగా వస్తోంది. ఇంటి ఆహారం అంది పాప ఆరోగ్యమూ బాగుంటుంది. వీటన్నింటికీ మించి ఎంత పని ఒత్తిడి ఉన్నా... నాకు కంగారు ఉండదు. ధైర్యంగా ఉద్యోగం చేసుకోవచ్చు...' అని అంటోంది హైదరాబాద్‌కు చెందిన కల్యాణిరావు. పెద్దవాళ్ల సమక్షంలో పెరగడం వల్ల పిల్లలకు భద్రత లభిస్తుందని చెబుతుంది మరో ఉద్యోగిని అనిత. 'తల్లిదండ్రులిద్దరూ ఉద్యోగినులైతే... పొద్దున్నే ఇంట్లోంచి వెళ్లిపోతారు. పిల్లలు సాయంత్రం బడి నుంచి ఇంటికి రాగానే అమ్మానాన్న ఉండరు. వాళ్ల స్థానంలో తాత, అమ్మమ్మ లేదా నానమ్మ కనిపిస్తే మన అనే భావన వారిలో కలుగుతుంది. ఆ సంతోషం నుంచే ధైర్యం వస్తుంది. పిల్లలకు బయటివాళ్ల దగ్గర ఆ భరోసా కలగదు. ఇదొక్కటే కాదు... చిన్నారులు ట్యూషన్‌కి వెళ్లాలన్నా, ఏదయినా శిక్షణ తీసుకోవాలన్నా... పెద్దవాళ్ల పర్యవేక్షణ ఉంటుంది. అమ్మానాన్నలు ఉద్యోగులు అయినప్పుడు పిల్లలకు వాళ్లు కేటాయించే సమయం తక్కువ. అది తాత, నానమ్మ లేదా అమ్మమ్మ నుంచి అందుతుంది. మా పిల్లల్ని చూసుకునేందుకు మామగారు ఉంటారు. మా ఆడపడుచూ ఉద్యోగం చేయడం వల్ల అత్తగారు వాళ్ల బాధ్యత తీసుకున్నారు. వారాంతంలో ఆవిడ ఇక్కడకు రావడమో, ఆయన అక్కడకు వెళ్లడమో చేస్తారు. ఇలాంటి పరిస్థితి అందరికీ ఉండకపోవచ్చు కానీ... ఉద్యోగినులు పెద్దవాళ్ల సహకారం తీసుకుంటేనే మంచిది. ఒకవేళ అది సాధ్యం కాకపోయినా కనీసం సెలవుల్లో అయినా.. వాళ్ల దగ్గరకు పంపించాలి. వాళ్లు అన్నీ ఓపిగ్గా చెబుతారు...' అని వివరిస్తుంది.

లాభాలు ఎక్కువే...

బాల్యంలో పిల్లలకు ప్రేమ, ఆప్యాయత, అనురాగం అవసరం. అవి తల్లిదండ్రుల నుంచి అందాలి. తల్లి ఉద్యోగం చేస్తున్నప్పుడు అది సాధ్యం కాకపోవచ్చు. పెద్దవాళ్ల సహకారం తీసుకుంటే... ఏ ఇబ్బందీ ఉండదంటారు మానసిక నిపుణురాలు డాక్టర్ పద్మజ. 'కుటుంబంలోని ఆప్యాయతలు, కష్టసుఖాలు పంచుకునే తత్వం వారికి నలుగురితో కలిసి ఉన్నప్పుడే వస్తాయి. నలుగురితో కలిసిమెలిసి ఉండటం నేర్చుకుంటారు. ఇది వాళ్లకు పెద్దయ్యాక ఉపయోగపడుతుంది. ఎదిగే క్రమంలో ఎదురయ్యే ఎత్తు పల్లాలను తట్టుకోగలుగుతారు. పంచుకునే తత్వమూ అలవడుతుంది. ముఖ్యంగా సర్దుకుపోయేతత్వం వస్తుంది. అది వారికి జీవితంలో ఎంతో మేలు చేస్తుంది....' అని చెబుతారామె. అధ్యయనాలూ అదే చెబుతున్నాయి. ఇలా పెద్దవాళ్ల మధ్య పెరగడం వల్ల చిన్నారులకు బోలెడు జ్ఞాపకాలు ఉంటాయి. ఉద్వేగాలు అదుపులో ఉంచుకోగలుగుతారు. భావవ్యక్తీకరణ నైపుణ్యాలు సొంతవుతాయి. పిల్లలకు ప్రేమాభిమానాలు తప్ప... కొట్టడం, తిట్టడం వంటివి ఉండవు. ఇవన్నీ వారిపై సానుకూల ప్రభావాన్ని చూపిస్తాయి. ఆత్మవిశ్వాసం సొంతమవుతుందని చెబుతోంది ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయం నిర్వహించిన అధ్యయనం. చిన్నారులే కాదు... పెద్దవాళ్లూ పిల్లలతో గడిపినప్పుడు ఆనందంగా ఉంటారట. వారిలో హ్యాపీ హార్మోన్లు విడుదలై మానసిక ఒత్తిడి దూరమవుతుంది. ఆరోగ్యంగానూ ఉంటారు. మలి వయసులో వచ్చే అనారోగ్యాలు దూరమవడంతో పాటు అయుష్షూ పెరుగుతుందని చెబుతున్నాయి అధ్యయనాలు. పిల్లల సాయంతో వాట్సాప్ చాటింగ్‌లు, వీడియో కాల్స్, యూట్యూబ్.. ఇలా అన్నీ నేర్చుకునే పెద్దవారూ లేకపోలేదు. ఈ రోజుల్లో పిల్లలు రకరకాల రుచులు కోరుకోవడం మామూలే. వారికి తగినట్లుగా కొత్త పదార్థాలను ప్రయోగం చేసేందుకు వివిధ వెబ్‌సైట్లు చూసే పెద్దవారూ చాలామంది ఉన్నారనడం అతిశయోక్తి కాదు.

ఎన్నో తెలుసుకుంటున్నాం...

నాకు ముగ్గురు అమ్మాయిలు. పెద్ద మనమరాలిని పెంచా. రెండో అమ్మాయి కొడుకూ నా దగ్గరే ఉన్నాడు. మా అమ్మాయి, అల్లుడు... ఇద్దరూ ఉద్యోగస్థులే. దాంతో వాడికి నాలుగేళ్లున్నప్పుడు తీసుకొచ్చేశాం. ఇప్పుడు రెండో తరగతి చదువుతున్నాడు. నాకు తెలుగు తప్ప ఏం రాదు. వాడేమో ఇంగ్లిష్‌లో మాట్లాడతాడు. ఇప్పుడిప్పుడే వాడివల్ల ఇంగ్లిష్ పదాలు నేర్చుకుంటున్నా. స్కూల్లో నేర్పించినవన్నీ నాకూ, మావారికి చెబుతుంటాడు. టీచర్లు నేర్పించిన యోగాసనాల్ని వేయిస్తాడు. వాడివల్ల మాకు బోలెడు తెలుస్తున్నాయి...' అని చెబుతారు మంచిర్యాలకు చెందిన సంగ శంకరమ్మ.

డాన్స్ చేస్తూ పాఠాలు చెబుతూ...

ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు ఆంగ్లం సరిగ్గా రాదంటారు. ఆ అభిప్రాయం తప్పని నిరూపించాలనుకున్నారు ఓ ఉపాధ్యాయురాలు. పిల్లలకు చిన్నప్పటి నుంచీ ఆంగ్లంపై ఉన్న భయం పోయి, వాళ్లు చక్కగా మాట్లాడేందుకు ఓ మార్గాన్ని ఎంచుకున్నారామె. ఆ పాఠాలన్నీ డ్యాన్స్ రూపంలో నేర్పించడం మొదలుపెట్టారు. ఆమే ఎవాంజిలిన్ ప్రిసిల్లా.

తమిళనాడు, అవినాశిలోని చెయ్యూరు ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయురాలిగా చేస్తున్నారు ఎవాంజిలిన్. మాతృభాష తమిళం కావడంతో ఆంగ్లం నేర్చుకోవడానికి విద్యార్థులు ఆసక్తి చూపించకపోవడం గుర్తించారామె. చివరకు పాఠాలను పాటలుగా మార్చి... పాడుతూ, డ్యాన్స్ చేస్తూ నేర్పిస్తున్నారు. పిల్లలకూ ఇది నచ్చడంతో ఉత్సాహంగా ఆంగ్లంపై పట్టు సాధిస్తున్నారు. 'మొదట నేను డ్యాన్స్ చేస్తుంటే తరగతిలో పిల్లలంతా నవ్వుతూ చూస్తూ ఉండిపోయేవారు. ఇప్పుడు నాతో కలిసి అడుగులు వేస్తున్నారు. మంచి మార్కులూ తెచ్చుకుంటున్నారు. దీంతో పాఠశాల యాజమాన్యం మిగతా తరగతుల్లోనూ ఇదే అనుసరించాలని కోరింది. పాఠాన్ని ముందుగానే పాటలా మార్చి, డ్యాన్స్ రూపంలో మార్చడం కష్టమే కానీ... పిల్లలకు నచ్చుతోందిగా. అది చాలు...' అని అంటున్నారామె.

ప్లాస్టిక్ ఎందుకు?

పర్యావరణ పరిరక్షణ మన ఇంటినుంచే మొదలుకావాలి. దానికోసం మనపంతుగా ఏం చేయొచ్చంటే...

- ఒకప్పుడు గాజు నీళ్ల సీసాలు వాడేవాళ్లం. ఇప్పుడవి మళ్లీ అందుబాటులోకి వచ్చాయి. ప్లాస్టిక్ సీసాల బదులు వాటిని ఎంచుకుని చూడండి. ఆరోగ్యానికి మంచిది. పర్యావరణానికి ఉడతాభక్తిగా సాయం చేసినవారవుతారు.
- భూమిలో కరిగిపోయే బ్యాగులను అమ్ముతున్నారిప్పుడు. అలాంటివి రెండు మూడు కొనిపెట్టుకుంటే... ప్లాస్టిక్ కవర్ల వాడకానికి చుక్క పెట్టొచ్చు.
- రోజూ వాడే ప్లాస్టిక్ టూత్‌బ్రష్‌లకు బదులుగా వెదురుతో చేసిన వాటిని ఎంచుకోండి. ఎక్కువ కాలం మన్నడమే కాకుండా భూమిలోనూ కలిసిపోతాయి.

బంగారం వెండి

10న ముగింపు-క్రితం

	హైదరాబాద్		విజయవాడ	
బంగారం(24క్యా)	38,650	38,620	38,700	38,730
ఆర్నమెంట్	36,260	36,150	35,820	35,870
వెండి (కిలో)	44,575	44,510	44,700	44,700
	ప్రొద్దుటూరు		రాజమహేంద్రవరం	
బంగారం(24క్యా)	37,250	37,500	38,680	38,570
ఆర్నమెంట్	34,600	34,430	35,820	35,530
వెండి (కిలో)	43,500	43,500	44,600	44,500
	విశాఖపట్నం		తమిళనాడు	
బంగారం(24క్యా)	38,370	38,250	------	------
ఆర్నమెంట్	35,690	35,580	3,582	3,569 గ్రా
వెండి (కిలో)	45,500	45,500	47.30	47.50 గ్రా



గీతను ఉర్దూలో అనువదించి..

యంగ్ టాలెంట్

హిబా ఫాతిమా స్వస్థలం బోధన్‌లోని రాకాసిపేట్. తండ్రి అహ్మద్‌ఖాన్. చిరు వ్యాపారి. అన్ని మతాలు సమానమేనని, మానవత్వమే మనిషి తత్వమని చిన్నప్పటి నుంచే హిబాకు చెప్పేవాడు. అన్ని మత గ్రంథాలను అధ్యయనం చేయమనేవాడు. అలా ఆమె ఇతర మతాల సారాన్ని తెలుసుకోవడం ప్రారంభించింది. హిందూ పవిత్ర గ్రంథం భగవద్గీత గురించి తెలుసుకునేందుకు యూట్యూబ్‌లో వీడియోలు చూసేది. అందులోని శ్లోకాలకు ఒక్కొక్కరు ఒక్కో రకమైన భావాలు చెప్పేవారు. ఇవి ఆమెను గందరగోళానికి గురిచేసేవి. దీనికి పరిష్కారం కనుక్కోవాలని నిర్ణయించుకుంది. భగవద్గీతను పూర్తిగా చదివి ఉర్దూలోకి తర్జుమా చేయాలనుకుంది. హిబా ఇంటర్ వరకూ ఉర్దూ మాధ్యమంలో డిగ్రీలో ఆంగ్ల మాధ్యమంలో చదివింది. భగవద్గీతను కూలంకషంగా అధ్యయనం చేయడం కోసం తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో గీతను తెప్పించుకుంది. అన్నింటినీ పూర్తిగా చదివి, తన వయసు వారికి అర్థమయ్యేలా ఉర్దూలోకి అనువాదం చేయడం ప్రారంభించింది. మూడు నెలల్లో ఈ గ్రంథంలోని మొత్తం 700 శ్లోకాలు, 18 అధ్యాయాలను తర్జుమా చేసింది. శ్లోకాలను ఉర్దూలో రాసే సమయంలో హిబా ఎన్నో అనువాద సమస్యలు ఎదుర్కొంది. ఒక పదానికి సమాన అర్థం వెతకడానికి కష్టపడేది. ఆ తరువాత వాటిని క్రమపద్ధతిలో పెట్టడం ఆమెకు మరో సమస్య. ఒక శ్లోకాన్ని అనువదించిన తరువాత దాన్ని సరైన రీతిలో చెప్పడానికి ఎన్నో సార్లు తిరిగిరాసేది. రెండు గ్రంథాల సారాంశాన్ని వివరించడానికి 'మెసేజ్ ఫర్ ఆల్' పేరిట ఓ యూట్యూబ్ ఛానల్ నిర్వహిస్తోంది. అందులో ఇప్పటి వరకు 80 వీడియోలను ఉంచింది.

ఆమెది సంప్రదాయ ముస్లిం కుటుంబం. ప్రస్తుతం బీఈడీ చదువుతోంది. పరమతం గురించి తెలుసుకోవాలనే తపనతో హిందువుల పవిత్ర గ్రంథం భగవద్గీతపై అధ్యయనం చేసింది. ఇప్పుడు గీతను ఉర్దూలోకి అనువాదం చేసింది. పుస్తకమూ రాసే ప్రయత్నంలో ఉంది. ఆ ప్రతిభావనే నిజామాబాద్‌కు చెందిన హిబా ఫాతిమా.

సారూప్యతను వివరిస్తూ...

గీత చదివే సమయంలో కొన్ని శ్లోకాల తాత్పర్యం, ఖురాన్‌లోని ఆయద్‌ల అర్థం... రెండూ ఒకేలా ఉండేవి. ఇప్పటి వరకు రెండు గ్రంథాల్లో ఒకే అర్థం వచ్చిన శ్లోకాలను 500 వరకు గుర్తించింది హిబా. ఈ రెండు గ్రంథాల్లోని సారూప్యతను తెలియజేస్తూ 'సిమిలారిటీస్ బిట్వీన్ భగవద్గీత అండ్ ఖురాన్' అనే పుస్తకం రాయడం మొదలుపెట్టింది. 'అన్ని మత గ్రంథాలు మనిషి ఎలా జీవించాలో తెలియజేస్తున్నాయి. నా వయసు వారికి సులువుగా అర్థమయ్యేలా గీతను ఉర్దూలోకి అనువదించా. మానవత్వమే ప్రధాన మతమని భవిష్యత్తులో కార్యక్రమాలు చేపట్టాలనుకుంటున్నా' అని అంటోంది హిబా.

– గున్‌కొండ సునీల్ కుమార్, న్యూస్‌టుడే, బోధన్ పట్టణం

నజరానా

పావు కప్పు చల్లటి గ్రీన్‌టీలో రెండు చెంచాల బియ్యప్పిండి, అర చెంచా తేనె, కొద్దిగా పెరుగు కలిపి ముఖానికి రాసుకోవాలి. ఆరాక కడిగేసుకుంటే... చర్మం కాంతివంతంగా మారుతుంది.

ఫిట్‌నెస్‌బ్యాండ్ అదిరేలా

అమ్మాయిలు ఏ వస్తువు వాడినా అది వర్ణరంజితంగా ఉండాలి. ట్రెండీగానూ కనిపించాలి. వాళ్ల అభిరుచికి అనుగుణంగా డిజైనర్లూ రకరకాల వస్తువులు రూపొందిస్తున్నారు. అలాంటివే ఈ ఫిట్‌నెస్ బ్యాండ్లు. బ్రేస్‌లెట్, వాచీ, ఇతర డిజైన్లలో ఆకట్టుకుంటున్నాయి. సందర్భానుసారంగా దుస్తులకు తగినట్లుగా మ్యాచింగ్ చేసుకునేలా అందుబాటులోకి వస్తున్నాయి.

చదువుకుంటూ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నా... వివిధ రంగాల్లో ప్రతిభ చూపుతున్నా... ఏవయినా ప్రయోగాలు చేస్తున్న అమ్మాయిలు మీరయితే... మీ గురించి మాకు రాసి పంపండి. మీ ప్రతిభను మేం ఫొటోతో సహా ప్రచురిస్తాం.

మా ఈమెయిల్ ఐడీ : vasundhara@eenadu.net

బరువు తగ్గించే సెనగలు!

శ్రావణమాసం కదా... ఏ తెలుగింట్లో చూసినా వాయనాలుగా ఇచ్చిపుచ్చుకునే సెనగలు కనిపిస్తూనే ఉంటాయి. మనకు

ఇలా పండగలప్పుడు మాత్రమే కనిపించే సెనగలని ఉత్తరాదిన రోజువారీ ఆహారంగా వండుకుంటారు. వీటిల్లోని పోషక విలువలు తెలిస్తే... మీరూ ఏడాదంతా వండుకుంటారు..

బరువు తగ్గాలనుకునే వారికి: వీటిల్లో కెలొరీలు తక్కువ. పీచు, ఇతరత్రా పోషకాలు అపారం. ఆ కారణంగానే ఉదయం పూట రెండుమూడు చెంచాల సెనగలు తిన్నా... రోజుకు అవసరమైన కాయగూరలు, పండ్లలో ఐదోవంతు తిన్నట్టే. అంతేకాదు.. సెనగలు తిన్నప్పుడు కడుపు నిండిన భావన కలిగి బయట తిండి తినాలనే కోరిక తగ్గుతుంది. దాంతో బరువు అదుపులో ఉంటుంది.

శాకాహారుల మాంసం: ప్రొటీన్లు అందాలంటే మాంసాహారం తినాల్సిందే.. అనే అపోహకు చెక్ పెడతాయి సెనగలు. కారణం... ఇవి శరీరానికి కావాల్సిన ప్రొటీన్లని పుష్కలంగా అందిస్తాయి.

మహిళలకు ప్రత్యేకం: వారంలో కనీసం రెండుమూడుసార్లైనా కొమ్ము సెనగలని తింటూ ఉండే మహిళల్లో రొమ్ముక్యాన్సర్, కీళ్లనొప్పుల వంటివి అదుపులో ఉంటాయట. వేయించిన సెనగలని, నెయ్యి, పంచదారతో కలిపితింటే జననాంగ సమస్యల నుంచి ఉపశమనం కలుగుతుందని చెబుతున్నారు పోషకాహార నిపుణులు.

కావాల్సినవి: నానబెట్టిన సెనగలు- కప్పున్నర, ఉప్పు- తగినంత, పసుపు- పావుచెంచా, కారం- అరచెంచా, జీలకర్ర- అరచెంచా, ధనియాలపొడి- అరచెంచా, నూనె- తగినంత.

తయారీ: కుక్కర్‌లో కొద్దిగా ఉప్పు వేసి సెనగలని మరీ మెత్తగా కాకుండా ఉడికించిపెట్టుకోవాలి. కడాయిలో కొద్దిగా నూనె, జీలకర్ర వేసి అవి వేగాక సెనగలని వేసుకోవాలి. ఆపైన కారం, పసుపు, ధనియాలపొడి వేస్తే చక్కని స్నాసీ సెనగలు సిద్ధం.

బ్యాక్టీరియాను తొలగిస్తుంది!

కొత్త పరికరం!

వర్షాకాలం కదా! మార్కెట్ నుంచి తెచ్చిన ఆకుకూరలు, కాయగూరలు ఏవైనా సరే మట్టితో ఉంటాయి కాబట్టి బాగా శుభ్రం చేయాలి. రెట్టింపు నీటిని వాడాలి. శుభ్రం చేయడానికి పట్టే సమయమూ ఎక్కువే. అంత చేసినా నీరు, మట్టితో వచ్చే ఏ బ్యాక్టీరియా వల్లనైనా అనారోగ్య సమస్యలొస్తాయేమోననే అనుమానం వెంటాడుతుంది. ఈ సమస్యలేమీ లేకుండా సులభంగా బ్యాక్టీరియా, మురికిని తొలగించే అవకాశం ఉంటే బాగుండును కదా? ఓమీసోనిక్ వైర్‌లెస్ పరికరం మీకా సదుపాయం కల్పిస్తుంది. చూడ్డానికి పెద్ద స్టీల్ నాణెంలా ఉండే ఓమీసోనిక్ పరికరాన్ని వాడటం చాలా తేలిక. ఒక పాత్రలో నీళ్లుపోసి అందులో కాయగూరలు వేసి ఈ పరికరాన్ని ఉంచితే సరి. నిమిషాల్లో కాయగూరలకంటిన మట్టి, బ్యాక్టీరియా తొలగిపోతాయి. అనారోగ్య సమస్యల బాధ ఉండదు. శుభ్రం చేయడానికి అయ్యే సమయమూ ఆదా అవుతుంది.

గట్టిగట్టినా ఘనాహారం

ఎండెందు వెదికినా అందందు పోషకం!

మీ ఊళ్లో ఉంటాం...
మీ పొలం గట్లపై కనిపిస్తాం...
మీ ఇంట్లో పెరుగుతాం...
మీ చుట్టుపక్కల దొరుకుతాం...
మీరు చేయాల్సిందొక్కటే...
కాస్తంత ఓపిగ్గా వెదకండి,
దొరికిన వెంటనే ఏ పప్పులోనో వేసి మెదపండి...
మీ నాలుకకు రుచిగా,
మీ ఆర్యోగానికి రక్షగా మేం మారకపోతే ఒట్టండీ...

కొండపిండాకు పప్పు

కావాల్సినవి: కొండపిండాకు- కట్ట, ఉల్లిపాయముక్కలు- కప్పు, ఎండుమిర్చి- నాలుగు, పచ్చిమిర్చి- రెండు, చింతపండు రసం- మూడు చెంచాలు, నానబెట్టిన సెనగపప్పు- అరకప్పు, వెల్లుల్లిరెబ్బలు- నాలుగు, ఆవాలు- పావుచెంచా, జీలకర్ర- అరచెంచా, కరివేపాకు- రెబ్బ, ఉప్పు, నూనె- తగినంత.

తయారీ: ముందుగా కడాయి పెట్టి నూనె వేసి వేడెక్కాక అందులో ఆవాలు, జీలకర్ర, ఎండుమిర్చి, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించుకోవాలి. అవన్నీ వేగాక ఉల్లిపాయముక్కలు వేసి వేయించుకోవాలి. అవీ.. మగ్గాక నానబెట్టిన సెనగపప్పు వేసి వేయించుకోవాలి. పప్పు మగ్గిన తర్వాత చింతపండురసం వేసి బాగా కలుపుకోవాలి. చివరిగా కొండపిండాకు వేసి కలిపి పావుగంటపాటు ఉడికించుకోవాలి. సెనగపప్పుతో మగ్గి కొండపిండాకు ఉడుకుతుంది.

ప్రయోజనాలు:
దీనినే పాషాణభేది అని పిలుస్తారు. దీనిలో నీటిశాతం తక్కువ. పీచు ఎక్కువ. మూత్రపిండాల్లో రాళ్లున్నప్పుడు వాటిని కరిగించుకోవడానికి ఉపయోగపడుతుంది. శరీరంలో క్యాల్షియంతో పేరుకుపోయిన పదార్థాలున్నప్పుడు వాటిని తొలగించుకోవడానికి కొండపిండాకు కూర తింటారు. ఎన్నాళ్లు తిన్నా ఎటువంటి దుష్ప్రభావాలు ఉండవు. పప్పుతో కలిపి తినొచ్చు.

పంటలు: జ్యోతి వలబోజు
వైద్య విలువల సహకారం- డాక్టర్ పెద్ది రమాదేవి, ఆయుర్వేద నిపుణులు

చెనంగాకు పాడి

కావాల్సినవి: చెనంగాకు- మూడుకప్పులు, ఎండుమిర్చి- ఐదు, జీలకర్ర- చెంచా, ధనియాలు- రెండు చెంచాలు, మెంతులు- పావుచెంచా, చింతపండు- నిమ్మకాయంత, పసుపు- చిటికెడు, ఇంగువ- చిటికెడు, ఉప్పు- తగినంత, నూనె- మూడుచెంచాలు

తయారీ: చెనంగాకుని శుభ్రం చేసిన తర్వాత తడిలేకుండా నీడపట్టున ఆరబెట్టుకోవాలి. కడాయిలో చెంచాడు నూనెవేసి వేడయ్యాక... ఎండుమిర్చి, ధనియాలు, జీలకర్ర, మెంతులు వేసి దోరగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. అదే కడాయిలో .. నూనె వేసి అందులో ఆరిన చెనంగాకు వేసి తడి మొత్తం పోయేలా నిదానంగా వేయించుకోవాలి. మిక్సీలో ముందుగా వేయించుకున్న దినుసులని బరకగా పొడిచేసుకుని... చెనంగాకు, చింతపండు, ఇంగువ, పసుపు, తగినంత ఉప్పు వేసి మరీ మెత్తగా కాకుండా పొడి చేసుకోవాలి. మరొక్కసారి బాణలిలో ఆ పొడిని వేయించుకుంటే తడి ఉంటే అది కూడా పోతుంది. చల్లారిన తర్వాత సీసాలో వేసి పెట్టుకోవాలి.

ప్రయోజనాలు: దీనినే కసివింద అంటారు. గ్రామీణ వైద్యానికి పెట్టింది పేరు. నాడీ సొప్పులను తగ్గిస్తుంది. పైపూతగా, నోటి మందుగా కూడా ఉపయోగపడుతుంది. పచ్చడి, పొడి ఎలా చేసినా బావుంటుంది. అజీర్ణ సమస్యలు, కాలేయ సమస్యలున్నప్పుడు ఉపశమనం కోసం తింటారు. దీన్నే నీగ్రో కాఫీ ప్లాంట్ అని కూడా అంటారు. కడుపులో ఇన్‌ఫెక్షన్లు పోవడానికి సాయం చేస్తుంది.

చామాకు బడీలు

కావాల్సినవి: చామకూర ఆకులు- 6, సెనగపిండి- కప్పు, పసుపు- చిటికెడు, కారంపొడి- చెంచా, ధనియాలపొడి- అరచెంచా, అల్లంవెల్లుల్లిముద్ద- అరచెంచా, వాము- చెంచా, ఉప్పు- తగినంత, నూనె- మూడు చెంచాలు

తయారీ: చామకూర ఆకులు పెద్దవి తీసుకుని కడిగి తుడిచి పెట్టుకోవాలి. ఒక గిన్నెలో సెనగపిండి, పసుపు, కారంపొడి, ధనియాలపొడి, అల్లంవెల్లుల్లిముద్ద, వాము, గరంమసాలా పొడి, తగినంత ఉప్పు వేసి కొద్దిగా నీళ్లు పోసి చిక్కటి పేస్ట్‌లా చేసుకోవాలి. చామకూర ఆకులపై ఈ సెనగపిండి మిశ్రమాన్ని దానిమీద పలుచగా రాయాలి. తర్వాత ఆకుని జాగ్రత్తగా చుట్టాలి. ఇలా ఆకులన్నీ చేసుకుని ఆవిరి మీద పది నిమిషాలపాటు ఉడికించుకోవాలి. చల్లారిన తర్వాత అంగుళం సైజు ముక్కలుగా కట్ చేసుకుని సన్నగా తరిగిన ఉల్లిపాయలతో వడ్డించుకోవాలి.

ప్రయోజనాలు: చామగడ్డల ఆకులివి. వెడల్పుగా ఉంటుందీ ఆకు. గడ్డల్లో కంటే ఆకులోనే ఎక్కువ పోషకాలుంటాయి. చామాకు పొట్లాలు చేసుకుంటారు. వేడినీళ్లలో ముంచి వాడుకోవాలి. ప్రొటీన్లు, పీచు, విటమిన్ ఎ అధికంగా ఉండే ఆహారం ఇది. తక్షణ శక్తినిచ్చే ఆహారం. పీచు అధికంగా ఉండటంతో బరువు తగ్గడం తేలిక. కంటిచూపు మెరుగవుతుంది.

తెల్ల గలిజేరు పచ్చడి

కావాల్సినవి: గలిజేరు ఆకులు- మూడు కప్పులు, ఎండుమిర్చి- మూడు, పచ్చిమిర్చి- రెండు, జీలకర్ర- చెంచా, ధనియాలు- రెండు చెంచాలు, మిరియాలు- పావుచెంచా, పల్లీలు- పావుకప్పు, చింతపండు- నిమ్మకాయంత, ఇంగువ- చిటికెడు, వెల్లుల్లిరెబ్బలు- ఆరు, ఉప్పు- తగినంత, నూనె- తగినంత, పోపుదినుసులు(ఆవాలు, జీలకర్ర, కరివేపాకు)

తయారీ: గలిజేరు ఆకులని శుభ్రం చేసి కడిగి, తడిలేకుండా ఆరనివ్వాలి. కడాయిలో ఎండుమిర్చి, ధనియాలు, జీలకర్ర, పల్లీలు, మిరియాలు... వీటిని విడివిడిగా దోరగా వేయించుకోవాలి. వీటన్నింటిని చల్లార్చుకుని మిక్సీలో బరకగా పొడిచేసుకుని అందులోనే గలిజేరు ఆకులు, చింతపండు వేసి మిక్సీ పట్టాలి. అవసరాన్ని బట్టి కాసిని నీళ్లు చిలకరించుకోవచ్చు. తాలింపు వేసుకుని ఈ మిశ్రమంలో కలుపుకొంటే గలిజేరు పచ్చడి సిద్ధం. నాలుగు రోజుల వరకూ నిల్వ ఉంటుంది.

ప్రయోజనాలు: తెల్ల గలిజేరునే పునర్నవ, అటికమామిడి, పప్పాకు అని కూడా అంటారు. ఇంటి వైద్యానికి పెట్టింది పేరు. శరీరంలో అధికంగా నీరు పట్టినప్పుడు ఆ నీటిని తగ్గించే గుణం దీనికి ఉంటుంది. యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే ఆకుకూర ఇది. దీనిలోని విటమిన్ సి మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు తగ్గించడంలో ఉపయోగపడుతుంది. క్యాల్షియం పుష్కలంగా ఉండే ఆహారం ఇది.

ఎర్రతోటకూర పొడికూర

కావాల్సినవి: ఎర్రతోటకూర తరుగు- నాలుగు కప్పులు, ఉల్లిపాయలు- రెండు, పచ్చిమిర్చి- రెండు, పసుపు- పావుచెంచా, కారంపొడి- చెంచా, ధనియాలపొడి- చెంచా, గరంమసాలాపొడి- పావుచెంచా, అల్లంవెల్లుల్లిముద్ద- అరచెంచా, ఉప్పు- తగినంత, నూనె- మూడుచెంచాలు

తయారీ: తాజాగా ఉన్న తోటకూర ఆకులు, లేతగా ఉన్న కాడలు కూడా కలిపి సన్నగా తరిగి నీళ్లలో వేసి కడిగి జల్లెడలో వేసుకోవాలి. వెడల్పాటి బాణలిలో నూనె వేడిచేసి సన్నగా తరిగిన ఉల్లిపాయముక్కలు వేసి వేయించుకోవాలి. ఇందులో పసుపు, అల్లంవెల్లుల్లి ముద్ద వేసి కలిపి కారంపొడి, ధనియాలపొడి వేసి రెండునిమిషాలపాటు వేగిన తర్వాత ఎర్రతోటకూర తురుము, తగినంత ఉప్పు వేసి కలిపి మూతపెట్టి చిన్నమంటమీద మగ్గనివ్వాలి. నీరంతా ఊరి, ఆకుకూర మొత్తం ఉడికిన తర్వాత గరంమసాలా పొడివేసి కలిపి తడిమొత్తం పోయేంతవరకూ ఉంచి దించాలి.

ప్రయోజనాలు: పీచు పదార్థం అధికంగా ఉంటుంది. ఎ, సి విటమిన్లు అధికంగా ఉండే ఆహారం ఇది. శరీరం క్యాల్షియం అవసరాలు తీర్చడానికి ఉపయోగపడుతుంది. ఎముకలకు మేలు చేస్తుంది. బాలింతలకు, గర్భిణులకు మంచిది. పులుసుగా కూడా చేసుకోవచ్చు.

చిర్రాకు వేపుడు

కావాల్సినవి: చిర్రాకు- కట్ట, నూనె- రెండు చెంచాలు, సెనగపప్పు- చెంచా, మినప్పప్పు- చెంచా, ఆవాలు- పావుచెంచా, ఎండుమిర్చి- పావుకప్పు, పల్లీలు- మూడు చెంచాలు, ఉప్పు- తగినంత, వెల్లుల్లిరెబ్బలు- మూడు

తయారీ: ముందుగా పల్లీలు, ఎండుమిరపకాయలని విడివిడిగా వేయించుకుని పక్కన పెట్టుకోవాలి. పాన్‌లో నూనెపోసి వేడెక్కాక అందులో మినప్పప్పు, సెనగపప్పు, ఆవాలు వేసి బాగా వేయించుకోవాలి. దంచిన వెల్లుల్లి కూడా వేసి వేగిన తర్వాత... శుభ్రం చేసిన చిర్రాకుని వేసి దానిలోని నీరంతా పోయేంతవరకూ వేయించుకోవాలి. చివరిగా... ఎండుమిర్చి, పల్లీలను మిక్సీలో వేసి పొడికొట్టుకోవాలి. ఈ పొడిని చిర్రాకులో వేసి బాగా కలిపి దింపుకోవడమే.



ప్రయోజనాలు: చిర్రాకు లేదా చిర్రి ఆకు అనీ ముళ్ల తోటకూర అనీ అంటారు. చర్మ సమస్యలకు పైపూతగా వాడతారు. పప్పుతో కలిపి తింటే దురదలు వంటి సమస్యలు తగ్గుతాయి. దీనిలో సల్ఫర్ శాతం అధికంగా ఉంటుంది.



పాక్‌ను కొట్టి ఫైనల్‌కు

చరిత్ర సృష్టించిన భారత్ ● ఆసియా అండర్-23 వాలీబాల్

దిల్లీ: భారత అండర్-23 పురుషుల వాలీబాల్ జట్టు చరిత్ర సృష్టించింది. ఆసియా అండర్-23 ఛాంపియన్‌షిప్‌లో తొలిసారిగా ఫైనల్ చేరింది. సెమీఫైనల్లో భారత్.. పాకిస్థాన్‌ను మట్టికరిపించి ముందంజ వేయడం విశేషం. మయన్మార్‌లో శనివారం హోరాహోరీగా సాగిన ఈ పోరులో భారత్ 21-25, 25-16, 25-22, 25-18తో పాక్‌ను మట్టికరిపించింది. పోటాపోటీగా సాగిన తొలి సెట్‌లో భారత్ కాస్త తడబడింది. త్రుటిలో సెట్‌ను చేజార్చుకుంది. అయినా స్థైర్యం కోల్పోకుండా రెండో సెట్లో గొప్పగా పుంజుకుంది. అలవోకగా సెట్‌ను చేజిక్కించుకుంది. మూడో సెట్లో ఇరు జట్లూ హోరాహోరీగా తలపడ్డాయి. కానీ భారత్ పట్టు వదల్లేదు. చివరి సెట్లో భారత్‌కు ఎదురులేకపోయింది. ఆదివారం ఫైనల్లో భారత్.. ఫైనీస్ తైపేని ఢీకొనబోతోంది. తైపే సెమీస్‌లో 3-2తో జపాన్‌ను ఓడించింది. ఈ టోర్నీలో ఫైనల్ చేరడం ద్వారా భారత్.. ఎఫ్‌ఐవీబీ ప్రపంచ పురుషుల అండర్-23 ఛాంపియన్‌షిప్‌కు అర్హత సాధించింది.

ఫైనల్లో సౌరభ్

సిక్కి-అశ్విని కూడా

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: హైదరాబాద్ ఓపెన్ బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్ 100 బ్యాడ్మింటన్ టోర్నీలో జాతీయ ఛాంపియన్ సౌరభ్ వర్మ టైటిల్ వేటకు సిద్ధమయ్యాడు. శనివారం సెమీస్‌లో సౌరభ్ 23-21, 21-16తో ఇస్కందర్ జుల్కర్నైన్ (మలేషియా)పై గెలిచాడు. మహిళల డబుల్స్‌లో సిక్కిరెడ్డి-అశ్విని పొన్నప్ప జోడీ ఫైనల్లో అడుగుపెట్టింది. టాప్ సీడ్ సిక్కి జోడీ 21-12, 21-12 తేడాతో ఫాన్ కా యాన్- వూయి టింగ్ (హాంకాంగ్)పై నెగ్గింది. ప్రత్యర్థిని వరుస గేమ్‌ల్లో మట్టికరిపించిన ఈ జంటకు సీజన్‌లో ఇది తొలి ఫైనల్. ఆదివారం ఫైనల్లో సిక్కి-అశ్విని.. బేక్-జంగ్ క్యుంగ్ (కొరియా)తో, సౌరభ్.. లోహ్ కీన్ (సింగపూర్)తో తలపడనున్నారు.

పసిడి వేటలో వినేశ్

దిల్లీ: మెడ్వెడ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ (53 కేజీలు) ఫైనల్ చేరింది. బెలారస్‌లో జరుగుతున్న ఈ టోర్నీ సెమీస్‌లో వినేశ్ 11-0తో స్థానిక క్రీడాకారిణి యప్రెమెంకాను చిత్తుచేసింది. తుదిపోరులో వినేశ్.. రష్యా రెజ్లర్ మలిషెవాతో తలపడనుంది. 57 కేజీల విభాగంలో సరిత 10-0తో మస్కులోవా (ఉక్రెయిన్)ను ఓడించి ఫైనల్ చేరింది. సాక్షి మలిక్ (62 కేజీలు) సెమీస్‌లో పరాజయంపాలైంది. పురుషుల 57 కిలోల విభాగంలో రవి కుమార్ కాంస్యం సొంతం చేసుకున్నాడు. కాంస్య పోరులో అతడు 9-4తో అరబిద్జ్ (రష్యా)ను చిత్తు చేశాడు.

బజ్‌రంగ్‌కు స్వర్ణం: బిలిసి గ్రాండ్‌ప్రి పురుషుల 65 కేజీల విభాగంలో బజ్‌రంగ్ పునియా స్వర్ణం సొంతం చేసుకున్నాడు. ఫైనల్లో అతను 2-0తో పీమన్ బిబ్యాని (ఇరాన్)పై విజయం సాధించాడు. గతేడాది కూడా విజేతగా నిలిచిన బజ్‌రంగ్ తన టైటిల్ నిలబెట్టుకున్నాడు.

తుది పోరుకు యువ భారత్

అండర్-19 ముక్కోణపు టోర్నీ

బెకెన్‌హమ్ (యూకే): అండర్-19 ముక్కోణపు యూత్ వన్డే టోర్నీలో భారత కుర్రాళ్ల జట్టు ఫైనల్లో అడుగుపెట్టింది. చివరి లీగ్ మ్యాచ్‌లో ఇంగ్లాండ్ చేతిలో 8 వికెట్ల తేడాతో ఓడినప్పటికీ భారత్ ముందంజ వేసింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన భారత జట్టు 50 ఓవర్లలో 8 వికెట్లకు 278 పరుగులు చేసింది. ఓపెనర్ దివ్యాంశ్ సక్సేనా (102) శతకంతో ఆకట్టుకున్నాడు. కెప్టెన్ ప్రియమ్ గార్గ్ (51), తిలక్ వర్మ (52) రాణించారు. అనంతరం వర్షం అంతరాయం కలిగించడంతో ఇంగ్లాండ్ లక్ష్యాన్ని 42 ఓవర్లలో 214 పరుగులకు కుదించారు. టామ్ క్లార్క్ (66), మౌస్లీ (74 నాటౌట్) చెలరేగడంతో 41.3 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి ఆ జట్టు విజయాన్ని అందుకుంది. ఆదివారం ఫైనల్లో భారత్.. బంగ్లాదేశ్‌తో తలపడనుంది.

సింధు, సైనా ఢీ!

ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్

దిల్లీ: ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో భారత స్టార్ షట్లర్లు పి.వి. సింధు, సైనా నెహ్వాల్ సెమీఫైనల్లో ఎదురుపడే అవకాశముంది. ఇంతకుముందు ప్రకటించిన డ్రాలో వీరిద్దరు వేర్వేరు పార్శ్వాల్లో ఉన్నారు. మహిళల సింగిల్స్‌లో డోపింగ్ నిషేధం ఎదుర్కొంటున్న క్రీడాకారిణి పేరును పొరపాటున చేర్చడాన్ని గుర్తించిన ప్రపంచ బ్యాడ్మింటన్ సమాఖ్య (బీడబ్ల్యూఎఫ్) తిరిగి డ్రా తీసింది. మిగిలిన విభాగాల డ్రాలను యథాతథంగా ఉంచుతున్నట్లు వెల్లడించింది. సవరించిన డ్రా ప్రకారం సింధు, సైనా ఒకే పార్శ్వంలో ఉన్నారు. సెమీఫైనల్లో వారు ఎదురుకావొచ్చు. వచ్చే వారం బసెల్ (స్విట్జర్లాండ్)లో ప్రపంచ ఛాంపియన్‌షిప్ ఆరంభం కానుంది. ఐదో సీడ్ సింధు, ఎనిమిదో సీడ్ సైనాలకు తొలి రౌండ్లో బై లభించాయి.

అజయ్ అదరహో...

గుజరాత్‌పై తలైవాస్ విజయం ● ప్రో కబడ్డీ లీగ్

అహ్మదాబాద్: రైడింగ్‌లో కెప్టెన్ అజయ్ ఠాకూర్ (9) మెరుపులు... ట్యాక్లింగ్‌లో మోహిత్ చిల్లర్ (5), మంజీత్ చిల్లర్ (4) ఉడుం పట్టు.. వెరసి ప్రో కబడ్డీ ఏడో సీజన్‌లో తమిళ్ తలైవాస్ ఖాతాలో మరో విజయం చేరింది. శనివారం తలైవాస్ 34-28 తేడాతో గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్‌ను ఓడించింది. 12 నిమిషాలు ముగిసే సరికి 6-6తో స్కోరు సమమైంది. అయితే అజయ్ వరుసగా పాయింట్లు తెచ్చి ప్రత్యర్థిని ఆలౌట్ చేయడంతో తొలి ఆర్ధభాగాన్ని తలైవాస్ 15-10తో ముగించింది. విరామం తర్వాత కూడా ఆ జట్టు జోరు కొనసాగింది. ఓ దశలో 21-14తో నిలిచిన ఆ జట్టు తిరుగులేని ఆధిక్యం సాధించింది. అప్పుడే రోహిత్ గులియా (9) మాయ మొదలైంది. అతనితో పాటు సునీల్ విజృంభించడంతో మరో నాలుగు నిమిషాల్లో ఆట ముగుస్తుందనగా ప్రత్యర్థిని ఆలౌట్ చేసిన గుజరాత్ 26-25తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఆ వెంటనే అజయ్ సూపర్ రైడ్ చేసి గుజరాత్ ఆలౌట్‌కు కారణమయ్యాడు. ఆఖరి వరకు ఆధిపత్యం చెలాయించిన తమిళ్ తలైవాస్ సులభంగా విజయాన్ని అందుకుంది. మరో మ్యాచ్‌లో దబంగ్ దిల్లీ 32-30తో పుణెరి పల్టాన్‌పై విజయం సాధించింది. దిల్లీ జట్టులో రైడర్లు నవీన్ కుమార్ (11), చంద్రన్ రంజిత్ (8) సత్తాచాటారు. పుణెరి తరపున రైడింగ్‌లో నితిన్ తోమర్ (8), మంజీత్ (6).. డిఫెన్స్‌లో గిరీశ్ (4) పోరాడినా ఫలితం లేకపోయింది.

ప్రో కబడ్డీలో ఈనాడు

బెంగళూరు బుల్స్ × హరియాణా స్టీలర్స్ (ర.7:30 నుంచి)
గుజరాత్ ఫార్చ్యూన్‌జెయింట్స్ × తెలుగు టైటాన్స్ (ర.8:30 నుంచి)

చాలా ఏళ్లుగా వెస్టిండీస్‌తో సిరీస్ అంటేనే అనాసక్తి. పైగా టీ20 సిరీస్ ఏకపక్షం అయింది. అది చాలదన్నట్లు వన్డే సిరీస్‌లో తొలి మ్యాచ్ వర్షం కారణంగా రద్దయింది. దీంతో ఈ సిరీస్ పట్ల అభిమానుల్లో ఆసక్తి తగ్గిపోతోంది. ఇలాంటి తరుణంలో రెండో వన్డేకు రంగం సిద్ధమైంది. ఈ మ్యాచ్‌కూ కాస్త వరుణుడి బెడద తప్పదంటున్నారు. పూర్తి మ్యాచ్ సాధ్యమై.. పోరు రసవత్తరంగా సాగితే తప్ప అభిమానుల దృష్టి మళ్లీ సిరీస్ వైపు మళ్లడం కష్టం. రద్దయిన తొలి వన్డేకు తుది జట్టులో చోటు దక్కించుకున్న శ్రేయస్ అయ్యర్.. రెండో వన్డేలో బ్యాటింగ్ చేసే అవకాశం వస్తే ఎలా ఆడతాడన్నది ఆసక్తికరం.

అయ్యర్ మీదే కళ్లన్నీ!

(రాత్రి 7 నుంచి సోనీ టెన్-1లో)

వెస్టిండీస్‌తో రెండో వన్డే నేడు ● వరుణుడు కరుణిస్తేనే మ్యాచ్

పోర్ట్ ఆఫ్ స్పెయిన్

భారత్, వెస్టిండీస్ రెండో వన్డేకు రంగం సిద్ధమైంది. ప్రావిడెన్స్‌లో తొలి వన్డే వర్షం కారణంగా రద్దవడంతో తీవ్ర అసహనానికి గురైన కోహ్లీసేన.. పోర్ట్ ఆఫ్ స్పెయిన్‌లో అయినా పూర్తి మ్యాచ్ జరగాలని ఆశిస్తోంది. ఈ మ్యాచ్‌కు వర్షం అంతరాయం కలిగించొచ్చని సమాచారం. తొలి మ్యాచ్‌లో మ్యాచ్ జరిగినంత సేపు భారతే్ పైచేయి. టాస్ ఓడి బ్యాటింగ్ చేసిన విండీస్.. 13 ఓవర్లలో వికెట్ నష్టానికి 54 పరుగులే చేసింది. విధ్వంసక వీరుడు గేల్‌ను భారత బౌలర్లు ఉక్కిరిబిక్కిరి చేశారు. అతను 31 బంతుల్లో 4 పరుగులే చేసి వెనుదిరిగాడు. షై హోప్ మాత్రం దూకుడుగా ఆడి స్కోరు పెంచాడు. వన్డే సిరీస్ తర్వాత భారత్‌తో టెస్టుల్లోనూ ఆడి అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలని ఆశించాడు గేల్. కానీ సెలక్టర్లు అతడికి టెస్టు జట్టులో అవకాశమివ్వలేదు. దీంతో ఇంకో రెండు వన్డేలతో క్రిస్ కెరీర్ ముగియనుందన్నమాట. కాబట్టి ఈ మ్యాచ్‌లకు ప్రాధాన్యం పెరిగింది. వీటిలో మెరుపులు మెరిపించి కెరీర్‌కు వీడ్కోలు పలకాలని గేల్ ఆశిస్తాడనడంలో సందేహం లేదు. మరి భారత బౌలర్లు అతడికి ఏమేరకు అవకాశమిస్తారో చూడాలి.

నాలుగులో నిలబడతాడా?: భారత బ్యాటింగ్ ఆర్డర్లో నాలుగో స్థానంపై చర్చ ఈనాటిది కాదు. దీర్ఘ కాలంగా ఈ స్థానం విషయంలో సందిగ్ధత కొనసాగుతోంది. ప్రపంచకప్‌లో భారత్ దెబ్బ తినడానికి పరోక్షంగా ఇది కూడా ఒక కారణమైంది. ఆ స్థానంలో ఎవ్వరూ కుదురుకోవట్లేదు. ఇప్పుడు యువ ఆటగాడు శ్రేయస్ అయ్యర్‌ను ఆ స్థానంలో పరీక్షించబోతున్నారు. విండీస్‌తో టీ20 సిరీస్‌కు ఎంపికైనా, తుది జట్టులో చోటు దక్కించుకోలేక పోయిన అయ్యర్.. తొలి వన్డేలో అవకాశం దక్కించుకున్నాడు. కానీ ఆ మ్యాచ్ రద్దవడంతో అతడికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. రెండో వన్డేలో చాన్స్ వస్తే అయ్యర్ ఏమేరకు దాన్ని సద్వినియోగం చేసుకుంటాడో చూడాలి. జట్టులోకి వస్తూ పోతూ ఉంటే ఆటగాడి ఆత్మ విశ్వాసం దెబ్బ తింటుందన్న అయ్యర్ వ్యాఖ్యల నేపథ్యంలో అతడికి కావాల్సినన్ని అవకాశాలివ్వాలని జట్టు యాజమాన్యం భావిస్తోంది. ముందుగా ప్రస్తుత సిరీస్‌లో అయ్యర్ ఓ మంచి ఇన్నింగ్స్‌తో తన ప్రతిభను చాటితే మరిన్ని అవకాశాలు రావడం ఖాయం. మిగతా తుది జట్టులో చాన్నాళ్లుగా చూస్తున్న ఆటగాళ్లే ఉన్నారు. టీ20ల్లో సత్తా చాటిని సైనికి.. తొలి వన్డేలో అవకాశం దక్కలేదు. భువనేశ్వర్, షమి, ఖలీల్‌లనే ఎంపిక చేశారు. స్పిన్ బాధ్యతల్ని జడేజా, కుల్‌దీప్‌లకు అప్పగించారు. టీ20 సిరీస్‌కు దూరం పెట్టిన కేదార్ జాదవ్‌కు చోటు కల్పించారు. ప్రపంచకప్ సందర్భంగా తీవ్ర విమర్శలెదుర్కొన్న జాదవ్.. ఈ సిరీస్‌లో సత్తా చాటకుంటే కెరీర్ ప్రమాదంలో పడటం ఖాయం. తొలి వన్డే రద్దయింది కాబట్టి రెండో మ్యాచ్‌కు తుది జట్టులో మార్పులు జరగడం సందేహమే.

కోహ్లి ఇంకో 19 చేస్తే..

టీమ్‌ఇండియా కెప్టెన్ విరాట్ కోహ్లి ఇంకో 19 పరుగులు చేస్తే 26 ఏళ్ల రికార్డు బద్దలవుతుంది. వన్డేల్లో వెస్టిండీస్‌పై అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా రికార్డులకెక్కుతాడు. పాకిస్థాన్ మాజీ బ్యాట్స్‌మన్ జావెద్ మియాందాద్ వెస్టిండీస్‌పై 64 ఇన్నింగ్స్‌ల్లో 1930 పరుగులతో రికార్డు నెలకొల్పగా.. కోహ్లి 34 ఇన్నింగ్స్‌ల్లోనే 1912 పరుగులు సాధించాడు. మియాందాద్ చివరగా 1993లో విండీస్‌పై తన చివరి వన్డే ఆడాడు.

పృథ్వీకి అప్పుడు దగ్గే లేదట!

ముంబయి: టీమ్‌ఇండియా యువ ఓపెనర్ పృథ్వీ షా డోపీగా దొరకడం, అతడిపై ఎనిమిది నెలల నిషేధం పడటం భారత క్రికెట్ అభిమానులకు పెద్ద షాకే అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో ముస్తాక్ అలీ ట్రోఫీ సందర్భంగా దగ్గుతో బాధ పడుతున్న తాను మందు వాడానని.. అందులో ఉన్న నిషేధిత ఉత్ప్రేరకం వల్లే తాను డోప్ పరీక్షల్లో దొరికానని వివరణ ఇచ్చాడు పృథ్వీ. కానీ ముస్తాక్ అలీ ట్రోఫీ సందర్భంగా ముంబయి జట్టుకు కోచ్‌గా ఉన్న వినాయక్ సామంత్, ఫిజియో దీప్ తోమర్ మాత్రం.. ఆ సమయంలో పృథ్వీకి జలుబు, దగ్గు లాంటి వేమీ లేవని స్పష్టం చేస్తుండటం గమనార్హం. "పృథ్వీకి అప్పుడు కొద్దిగా జ్వరం మాత్రమే ఉంది. జలుబు, దగ్గు సంకేతాలేమీ లేవు. అలాంటి ఇబ్బంది ఉన్నట్లు అతను మాకు చెప్పలేదు. మందులూ అడగలేదు. మేం పూర్తి సమయం అందుబాటులో ఉన్నాం" అని సామంత్, తోమర్ పేర్కొన్నారు.

మెరిసిన నదీమ్

విండీస్-ఎతో మూడో టెస్టు డ్రా

తరౌబా: భారత్-ఎ స్పిన్నర్ షాబాజ్ నదీమ్ (5/103) మరోసారి ఐదు వికెట్లతో మెరిశాడు. వెస్టిండీస్-ఎతో మూడో అనధికార టెస్టులో నదీమ్ తన ఫామ్‌ను కొనసాగించినా.. పట్టుదలగా ఆడిన ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. 373 పరుగుల లక్ష్య ఛేదనలో విండీస్ చివరి రోజు ఆట ముగిసే సరికి 314/6తో నిలిచింది. 252 బంతుల్లో 92 పరుగులు చేసిన ఆ జట్టు ఓపెనర్ జెరేమి.. భారత బౌలర్లను విసిగించాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 201 పరుగులు చేయగా.. విండీస్ 194 పరుగులకే ఆలౌటైంది. రెండో ఇన్నింగ్స్‌లోభారత్ 365/4 వద్ద డిక్లేర్ చేసిన సంగతి తెలిసిందే. భారత్ ఇదివరకే 2-0తో సిరీస్‌ను కైవసం చేసుకుంది.

గేల్ ఆశలకు బ్రేక్

● భారత్‌తో టెస్టులకు విండీస్ జట్టులో దక్కని చోటు

● 'మహాబలుడు' కార్న్‌వాల్‌కు తొలి అవకాశం

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: క్రిస్ గేల్ కోరిక ఫలించలేదు. చివరగా ఓ టెస్టు మ్యాచ్ ఆడి అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలని ఉందంటూ గేల్ ఇటీవల తన మనసులో మాట బయటపెట్టినా.. వెస్టిండీస్ సెలక్టర్లు మాత్రం అతడికి ఆ అవకాశం ఇవ్వలేదు. భారత్‌తో రెండు టెస్టుల సిరీస్ కోసం ఎంపిక చేసిన విండీస్ జట్టులో గేల్‌కు చోటు దక్కలేదు. మొదట ప్రపంచకప్‌తోనే అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్‌బై చెప్పాలని భావించిన గేల్.. తర్వాత మనసు మార్చుకున్నాడు. భారత్‌తో సిరీస్ అయ్యాక రిటైరవ్వాలనుకున్నాడు. ప్రస్తుత వన్డే సిరీస్‌లో గేల్ ఆడుతున్నాడు. దీని తర్వాత రెండు టెస్టుల సిరీస్‌లో ఒక్క మ్యాచ్ అయినా ఆడి నిష్క్రమించాలనుకున్నాడు. కానీ సెలక్టర్లు అతడికి మొండిచేయి చూపారు. భారత్‌తో మూడో వన్డేతోనే గేల్ అంతర్జాతీయ కెరీర్‌ను ముగించే అవకాశముంది. 40వ పుట్టిన రోజుకు 6 వారాల దూరంలో ఉన్న క్రిస్.. ఇంకా కెరీర్‌ను పొడిగించుకునే అవకాశాలు దాదాపు లేనట్లే. మరోవైపు విండీస్ టెస్టు జట్టులోకి ఓ ఆకర్షణీయ ఆటగాడు వచ్చాడు. క్రికెట్ చరిత్రలోనే అత్యంత భారీకాయుల్లో ఒకడైన రకీమ్ కార్న్‌వాల్‌కు తొలిసారి టెస్టు జట్టులో చోటిచ్చారు సెలక్టర్లు. విధ్వంసక బ్యాట్స్‌మన్ అయిన కార్న్‌వాల్.. స్పిన్ కూడా వేస్తాడు. హోల్డర్ నాయకత్వంలోని జట్టులో ఇంతకుమించి విశేషాలేమీ లేవు. కొన్ని నెలల కిందట ఇంగ్లాండ్‌కు షాకిచ్చిన జట్టులోని ఆటగాళ్లందరూ దాదాపుగా భారత్‌తో సిరీస్ ఆడనున్నారు.

వెస్టిండీస్ జట్టు: జేసన్ హోల్డర్ (కెప్టెన్), బ్రెయిగ్ బ్రాత్‌వైట్, డారెన్ బ్రావో, షమార్ బ్రూక్స్, జాన్ క్యాంప్‌బెల్, రోస్టన్ చేజ్, రకీమ్ కార్న్‌వాల్, షేన్ డౌరిచ్ (వికెట్ కీపర్), షానన్ గాబ్రియల్, హెట్‌మయర్, షై హోప్, కీమో పాల్, కీమర్ రోచ్.

ఆరున్నర అడుగులు.. 140 కిలోలు

పోర్ట్ ఆఫ్ స్పెయిన్: అతని ఎత్తు ఆరున్నర అడుగులు.. బరువు 140 కిలోలు. చూడగానే భారీ ఆకారంతో భయపెట్టే అతను బాడీబిల్డర్ కాదు.. మల్లయోధుడు అంతకంటే కాదు. బంతి, బ్యాట్‌తో సత్తాచాటుతున్న వెస్టిండీస్ దేశవాళీ క్రికెటర్. అతని పేరు కార్న్‌వాల్. ఒకవేళ అతను జాతీయ జట్టుకు ఆడితే.. అంతర్జాతీయ క్రికెట్ ఆడిన భారీ ఆకారమున్న వ్యక్తిగా చరిత్రలోకెక్కుతాడు. నైపుణ్యాలు మెరుగ్గానే ఉన్న అతను తన ఆకారం కారణంగా అంతర్జాతీయ క్రికెట్లో రాణించలేడనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఐతే అతనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి.. బరువు తగ్గేలా చూస్తామని గతేడాది సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా ఉన్న కౌర్ట్నీ బ్రౌన్ అప్పుడు చెప్పాడు. "కార్న్‌వాల్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. అతణ్ని ఫిట్‌గా మార్చేందుకు ప్రత్యేక సిబ్బందిని నియమించనున్నాం" అని బ్రౌన్ తెలిపాడు. అతని ఆకారంపై టీమ్ మేనేజ్‌మెంట్ ఎలాంటి ఆందోళన చెందట్లేదు. 55 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లాడిన అతను 24.43 సగటుతో 2224 పరుగులు చేయడంతో పాటు 260 వికెట్లు తీశాడు. 2017లో భారత్‌పై ప్రాక్టీస్ మ్యాచ్‌లో పుజారా, కోహ్లి, రహానె లాంటి ఆటగాళ్లను ఔట్ చేశాడు.

ఒక్క క్లిక్‌తో వైద్యం మీ చెంతకే..

ఈనాడు - హైదరాబాద్

నేడు ప్రతి చోటా ఆన్‌లైనే హవా. ఇంటి నుంచి కదలకుండానే ప్రతి పనినీ చక్కబెట్టేసుకుంటున్నాం. ఏదైనా అనారోగ్యం వచ్చినప్పుడు మాత్రం అన్ని పనులూ మానుకొని గంటల తరబడి వేచి ఉండి చికిత్స చేయించుకుంటాం. వైద్యున్ని కలవడం దగ్గర్నుంచి.. అవసరమైన వైద్య పరీక్షలు చేయించుకోవడం, మందులు తీసుకోవడం ఇలా ఒక్కటేమిటి? అనారోగ్యం వచ్చినప్పుడు అవసరమైన అన్ని రకాల సేవలనూ ఆన్‌లైన్‌లో పొందగలిగితే.. ఇలాంటి ఆలోచనతో వచ్చిన అంకురం.. జాయ్‌లో.. ఆరోగ్యానికి సంబంధించిన అన్ని సేవలూ ఒకే యాప్ ద్వారా అందించడమే మా లక్ష్యం అంటున్నారు జాయ్‌లో డిజిటెల్త్ సహ వ్యవస్థాపకుడు, సీఈఓ ఎ.వినోద్ కుమార్ రెడ్డి.. తన సంస్థ గురించి ఇలా వివరిస్తున్నారు...

ఒక్కో జబ్బుకు ఒక్కో వైద్య నిపుణుడిని కలవడం, పరీక్షలకు సంబంధించిన నివేదికలు, మందుల చీటీలు.. ఇలా ఒక వ్యక్తికి సంబంధించిన ఆరోగ్య పత్రాలు అన్నీఇన్నీ కావు.. ఇవన్నింటినీ ఒకేచోట అందుబాటులో ఉంచి, ఎప్పుడు కావాలంటే అప్పుడు చూసుకునే వేదిక ఉంటే.. మేము ఇదే పని చేస్తున్నాం. కేవలం డాక్టర్లను సంప్రదించేందుకు సమయాన్ని తీసుకోవడం ఒక్కటే ఆన్‌లైన్ వైద్యం అనిపించుకోదని మేము గుర్తించాం. ఒక వ్యక్తికి ఆసుపత్రిలో చేరినప్పుడు అందే సేవలు తప్ప.. ఇతర అన్ని సేవలనూ మా ద్వారా పొందాలి అనేది మా లక్ష్యం. ఇదే మా వ్యాపార సూత్రం.

2016లో మా సంస్థను ప్రారంభించాం. దాదాపు రెండేళ్లపాటు వైద్య రంగాన్ని ఆన్‌లైన్‌లోకి ఎలా తీసుకురావాలనే విషయంలోనే తీవ్రంగా పరిశోధనలు చేశాం. ఈ సమయంలోనే రోగులు పడుతున్న కష్టాలనూ గుర్తించాం. వాటన్నింటికీ మేము ఇప్పుడు పరిష్కారం చూపగలుగుతున్నాం. హైదరాబాద్ కేంద్రంగా దేశవ్యాప్తంగా 600కు పైగా ప్రాంతాల్లో మా సేవలను ఇప్పుడు అందుబాటులోకి తెచ్చాం.

ఏం చేస్తామంటే..

ఒక వ్యక్తి తనకు అవసరమైన వైద్య చికిత్స కోసం మా సేవలను పొందాలనుకున్నప్పుడు... కొంత ప్రాథమిక సమాచారంతో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. డాక్టర్ల గురించి ఉచితంగానే శోధించవచ్చు. ఒకసారి వైద్యుడిని ఎంపిక చేసుకున్న తర్వాతే ఫీజును చెల్లించాల్సి ఉంటుంది. ముందుగా మా దగ్గర ఉన్న డాక్టర్లు ఆ వ్యక్తికి సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తారు. అత్యవసర చికిత్స అవసరమైతే మా దగ్గర ఉన్న వైద్య నిపుణులు సూచిస్తారు. లేదా ప్రత్యేక నిపుణులకు ఆ వివరాలు పంపించి, చికిత్స పొందేలా చూస్తారు. అవసరమైతే ఫోన్‌లో మాట్లాడతారు. దాన్నిబట్టి చికిత్సను నిర్ణయిస్తారు. దేశవ్యాప్తంగా 50,000 మందికి పైగా డాక్టర్లు మా వేదికపై నమోదై ఉన్నారు. 3,000 ఆరోగ్య పరీక్షా కేంద్రాలు, 3,000 ఆసుపత్రులతో మాకు ఒప్పందాలు ఉన్నాయి. అలోపతి వైద్యమే కాకుండా.. హోమియో, ఆయుర్వేద, నేచర్ క్యూర్‌లాంటి చికిత్సలనూ అందిస్తున్నాం.

రూ.కోటితో ప్రారంభించి...

సంస్థ ప్రారంభించాలని అనుకున్న రోజున రూ.కోటి వరకూ పెట్టుబడి సమకూర్చుకున్నాం. దానితోనే ప్రాథమికంగా జాయ్‌లోని తీసుకొచ్చాం. కానీ, దాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయడానికి పెట్టుబడులు భారీగానే అవసరం అయ్యాయి. ఇలా స్నేహితులు, బంధువులు, కొంతమంది పెట్టుబడిదారుల దగ్గర్నుంచి ఈ మూడేళ్లలో దాదాపు రూ.60 కోట్ల మేరకు సమీకరించాం. మరింత విస్తరించడం, ఇంకా అధిక సేవలను పొందుపర్చడం, మార్కెటింగ్ తదితర అవసరాల కోసం పెట్టుబడి సమీకరించేందుకూ ప్రయత్నిస్తున్నాం. దశలవారీగా రూ.150 కోట్ల పెట్టుబడులు అవసరం అవుతాయని మా అంచనా. ప్రస్తుతం మా సంస్థలో 285 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ఏడాదిలో వీరి సంఖ్య దాదాపు 500కు చేరుకుంటుంది.

రోజూ 1,000 మంది..

మా వద్ద దాదాపు 7,00,000 మంది వినియోగదారులు తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రతి రోజూ దాదాపు 1,000 మందికి పైగా మా సేవలను వినియోగించుకుంటున్నారు. మా యాప్ ద్వారా మందులు కొనుగోలు చేసే వారికి దాదాపు 25శాతం వరకూ రాయితీ లభిస్తోంది. దీంతో చాలామంది వీటి కొనుగోలుకు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఆరోగ్య పరీక్షల కేంద్రాల్లోనూ ప్రత్యేక రాయితీలను అందిస్తున్నాం. భవిష్యత్తులో రోజుకు 10,000 మందికి సేవలను అందించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాం. వైద్య సేవలను పొందిన వారు చెల్లించే ఫీజుల నుంచి కొంత మేరకు కమీషన్‌గా తీసుకుంటాం. అదే మా ఆదాయ మార్గం. పొందిన సేవలను బట్టి, 5-30 శాతం వరకూ ఇది ఉంటుంది. ఇందులో నుంచే రాయితీలనూ అందిస్తుంటాం.

బిర్లా టెంపులే కాదు ఇక బిర్లా గోశాలలూ

మధ్యప్రదేశ్‌లో 100 హైటెక్ గోశాలల నిర్మాణం

సాధారణంగా మనకు బిర్లా అనగానే గుర్తుకొచ్చేది.. హైదరాబాద్‌లోని బిర్లా టెంపులే. పర్యాటకులను ఆకర్షిస్తున్న ప్రదేశాల్లో అదీ ఒకటి. ఒక వేళ మీరు రెండేళ్ల తర్వాత మధ్యప్రదేశ్‌కు వెళితే మాత్రం.. హైటెక్ గోశాలలు చూడకుండా వెనక్కిరారు. ఎందుకంటే ఆ రాష్ట్రంలో కుమార మంగళం బిర్లా 100 గోశాలలను నిర్మించనున్నారు. అది కూడా కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) కింద వచ్చే 18 నెలల్లో వీటిని నిర్మించనున్నారు. ఆ మేరకు ముంబయిలో బిర్లాను కలిసిన అనంతరం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ శనివారం ప్రకటించారు.

ఈ ఏడాది జనవరిలో కాంగ్రెస్ ప్రభుత్వం 1000 గోశాలలను నిర్మిస్తామని.. దాదాపు రోడ్లపై తిరుగుతున్న లక్ష గోమాతలకు ఆశ్రయం కల్పిస్తామని అసెంబ్లీ ఎన్నికలకు ముందు హామీనిచ్చిన నంగతి తెలిసిందే. అందులో భాగంగానే తాజా పరిణామం చోటు చేసుకుంది. అయితే అప్పట్లో నాలుగు నెలల్లోనే వాటిని పూర్తి చేస్తామని చెప్పినా.. వాటి ప్రదేశాల ఎంపిక పూర్తి కాకపోవడంతో 'ప్రాజెక్ట్ గోశాల' వెనకబడిందని ప్రభుత్వం చెబుతోంది. రెండు నెలల కిందట ఈ రూ.300 కోట్ల ప్రాజెక్టును సమీక్షించిన ముఖ్యమంత్రి.. నిధుల కోసం ప్రవాస భారతీయులను కలవాలని సూచించారు. ఇప్పటికే వచ్చే అయిదేళ్లలో 300 స్మార్ట్ గోశాలలను నిర్మించడానికి మరో కంపెనీతోనూ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఒక ఆంగ్ల పత్రిక తన కథనంలో పేర్కొంది. కాగా, ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత కమల్‌నాథ్ పశుగ్రాస సబ్సిడీని రోజుకు రూ.10 నుంచి రూ.20కి పెంచారు.

ఈనాడు బిజినెస్ వారాంతం

బొగ్గు ఇంజిన్ బుల్లెట్ ట్రైయిన్

ఒక రాష్ట్రం మళ్లీ పుట్టింది. వేడుకలు మొదలు పెట్టాల్సిందే. జమ్ము అండ్ కశ్మీర్‌లోని ప్రజలకు మిగతా భారత దేశంపై ఎంత హక్కు ఉందో.. ఇపుడు మిగతా భారత్‌లోని ప్రజలకు కశ్మీరంపై అంతే హక్కు వచ్చేసింది. అయితే ఆ పురిటి నొప్పులు మరీ 70 ఏళ్లు కొనసాగడమే విచారకరం. ఆ విషయాన్ని పక్కన పెట్టేద్దాం. ప్రస్తుతంలో ఉండి.. భవిష్యత్ గురించి మాట్లాడుకుందాం.

బుల్లెట్ ట్రైయిన్ లాంటి కశ్మీర్ ఆర్థిక వ్యవస్థను బొగ్గు ఇంజిన్‌తో నడిపిస్తుండడమే కొంత విచారకరం. ప్రస్తుతం కశ్మీర్‌లో ఆర్థిక వ్యవస్థ ఎగుడుదిగుడు గుంతల్లో పయనిస్తోంది. అది కూడా ఒంటి చక్రంపై పరుగు తీయడానికి సమాయత్తమవుతోంది. ఇక్కడి జీడీపీలో 65 శాతం వాటా ఉన్న సేవా రంగంలో 90 శాతం మంది ఉపాధి పొందుతున్నారు. వీరంతా నైపుణ్యం లేని కార్మికులే. దీంతో ఉత్పాదకత పడిపోతోంది. అంతకు మించి వీరి వేతనాలు మరీ తీసికట్టుగా ఉన్నాయి. జాతీయ సగటులో సగం అయిన రూ.6000 కూడా వారు సంపాదించుకోలేకపోతున్నారు. తక్కువ వేతనం, తక్కువ ఉత్పాదకత వల్ల తక్కువ వినియోగం, తక్కువ పెట్టుబడులు, తక్కువ వృద్ధి అనే విష వలయం తయారవుతోంది. ఆర్థిక సమగ్రత లేకుండా.. రాజకీయ సమగ్రత అనేదే ఉండదు. ఆర్థిక, సామాజిక అభివృద్ధి లేని, జీడీపీ తక్కువగా ఉండే చోట సమగ్రత అత్యంత ఆవశ్యం.

ఇక్కడ ఇవి మెరుగు

ఇక జీడీపీలో 7 శాతం కంటే తక్కువ వాటా ఉన్న పర్యాటకంపై ఇక్కడ ఆశలు రేకెత్తుతుండడం మంచి వార్తే. తక్కువ తలసరి ఆదాయం ఉన్నప్పటికీ.. పలు ఇతర విషయాల్లో జమ్ము అండ్ కశ్మీర్ మెరుగ్గానే ఉంది. ఇక్కడ పేదరిక రేటు 10 శాతం మాత్రమే ఉంది. ఇది జాతీయ సగటులో సగమే. ఇక అక్షరాస్యత జాతీయ సగటుతో సమానంగా 67 శాతంగా ఉంది. పట్టణ ఉద్యోగ రేటు మాత్రం సగటుతో పోలిస్తే రెట్టింపుగా ఉంది. మానవాభివృద్ధి సూచీ కూడా మెరుగ్గానే ఉంది. మరణాల రేటు, ఆయుర్దాయం తదితర ఇతర అంశాల్లో బాగుండడం ఇందుకు నేపథ్యం.

ఇవి ఆందోళనకరం

కశ్మీర్‌లో వృద్ధి తక్కువగా ఉండడం ఆందోళనకర అంశం. వృద్ధితో సంబంధముండే కొన్ని ఇతర అంశాలూ ఆందోళన పుట్టిస్తున్నాయి. తక్కువ వృద్ధి చెందిన రాష్ట్రాలతో పోల్చినా కూడా ఇక్కడి తయారీ జీడీపీ వృద్ధి తక్కువగా ఉంది. ఇక రాష్ట్రానికి, పర్యాటకులకు అసలు చాలని మౌలిక వసతులు ప్రధాన సమస్య. పారిశ్రామికీకరణ తక్కువగా ఉండడం వల్ల కూడా ఇక్కడి ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోంది. సాంకేతికతను అందిపుచ్చుకోవడానికి అవకాశమే లేదిక్కడ. దీంతో నైపుణ్యం, సామర్థ్యం కూడా కొరవడతున్నాయి. రుణం-జీడీపీ నిష్పత్తి అతి తక్కువగా ఉన్న రాష్ట్రాల్లో ఇదీ ఒకటిగా ఉందంటే అక్కడి పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

ఏం చేస్తే బాగుంటుందంటే..

ఇక్కడ పరిశ్రమలు పెట్టాలంటే.. ఒక కోటి జనాభా, తక్కువ వృద్ధి.. అనే అంశాలు అడ్డుపడవచ్చు. ఇక్కడి వ్యాపార వాతావరణం పరిశ్రమలకు మద్దతు పలకకపోవచ్చు. ఈ పరిస్థితులను కేంద్రం మార్చాల్సిన అవసరం ఉంది. ఒక పూర్తి స్థాయి పారిశ్రామిక వ్యవస్థను నిర్వచించి, రూపకల్పన చేయాలి. ఒక సమతుల అభివృద్ధి కోసం.. బలమైన విధానాలను వినూత్న రీతిలో ప్రవేశపెట్టాల్సి ఉంది. బలమైన ద్రవ్య నిర్వహణ, వృద్ధి ఆధారిత ప్రణాళికలతో పాటు. . మంచి పాలనా విధానాలను తీసుకురావాలి. అయితే ఇది ప్రారంభమే. చాలా సమస్యలను పరిష్కరించాల్సిన అవసరం ఉంది. వీటన్నిటినీ పాలకులు అర్థం చేసుకోవాలి. పెట్టుబడులను బలంగా ఆకర్షించాలి. అయితే అది అంత సులువు కాదు. యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడితేనే సాధ్యమవుతాయి. అధిక వృద్ధికి అవసరమైన పెట్టుబడులను రాబట్టుకోవాలి. ఉద్యోగ రేటు అధికంగా ఉండే ఒక మెరుగైన సమాజాన్ని నిర్మించుకోవాలి. స్థానికులకు ఉద్యోగ రక్షణనివ్వడం అత్యంత కీలకమైన సవాలు. 'వలస'ల వల్ల ఇక్కడివారు అభద్రతాభావానికి లోనుకాకుండా చూసుకోవాలి. అదే సమయంలో తాత్కాలికంగా వారికి అవసరమైన నైపుణ్యం ఉన్న మానవ వనరులను స్థానికులకు ఇబ్బంది లేకుండా అందించగలగాలి. ఈ తాత్కాలిక త్యాగం వల్ల మరిన్ని పెట్టుబడులు వస్తాయి. ఉజ్వల ఆర్థిక వ్యవస్థ ఏర్పడుతుంది.

పదింతల వృద్ధికి అవకాశం

కశ్మీర్ రాష్ట్రం.. బొగ్గు ఇంజిన్‌తో నడుస్తున్న ఒక బులెట్ రైలు లాంటిది. అందుకే అలుపెరుగకుండా శక్తి సామర్థ్యాలను వినియోగించి.. మెరుగైన వాతావరణాన్ని సృష్టిస్తే పదింతల వృద్ధి సాధ్యం కావొచ్చు. ఆర్థిక వ్యవస్థ అంతా భూమి, కార్మికులు, మూలధనంపైనే ఆధారపడి ఉంటుంది. కార్మికుల విషయానికొస్తే.. ఇక్కడి ప్రజలు కష్టపడడానికి, ధైర్యంగా అడుగు వేయడానికి వెనకాడరు. కొన్నేళ్లుగా ఒక వ్యవస్థ కోసం పోరాడుతున్న ఆ ప్రజలు అవకాశాలను అందిపుచ్చుకోవడం.. ఒక ఉజ్వల ఆర్థిక వ్యవస్థను ఏర్పాటు చేయడం ఎంతో దూరంలో లేదు.

ఎపుడైనా సరే.. ఆర్థిక ప్రయోజనాల(ఉపాధి, ప్రగతి, మెరుగైన జీవితం)కు రాజకీయ ప్రయోజనాల(మతం, అనిశ్చితి, అధికారం)కు మధ్య పోటీ అంటూ వస్తే ఎపుడూ ఆర్థిక ప్రయోజనాలే గెలుస్తుంటాయి. అదే ఇపుడు కశ్మీర్‌లో జరిగింది.. జరగబోతోంది.

రూ.1.57 లక్షల కోట్లు
జమ్మూ- కశ్మీర్ స్థూల దేశీయోత్పత్తి

రూ.42 కోట్లు
2000- 2018 మధ్య రాష్ట్రంలోకి వచ్చిన ఎఫ్‌డీఐలు

రూ.1250 కోట్లు
ఎగుమతులు

ప్రధాన ఎగుమతులు

యాపిల్ పండ్లు, బాల్డ్, చెర్రీలు, బాదం, వాల్‌నట్, ఉన్ని, కుంకుమ పువ్వు, కూరగాయలు, గోధుమ

- డాక్టర్ వికాస్ సింగ్
(రచయిత సీనియర్ ఆర్థిక నిపుణులు)

దివీస్ లాభం రూ.272 కోట్లు

ఈనాడు, హైదరాబాద్: దివీస్ లేబొరేటరీస్ లిమిటెడ్ ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి కన్సాలిడేటెడ్ ఖాతాల ప్రకారం రూ.1193 కోట్ల ఆదాయాన్ని, రూ.272 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో ఆదాయం రూ.1044 కోట్లు, నికరలాభం రూ.268 కోట్లు ఉన్నాయి. దీంతో పోల్చితే ఆదాయంలో పెరుగుదల కనిపిస్తోంది. కానీ నికరలాభం క్రితం ఆర్థిక సంవత్సరం స్థాయిలోనే ఉంది. ప్రస్తుత మొదటి త్రైమాసికంలో విదేశీ కరెన్సీ నష్టం రూ. 6 కోట్లు ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. క్రితం ఆర్థిక సంవత్సరం ఇదేకాలంలో విదేశీ కరెన్సీ లాభం రూ. 26 కోట్లు ఉంది. జూన్‌లో కంపెనీ చిప్పాడ యూనిట్- 2ను అమెరికా ఔషధ నియంత్రణ సంస్థ బృందం తనిఖీ చేసింది. ఈ తనిఖీ విజయవంతంగా పూర్తయినట్లు కంపెనీ పేర్కొంది.

రీజెన్సీపై ఎన్‌సీఎల్‌టీకి కార్పొరేషన్ బ్యాంకు

ఈనాడు, హైదరాబాద్: రీజెన్సీ సిరామిక్స్‌పై ఎన్‌సీఎల్‌టీ (నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్) హైదరాబాద్ బెంచ్‌లో రుణ పరిష్కార దావా దాఖలైంది. ఐబీసీ సెక్షన్-7 ప్రకారం కార్పొరేషన్ బ్యాంకు దీన్ని దాఖలు చేసింది. రీజెన్సీ సిరామిక్స్‌కు యానాంలో టైల్స్ తయారీ కర్మాగారం ఉంది. కానీ గత కొన్నేళ్లుగా యానాం యూనిట్లో ఉత్పత్తి కార్యకలాపాలు సాగటం లేదు. యానాం యూనిట్లో కార్మికులు సమ్మెకు దిగటం, ఆ ఘటన హింసాత్మకంగా మారటం తెలిసిందే. ఇది 2012 జనవరి 27న జరిగింది. ఆ తర్వాత నాలుగు రోజులకు యాజమాన్యం లాకౌట్ ప్రకటించింది. అప్పటి నుంచి యానాం యూనిట్ తిరిగి ఉత్పత్తి దశలోకి రాలేదు. దీనికి తోడు కొన్ని ఇతర కారణాల వల్ల ఈ సంస్థ అప్పు తీర్చలేని పరిస్థితిని ఎదుర్కొంటోంది. ఫలితంగా రుణదాతల్లో ఒకటైన కార్పొరేషన్ బ్యాంకు ఎన్‌సీఎల్‌టీలో ఫిర్యాదు చేసింది. దీనిపై ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది.

భారీగా హెచ్-1బీ వీసాల తిరస్కరణ!

- 2018 అక్టోబరు- డిసెంబరులో రికార్డు స్థాయికి
- ఐటీ కంపెనీలకు పెరుగుతున్న భారం

దిల్లీ/ పుణె: ఉద్యోగావకాశాల్లో అమెరికన్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్న ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయంతో.. గతంలో ఎన్నడూ లేనివిధంగా భారత ఐటీ కంపెనీల హెచ్-1బీ వీసా దరఖాస్తులు తిరస్కరణకు గురవుతున్నాయి. ఏడాదికాలంలో దిగ్గజ ఐటీ సంస్థలు- టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, విప్రోల వీసా దరఖాస్తులను దాదాపు సగం వరకు అమెరికా తిరస్కరించినట్లు తెలుస్తోంది. నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ (ఎన్ఎఫ్ఏపీ) నివేదిక ప్రకారం.. టీసీఎస్ వీసాల తిరస్కరణ రేటు 2018 అక్టోబరు- డిసెంబరులో 37 శాతానికి పెరిగింది. 2015లో ఇది 6 శాతంగా ఉంది. వీసాలు తిరస్కరించిన దరఖాస్తుల సంఖ్య రికార్డు గరిష్ఠానికి తాకాయని నాస్కామ్‌లోని అంతర్జాతీయ వ్యాపార విభాగ వైస్ ప్రెసిడెంట్ శివేంద్ర సింగ్ అన్నారు. ఈ పరిణామం కీలకమైన అమెరికా మార్కెట్లలో క్లయింట్లకు సేవలందించే విషయంలో భారత ఐటీ కంపెనీల సామర్థ్యంపై ప్రభావాన్ని చూపుతోందని అన్నారు. అదే సమయంలో వ్యయాల భారాన్నీ పెంచుతోందని తెలిపారు. అయితే ఈ విషయంపై స్పందించేందుకు టీసీఎస్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్‌కు నిరాకరించాయి.

వలసల రేటు పైకి..

వీసాల జారీ ప్రక్రియను సులభతరం చేయాలంటూ అమెరికాతో పరిశ్రమ సంఘం ఎప్పటికప్పుడు నివేదిస్తూనే వస్తోందని సింగ్ అన్నారు. వీసాల ప్రక్రియ సులభతరం ద్వారా 75 శాతానికి పైగా ఫార్చ్యూన్ 500 కంపెనీలతో కలిసి పనిచేస్తూ అమెరికా ఆర్థిక వ్యవస్థ పోటీతత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు భారత కంపెనీలూ తమ వంతు పాత్ర పోషించడాన్ని కొనసాగిస్తాయని తెలిపారు. 'తిరస్కరణ దరఖాస్తుల సంఖ్య మునుపున్నెడూ లేని విధంగా ఉండటంతో పరిశ్రమపై తీవ్ర ప్రభావం పడుతోంది. తిరస్కరణ రేటు లేదా రిక్వెస్ట్ ఫర్ ఎవిడెన్స్ (ఆర్ఈఎఫ్)లు మరింత పెరిగితే అదనపు పత్రాలను సమర్పించాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని, అది పనిభారాన్ని పెంచడమే కాకుండా కంపెనీలకు వ్యయభరితమూ అవుతుందని సింగ్ పేర్కొన్నారు. మరోవైపు హెచ్-1బీ వీసా దరఖాస్తుల అనుమతులు తగ్గడం కొంత మేర వలసల రేటు పెరిగేందుకు కారణమైందని ఈ ఏడాది ఏప్రిల్‌లో ఇన్ఫోసిస్ వెల్లడించడం గమనార్హం. అమెరికన్లకే అధిక వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగావకాశాల్లోనూ వారికే ప్రాధాన్యం ఇవ్వాలని ట్రంప్ ప్రభుత్వం అధికారిక ఆదేశాలు జారీ చేసిన సంగతి తెలిసిందే. అప్పటినుంచి నాన్ ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తుల పరిశీలనలో కాస్త కఠిన వైఖరిని అమెరికా అవలంబిస్తోంది. ఈ కారణంతోనే వీసా దరఖాస్తులు గణనీయ స్థాయిలో తిరస్కరణకు గురవుతున్నాయి.

హెచ్-1బీ వీసా తిరస్కరణలు

కంపెనీ	2014-15 (అక్టో'14- సెప్టెం'15)	2018-19 (అక్టో- డిసెం'18)
విప్రో	7%	62%
ఇన్ఫోసిస్	2%	57%
హెచ్‌సీఎల్ టెక్	2%	43%
టీసీఎస్	6%	37%

ఏప్రిల్-జూన్ త్రైమాసిక ఫలితాలు

(రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం)		మొత్తం ఆదాయం	
	2019-20	2018-19	2019-20	2018-19
గాడ్‌ఫ్రే ఫిలిప్స్ *	118.42	57.31	858.49	612.56
ఎన్‌టీపీసీ *	2,840.28	2,688.96	26,272.24	24,148.50
ఎన్ఐఐటీ *	1,090.40	17.9	210.30	214.30
రిలయన్స్ నావల్ *	(370.95)	(361.31)	26.85	37.31
ఫ్యూచర్ ఎంటర్‌ప్రైజెస్ *	(8.59)	(16.80)	1,424	1,353.31

* ఏకీకృత

కోడిగుడ్లు

10వ ఫారంగేటు అమ్మకం ధరలు (నెక్)

(100కు రూపాయలలో)

హైదరాబాద్	328	గోదావరి	334
చిల్లరగా(ఒక గుడ్డు)	3.90	వరంగల్	331
బెంగళూరు	360	విశాఖపట్నం	352
11వ తేదీకి		చెన్నై	355
విజయవాడ	339	చిత్తూరు	348
		నమక్కల్	350

ఈ వారం
కరీంనగర్
ఆదివారం ఆగస్టు 11, 2019
siri@eenadu.net

గత కొంతకాలంగా మార్కెట్లో ఎన్‌సీడీలు సందడి చేస్తున్నాయి. చాలా కంపెనీలు ఇప్పుడు వీటిని అందుబాటులోకి తెస్తున్నాయి. అంతేకాదు.. ఇవి కాస్త అధిక వడ్డీ ఆశ చూపిస్తున్నాయి. గత 3-4 ఏళ్లుగా ఫిక్స్‌డ్ డిపాజిట్ల మీద వడ్డీ రేట్లు తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో కాస్త అధిక వడ్డీనిస్తున్న ఎన్‌సీడీలను ప్రత్యామ్నాయ పెట్టుబడిగా భావిస్తున్నారు చాలామంది. మీరు కూడా ఇలాగే ఆలోచిస్తుంటే.. ఎన్‌సీడీల గురించి ఈ సంగతులు మీ కోసమే...

నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్లు (ఎన్‌సీడీ)లు.. కంపెనీలు తమకు కావాల్సిన మూలధన నిధులను సమీకరించడం కోసం విడుదల చేసే ఒక రకమైన రుణ పత్రాలుగా వీటిని చెప్పుకోవచ్చు. వీటిని మార్కెట్లో విక్రయించడం ద్వారా కంపెనీలు డబ్బును సమీకరిస్తాయి. ఎన్‌సీడీలు రుణ పత్రాలు.. ఒక స్థిరమైన వ్యవధిపాటు ఇందులో కొనసాగాల్సి ఉంటుంది. ఇచ్చిన రుణానికిగాను... కంపెనీలు ఒక స్థిరమైన వడ్డీని చెల్లిస్తాయి.



ఎన్‌సీడీలలో మదుపు చేస్తున్నారా?

కొన్ని డిబెంచర్లను నిర్ణీత కాలం తర్వాత షేర్లుగా మార్చుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇది ఆయా రుణ పత్రాలను కొనుగోలు చేసిన వ్యక్తి విచక్షణను బట్టి ఆధారపడి ఉంటుంది. అయితే, నాన్ కన్వర్టిబుల్ డిబెంచర్ల విషయంలో ఇది సాధ్యం కాదు. షేర్ల రూపంలోకి మార్చడం వీలుకాదు కాబట్టే, వాటిని ఎన్‌సీడీలుగా పిలుస్తారు.

రకాలున్నాయా?:

1) **సెక్యూర్డ్ ఎన్‌సీడీ:** పేరులో ఉన్నట్లే వీటికి కొంచెం రక్షణ ఉంటుంది. కంపెనీ దివాలా తీసిన పక్షంలో దాని ఆస్తులు విక్రయించైనా.. మదుపరులకు సొమ్ము చెల్లిస్తారు.

2) **నాన్ సెక్యూర్డ్ ఎన్‌సీడీ:** వీటికి ఎలాంటి హామీ ఉండదు. కంపెనీ ఆస్తులపై ఎలాంటి హక్కూ ఉండదు. అందుకే, ఇవి కాస్త నష్టభయంతో కూడినవి.

ఎలా కొనాలంటే..

ఎన్‌సీడీల్లో మదుపు చేయాలంటే.. తప్పనిసరిగా డీమ్యాట్ ఖాతా ఉండాల్సిందే. బ్యాంకు, స్టాక్ బ్రోకర్, అధీకృత ఏజెంట్ల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. సాధారణంగా ఒక ఐపీఓ వచ్చినప్పుడు ఎలాంటి నిబంధనలు ఉంటాయో.. దీనికీ అలాంటిదే వర్తిస్తుంది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవడం ఇష్టం లేకపోతే.. మీ బ్రోకర్, ఏజెంటు ద్వారా ఆఫ్‌లైన్‌లోనూ మదుపు చేయవచ్చు.

ఏం చూడాలి?

- **కంపెనీ చరిత్ర:** మీరు మదుపు చేయాలనుకుంటున్న కంపెనీ గురించి పూర్తి వివరాలు తెలుసుకోండి. ఇప్పటికే కంపెనీ ఏదైనా ఎన్‌సీడీలను జారీ చేసిందా.. వాటికి వ్యవధి తీరేలోపు తిరిగి చెల్లించిందో లేదో చూడండి. జారీ చేసిన బాండ్లను ఎలాంటి ఇబ్బందీ లేకుండా తిరిగి తీర్చేసిన కంపెనీలు మంచివని అర్థం చేసుకోవచ్చు. ఇబ్బందులు పడినట్లు అనిపిస్తే.. ఆ కంపెనీ జోలికి వెళ్లకపోవడమే మంచిది.
- **క్రెడిట్ రేటింగ్:** ఎన్‌సీడీలను ఎంచుకునేందుకు ప్రధాన ఆకర్షణ అధిక వడ్డీనే. అయితే, ఇదొక్కటే దీనికి కారణం కాకూడదు. అధిక వడ్డీ ఇచ్చే కంపెనీలకు మంచి రేటింగ్ ఉందా లేదా కూడా చూసుకోవాలి. ఆ కంపెనీ ఎన్‌సీడీకి క్రిసిల్, ఇక్రా, కేర్ లాంటి ఏజెన్సీలు ఇచ్చిన రేటింగ్‌లను చూడండి. కంపెనీ పనితీరు, అప్పులను తిరిగి చెల్లించే సామర్థ్యంలాంటి వాటి ఆధారంగా కంపెనీలకు రేటింగులు ఇస్తుంటాయి. అధిక రేటింగ్ ఉన్న బాండ్లను కొంత వరకూ విశ్వసించవచ్చని అనుకోవచ్చు.
- **వ్యవధి:** కంపెనీ తనకు కావాల్సిన మొత్తం కోసం ఈ ఎన్‌సీడీలను నిర్ణీత కాలానికి జారీ చేస్తుంటాయి. ఈ వ్యవధిలో ముందే నిర్దేశించిన వడ్డీని చెల్లిస్తుంది. ఇది నెలవారీ, మూడు నెలలు, ఏడాదికోసారి ఉండవచ్చు. లేదా వ్యవధి తీరిన తర్వాత చెల్లించవచ్చు. మీ అవసరాలను బట్టి, ఎప్పుడు వడ్డీ వెనక్కి తీసుకోవాలన్నది నిర్ణయించుకోండి.
- **రాబడి:** ఒక నిర్ణీత వ్యవధిలో మనం పెట్టిన పెట్టుబడిపై ఎంత ప్రతిఫలం ముట్టిందని లెక్క తెలిపేది రాబడి శాతం. ఇది ఎంత అధికంగా ఉంటే మదుపరులకు అవి అంత ఆకర్షణీయంగా ఉంటాయి. ప్రస్తుతం ఇవి కార్పొరేట్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కన్నా అధిక వడ్డీని అందిస్తున్నాయి.
- **పెట్టుబడి వెనక్కి:** ఎన్‌సీడీలు స్టాక్ మార్కెట్‌లో నమోదవుతాయి. అవసరమైతే వాటిని అక్కడ విక్రయించే అవకాశం ఉంది. అయితే, వెంటనే పెట్టుబడిని వెనక్కి తీసుకునేందుకు అంత తేలికగా వీలు కాకపోవచ్చు. వ్యవధికి ముందే బయటకు రావడం అంత సులభమూ కాదు. కాబట్టి, ఇందులో మదుపు చేసేప్పుడు.. ఆ డబ్బుతో మీకు ఆ ఎన్‌సీడీ వ్యవధి తీరే వరకూ అవసరం లేదనుకుంటేనే పెట్టుబడి పెట్టేందుకు ప్రయత్నించండి. లేకపోతే ప్రత్యామ్నాయం చూసుకోవడమే మేలు.
- **పన్ను భారం:** ఎన్‌సీడీల ద్వారా వచ్చిన వడ్డీని వ్యక్తులు తమ ఆదాయంలో కలిపి చూపించాలి. అప్పుడు వర్తించే పన్ను రేటును బట్టి, ఆదాయపు పన్ను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, మూలం వద్ద పన్ను కోత (టీడీఎస్) ఉండదు.

ప్రస్తుతం మార్కెట్లోకి వచ్చిన కొన్ని ఎన్‌సీడీలేమిటంటే..

సంస్థ పేరు	చివరి తేదీ	ముఖ విలువ	గరిష్ఠ వడ్డీ %
కోసమట్టం ఫైనాన్స్	ఆగస్టు 14	1000	10.25 %
శ్రీరాం ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ	ఆగస్టు 16	1000	9.71%
టాటా క్యాపిటల్ ఫైనాన్షియల్ సర్వీసెస్	ఆగస్టు 23	10000	8.85 %
ఇండియా ఇన్ఫోలైన్ ఫైనాన్స్	ఆగస్టు 30	1000	10.50 %
ఇండియాబుల్స్ కన్స్యూమర్ ఫైనాన్స్	ఆగస్టు 30	1000	10.51%
జేఎం ఫైనాన్షియల్ ప్రొడక్ట్స్	సెప్టెంబరు 6	1000	10.40 %

దీర్ఘకాలిక లక్ష్యాల కోసం..

పరిమిత కాలంపాటు ప్రీమియం చెల్లింపుతో దీర్ఘకాలంపాటు బీమా రక్షణ అందించేలా ఇండియా ఫస్ట్ లైఫ్ ఇన్సూరెన్స్ స్మార్ట్ వే ప్లాన్ పేరుతో కొత్త పథకాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ పాలసీని 3 ఏళ్ల నుంచి 50 ఏళ్లలోపు వారెవరైనా ఎంచుకోవచ్చు. పాలసీని 10, 15 ఏళ్ల వ్యవధికి ఎంచుకోవచ్చు. 10 ఏళ్ల వ్యవధి పాలసీకి 5 ఏళ్లపాటు ప్రీమియం చెల్లిస్తే సరిపోతుంది. 15 ఏళ్ల పాలసీకి 5/6/7/8 ఏళ్లపాటు ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. కనీస పాలసీ మొత్తం రూ. 1,50,000. పాలసీ మొత్తంపై ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ఏడాదికి కనీస ప్రీమియం రూ.

కొత్త పథకం

18,000. ఆరునెలలకోసారి చెల్లించాలనుకుంటే.. రూ. 9,215. మూడు నెలలకోసారైతే రూ. 4,662. నెలవారైతే.. రూ. 1,566 వరకూ ప్రీమియం చెల్లించవచ్చు. దీనికి ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. ప్రీమియం వైవర్ రైడర్ల వంటి అనుబంధ పాలసీలను జోడించుకునే వీలుంది. రెండేళ్ల వరుసగా ప్రీమియం చెల్లించిన తర్వాత ఒక ఏడాది ప్రీమియం చెల్లించకున్నా.. బీమా రక్షణ కొనసాగుతుంది. పాలసీ వ్యవధి తీరిన తర్వాత పాలసీ విలువ, ఏదైనా బోనస్ లభిస్తే దాన్ని కలిపి చెల్లిస్తారు. చెల్లించిన ప్రీమియానికి పన్ను మినహాయింపు లభిస్తుంది.

ఆర్థిక ప్రయాణంలో ఫండ్ల తోడు!

ఏ మ్యూచువల్ ఫండ్ పథకంలో మదుపు చేయాలి?

పెట్టుబడి గురించి ఆలోచించడం ప్రారంభించగానే ప్రతి ఒక్కరి మనసులో ఇదే ప్రశ్న.. ఈ సందేహానికి సమాధానం తెలుసుకునే ముందు.. ఒక ప్రయాణానికి గమ్యం ముఖ్యం. ఒక ప్రయాణం ఎంత దూరం కొనసాగితే.. అది మన మనసుకు అంత ఆనందాన్నిస్తుంది. మ్యూచువల్ ఫండ్లతో ప్రయాణమూ అంతే. మనం ఏం సాధించాలనే విషయంలో స్పష్టత ఉంటే.. ఎలా ముందుకెళ్లాలన్నది తెలుసుకోవడం కష్టమేమీ కాదు.

మను మదుపు చేయాలి.. ఇలా ఆలోచిస్తూ ఉంటేనే సరిపోదు.. ఏదో ఒక విధంగా దాన్ని ప్రారంభించాలి. మ్యూచువల్ ఫండ్లలో ఉన్న అవకాశమేమిటో తెలుసా? నెలనెలా క్రమానుగత విధానంలో రూ.500లతోనూ పెట్టుబడి ప్రారంభించవచ్చు. లేదా ఒకేసారి కనీసం రూ.5,000లు పెట్టుబడి పెట్టొచ్చు. రూ.500లైనా.. రూ.5,000లైనా.. పెట్టుబడిని ఎంత స్థిరంగా కొనసాగిస్తున్నామన్నదే ఇక్కడ ప్రధానం. ఇక్కడే మ్యూచువల్ ఫండ్లతో ఏం సాధించాలనే అవగాహన వస్తుంది. ప్రతి ఆర్థిక లక్ష్యానికీ ఒక నిర్ణీత సమయం పెట్టుకోండి. అప్పుడే మీరు మీ పెట్టుబడులతో సరైన దిశలోనే ప్రయాణం చేస్తున్నారా లేదా అర్థమవుతుంది.

లక్ష్యానికి ఎంత దూరం..

మనలో చాలామంది ఆర్థిక లక్ష్యాలు దాదాపుగా ఒకేలా ఉంటాయి. వాటిని సాధించేందుకు ఉన్న సమయం, ఎంచుకుంటున్న మార్గం మాత్రం భిన్నంగా ఉంటాయి. ప్రతి లక్ష్యానికీ ఒక్కో రకం మ్యూచువల్ ఫండ్‌లో మీరు మదుపు చేయాల్సి ఉంటుంది. ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లు.. పదవీ విరమణ లాంటి దీర్ఘకాలిక లక్ష్యాలను సాధించేందుకు ఉపయోగపడతాయి. స్వల్పకాలిక లక్ష్యాల కోసం లిక్విడ్ ఫండ్లు ఎంచుకోవాలి.

మధ్యకాలిక లక్ష్యాలను సాధించడానికి.. అంటే ఇల్లు, కారు కొనడం అందుకు అవసరమైన మార్జిన్ మనీని కూడబెట్టేందుకు ఫిక్స్‌డ్ ఇన్‌కం ఫండ్లు ఎంచుకోవచ్చు. సాధారణంగా ఇవి కార్పొరేట్ బాండ్లు, ప్రభుత్వ బాండ్లు, డిబెంచర్లలో మదుపు చేస్తుంటాయి. తాజా ఎన్‌బీఎఫ్‌సీల సంక్షోభం తర్వాత డెట్ ఫండ్లలో కొంత ఇబ్బంది ఏర్పడింది. ఫిక్స్‌డ్ డిపాజిట్లతో పోలిస్తే ఇప్పటికీ ఇవి ఆసక్తిక రంగానే ఉన్నాయి.

ఒకవేళ మీకు నష్టభయం భరించే శక్తి కాస్త అధికంగా ఉంటే.. అప్పుడు అగ్రెసివ్ హైబ్రిడ్ ఫండ్లను పరిశీలించండి. ఇవి ఈక్విటీ, డెట్ రెండింటిలోనూ పరిస్థితులకు అనుగుణంగా చేస్తాయి. 5 ఏళ్లలో ఇవి దాదాపు 8.4%-9.5% వరకూ రాబడి నిచ్చే అవకాశం ఉంటుంది. ఇవి దీర్ఘకాలంలో పెట్టుబడి స్థిరంగా పెరగడానికి వీలు కల్పిస్తాయి.

ఇక దీర్ఘకాలిక పెట్టుబడులు అంటే.. పిల్లల ఉన్నత చదువులు, పదవీ విరమణ ప్రణాళికల కోసం ఈక్విటీ ఆధారిత ఫండ్లను ఎంచుకోవడమే మార్గం.

ఏ విభాగంలో ఎంత శాతం మదుపు చేయాలన్నది ఒక వ్యక్తి వయసును బట్టి కూడా ఆధారపడి ఉంటుంది. ఉదాహరణకు ఈక్విటీ, డెట్ నిష్పత్తి 50:50 ఉందనుకుందాం. 60 ఏళ్ల వయసు వచ్చేనాటికి ఇది 20:80 ఉండేలా చూసుకోవాలి. మార్కెట్లో ఉండే పెచ్చుతగ్గుల వల్ల పెట్టుబడికి నష్టం రాకుండా కాపాడుకోవచ్చు. మీ దగ్గర ఉన్న మొత్తాన్ని బట్టి, ఆయా నిష్పత్తిలో ఈక్విటీ, డెట్‌లకు మళ్లించడం ద్వారా నష్టభయాన్ని తగ్గించుకోవచ్చు.

వ్యవధి చూసుకోండి..

మనం ఎంత దూరం వెళ్లాలనుకుంటున్నామన్న దాన్నిబట్టి ఆ ప్రయాణానికి ఎంత సమయం పడుతుందన్నది తెలుసుకోవచ్చు. 5-7 ఏళ్ల వ్యవధి ఉన్నప్పుడు మ్యూచువల్ ఫండ్లలో మంచి లాభాలను ఆర్జించేందుకు అవకాశం ఉంటుంది. మనం తరచూ వార్తల్లో వింటుంటాం...ఒక్క రోజులో మదుపరుల సంపద కొన్ని కోట్ల రూపాయలు ఆవిరి అంటూ.. నిజానికి ఒక్క రోజు, ఒక్క నెల అనేది మార్కెట్లో పరిగణనలోనికి తీసుకునేందుకు ఏమాత్రం పనికిరాదు. 20 ఏళ్ల చరిత్రలో ఇచ్చిన లాభాలతో పోలిస్తే.. ఇది లెక్కలోకి తీసుకోవాల్సిన అంశంగానూ తోచదు. ఎందుకంటే.. మార్కెట్‌ను ఎప్పుడూ స్వల్ప కాలిక దృష్టితో చూడకూడదు. చిన్న చిన్న ఇబ్బందులు వచ్చాయని ప్రయాణాన్ని ఆపుతామా.. ఫండ్లలో పెట్టుబడికీ ఇదే సూత్రం వర్తిస్తుంది.

పెంచుతూ వెళ్లండి..

చిన్న మొత్తం అంటే.. రూ.500లతోనూ నెలనెలా మ్యూచువల్ ఫండ్లలో మదుపు చేయొచ్చు. వాహనం నడిపేటప్పుడు ప్రారంభంలో మొదటి గేరులో నడుపుతాం. అంతమాత్రాన ఎప్పుడూ అదే గేరులో వెళ్లం కదా.. పెట్టుబడుల తీరూ అంతే. మీ ఆదాయం పెరిగినప్పుడల్లా.. ఆ మేరకు సిప్ మొత్తాన్నీ పెంచాలి. మీరు నెలకు రూ.5,000 చొప్పున 20 ఏళ్లపాటు 12శాతం రాబడి వచ్చేలా మదుపు చేశారనుకుందాం. అప్పుడు మీ దగ్గర రూ. 49.9లక్షల వరకూ సమకూరుతాయి. దీనికి బదులుగా ఏడాదికోసారి 10శాతం పెట్టుబడి పెంచుకుంటూ వెళ్లారనుకోండి.. అప్పుడు 20 ఏళ్ల తర్వాత దాదాపు రూ.99.4లక్షల వరకూ జమవుతాయి. చూశారుగా ఎంత తేడానో..

నష్టభయం ఎంత?

దీర్ఘకాలంలో మీ పెట్టుబడి ప్రయాణం ఎలాంటి ఇబ్బందులకూ లోనుకాకుండా మ్యూచువల్ ఫండ్లు తోడ్పడతాయి. అయితే, నష్టం వచ్చే సందర్భాలనూ ఒకసారి గమనించాలి. ముఖ్యంగా మీ నష్టభయం భరించే సామర్థ్యాన్ని పరిగణనలోనికి తీసుకోవాలి. మీ వయసు, ఆదాయం, ఆర్థిక బాధ్యతలను చూడాలి. యువకులుగా ఉన్నప్పుడు 80-90శాతం వరకూ ఈక్విటీ ఫండ్లలో మదుపు చేయొచ్చు. 35-40 ఏళ్ల వయసుకు వచ్చే సరికి 50శాతమే ఈక్విటీల్లో మదుపు చేయాలి. ఈక్విటీ ఫండ్లలో మదుపు చేసేప్పుడూ.. 70శాతం వరకూ డైవర్సిఫైడ్ ఫండ్లలో మదుపు చేయడం ఉత్తమం. మిగతాది డెట్ ఫండ్లలో మదుపు చేయడం ద్వారా నష్టభయాన్ని పరిమితం చేసుకోవచ్చు.

- గౌతమ్ కాలియా,
హెడ్, ఇన్వెస్ట్‌మెంట్ సొల్యూషన్స్, షేర్‌ఖాన్ (పీఎన్‌బీ పారిబాస్)

ఇంటికి ఇద్దాం.. ధీమా

అనుకోని పరిస్థితుల్లో ఏదైనా జరిగితే.. ఆర్థికంగా ఆదుకునేది బీమా. వ్యక్తులకు, వాహనాలకు బీమా తీసుకుంటుంటాం. కానీ, జీవితంలో అతి పెద్ద పెట్టుబడి ఇంటి మాటేమిటి? వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాల కారణంగా ఇంటికి నష్టం వాటిల్లితే.. ఆర్థికంగా రక్షణ పొందాలంటే.. గృహ బీమా తీసుకోవాలి. కానీ, చాలామంది గృహ బీమా విషయంలో పెద్దగా ఆసక్తి చూపరు. దీనికి కారణం.. దాని చుట్టూ ఉండే అనుమానాలే. సాధారణంగా ఈ బీమా గురించి ఉండే అనుమానాలు వాస్తవాలేమిటో తెలుసుకునే ప్రయత్నం చేద్దాం!

వేటికి వర్తిస్తుంది?

పూర్తిస్థాయి గృహ బీమా పాలసీ తీసుకున్నప్పుడు.. ప్రకృతి వైపరీత్యాలు. అంటే వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలతోపాటు, మానవుల వల్ల కలిగే నష్టాలు. అంటే.. అల్లర్లు, దొంగతనం, దోపిడీ లాంటివి జరిగినప్పుడు కూడా గృహ బీమా పరిహారం ఇస్తుంది. బీమా పాలసీ తీసుకున్నప్పుడు వేటికి పరిహారం ఇస్తారనే విషయంలో ఒకటికి రెండు సార్లు పరిశీలించి చూసుకోవాలి. బీమా సంస్థలను బట్టి, పరిహారం ఈ జాబితా మారుతూ ఉంటుంది. కొంత అదనపు ప్రీమియం చెల్లించడం ద్వారా ప్రధాన పాలసీకి అనుబంధంగా మరికొన్ని సందర్భాలనూ అదనంగా జోడించవచ్చు.

మినహాయింపులు ఉంటాయా?

సాధారణంగా బీమా పాలసీ తీసుకునేప్పుడే వేటికి అది వర్తిస్తుంది, వేటికి వర్తించదు అనే విషయంలో స్పష్టత ఉండాలి. బీమా పాలసీలో పేర్కొనని నష్టాలకు క్లెయిం లభించదు. కొన్నిసార్లు ఉద్దేశపూర్వకంగా ఇంటికి ఏదైనా నష్టం కలుగజేసుకున్నా, నిర్లక్ష్యం వల్ల నష్టం వచ్చినా, నగదు పోయిన సందర్భాల్లో పరిహారం రాకపోవచ్చు. అయితే, ఇక్కడ ప్రాథమిక పాలసీలో వీటికి రక్షణ లేకపోయినా అనుబంధ పాలసీలతో ఉపయోగం ఉంటుంది. ఉదాహరణకు ఉగ్రవాదుల దాడులు జరిగినప్పుడు ప్రాథమిక పాలసీలో ఎలాంటి రక్షణ లభించదు. కానీ, కాస్త అదనపు ప్రీమియం చెల్లించడం ద్వారా దీనికి రక్షణ లభిస్తుంది.

నిర్మాణానికేనా?

ఇంటి నిర్మాణానికి నష్టం కలిగినప్పుడే పాలసీ వర్తిస్తుందనేది మరో ఆపోహ. నిజానికి గృహ బీమా ద్వారా నిర్మాణానికే కాదు. . ఇంట్లోని వస్తువులకూ బీమా వర్తించేలా తీసుకోవచ్చు. నిర్మాణానికి వర్తించాలా? ఇంట్లోని వస్తువులకూ ఉండాలా అన్నది మనమే నిర్ణయించుకోవాలి. మీ అవసరాలను బట్టి పాలసీలో వేటికి రక్షణ కావాలన్నది నిర్ణయించుకోవచ్చు. ఇక్కడ గుర్తు పెట్టుకోవాల్సిందేమిటంటే.. మీరు అధిక రక్షణ కోరుకుంటే.. దానికి తగ్గట్టు పాలసీ ప్రీమియం రేట్లు కూడా మారుతుంటాయి. కళాఖండాలు, నగలు ఇలా ఏదైనా సరే.. మీకు ఆర్థికంగా నష్టం వాటిల్లవచ్చు అనుకున్న ప్రతిదానినీ బీమా పరిధిలోకి తీసుకురావచ్చు.

క్లెయిం ఎలా?

పాలసీని క్లెయిం చేసుకోవాల్సి వచ్చిన సందర్భంలో బీమా కంపెనీ నియమ నిబంధనలను పాటించాల్సి వస్తుంది. జరిగిన నష్టాన్ని నిర్ణీత సమయంలోపు బీమా కంపెనీ దృష్టికి తీసుకెళ్లాలి. బీమా సంస్థ కోరిన విధంగా పత్రాలను జత చేయాలి. క్లెయిం చేసుకోవాల్సి వస్తే.. వెంటనే బీమా సంస్థకు ఫోన్ లేదా ఈమెయిల్ ద్వారా సమాచారం ఇవ్వాలి. అవసరమైన సహాయాన్ని పొందేందుకు కూడా ఇది ఉపకరిస్తుంది. నష్టం తాలూకు ఆధారాలు.. రశీదులు, పోలీసు ఫిర్యాదు ఇలా ముఖ్యమైన పత్రాలను సమర్పించాల్సి ఉంటుంది. జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు బీమా సంస్థ సర్వేయర్‌ను నియమిస్తుంది. ఆ నివేదిక ఆధారంగా క్లెయింలను చెల్లిస్తుంది.

అద్దెకు ఉంటే..

సొంత ఇల్లు ఉన్నవారికే కాదు.. అద్దెకు ఉన్న వారు కూడా గృహ బీమా పాలసీని తీసుకోవచ్చు. అయితే, అది ఇంటికి కాకుండా.. ఇంట్లో ఉన్న వస్తువులకు వర్తించేలా తీసుకోవాలి. విలువైన గృహోపకరణాలు, ఫర్నిచరు, దుస్తులు, నగలు తదితర వాటికి బీమా తీసుకోవచ్చు. అద్దెకు ఉన్న వారు.. ప్రమాదవశాత్తూ నష్టం, అగ్ని ప్రమాదం, దొంగతనం, విద్యుతాఘాతం, ప్రకృతి వైపరీత్యాలాంటి సందర్భాల్లో పరిహారం లభించేలా పాలసీని ఎంపిక చేసుకోవచ్చు. ఇంటి యజమాని కూడా అద్దెకు ఉన్న వారి వల్ల ఇంటి నిర్మాణానికి నష్టం జరిగితే పరిహారం లభించేలా పాలసీని తీసుకోవచ్చు.

ఎంత మొత్తం తీసుకోవాలి?

గృహ బీమా పాలసీ తీసుకున్నప్పుడు.. అది ఇంటి నిర్మాణం విలువను మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటుంది. భూమి విలువను కలపరు. మీరు ఏ వస్తువులు బీమాలో ఉండాలో నిర్ణయించుకోవచ్చు. ఫర్నిచర్, ఎలక్ట్రానిక్స్, బ్యాగేజీ లాంటివన్నమాట. వ్యక్తిగత ప్రమాద బీమా, థర్డ్‌పార్టీ (మీ ఇంట్లో ఇతరుల వస్తువులకు నష్టం వాటిల్లినప్పుడు వర్తించేలా) కోసం కూడా పాలసీలో రక్షణ కల్పించవచ్చు. ముందే అనుకున్నట్లు పాలసీ విలువ పెరుగుతుంటే ప్రీమియమూ అధికమవుతుంది. ఉదాహరణకు ఇంటి నిర్మాణానికి రూ.50లక్షలు, వస్తువులకు రూ.5లక్షల బీమా పాలసీ తీసుకుంటే.. ఒక ప్రభుత్వ రంగ బీమా సంస్థ రూ.5,200 (జీఎస్‌టీ అదనం)వరకూ ప్రీమియాన్ని వసూలు చేస్తోంది.

ప్రకృతి వైపరీత్యాలు... ముఖ్యంగా వరదలు అధికంగా వచ్చే అవకాశం ఉన్న ప్రాంతాల్లో నివసించేవారు.. తప్పనిసరిగా గృహ బీమా తీసుకోవడం మేలు. అనుకోని నష్టం జరిగినా.. ఆర్థికంగా కష్టం కాకుండా.. కాపాడుకోవచ్చు.

- అధిల్ శెట్టి, సీఈఓ, బ్యాంక్‌బజార్.కామ్

కొత్తబాటలో కశ్మీరం

జమ్మూ-కశ్మీర్ విషయంలో రాజ్యాంగపరమైన కీలక ఘట్టం ముగిసింది. అక్టోబర్ 31 నుంచి కేంద్రపాలిత ప్రాంతంగా జమ్మూ-కశ్మీర్ ప్రయాణం మొదలవుతుంది. లద్దాఖ్‌దీ ఇదేతరహా ప్రయాణమైనా దేశవాసుల ఆసక్తి అంతా కశ్మీర్‌పైనే ఉంది. పరిపాలనాపరంగా కశ్మీర్ ఉండే పరిస్థితి గురించి పునర్వ్యవస్థీకరణ బిల్లులోనే స్పష్టంగా ఉంది. పుదుచ్చేరిలో లాగా అక్కడ పరిపాలన వ్యవస్థ ఉంటుంది. ఎన్నికైన ప్రతినిధులతో కూడిన అసెంబ్లీ ఉన్నా దాని అధికారాలు పరిమితం. మంత్రివర్గం సలహాను కచ్చితంగా పాటించాల్సిన అవసరం లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఉండదు. తన విచక్షణను వినియోగించి మంత్రివర్గం సలహాలేకుండానే కొన్ని కీలక చర్యలు తీసుకోవచ్చు. స్వయంగా కార్యనిర్వాహక ఉత్తర్వులను జారీచేయొచ్చు. అందుకే బిల్లులో కూడా పుదుచ్చేరికి వర్తించే రాజ్యాంగ నిబంధనలు జమ్మూ-కశ్మీరుకూ వర్తిస్తాయని పేర్కొన్నారు. రాజ్యాంగంలో రాష్ట్రజాబితా కింద ఉన్న అంశాలపై జమ్మూ-కశ్మీర్ అసెంబ్లీ చట్టాలు చేస్తుంది. ఇతర రాష్ట్రాల్లాగే ఈ హక్కు ఉన్నా అవసరమనుకుంటే రాష్ట్ర జాబితాలోని ఏ అంశంపైనైనా పార్లమెంటుకు చట్టంచేసే అధికారం ఉంటుంది. శాంతిభద్రతలు, పోలీసు వ్యవస్థపై నిర్ణయాధికారం కేంద్రానికే ఉంటుందని బిల్లులో చెప్పారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయని నిర్ణయానికి వచ్చాకే ఎన్నికలు జరుగుతాయి. ఆలోగా నియోజకవర్గాల పునర్వ్యవస్థీకరణను చేపడతారు. నిషేధాలు, ఆంక్షలు తొలగి, రాజకీయ నాయకులకు స్వేచ్ఛ లభించినప్పుడు గాని అక్కడి ప్రజల ప్రతిస్పందన తెలియదు. దాన్నిబట్టే కశ్మీర్‌కు మళ్లీ రాష్ట్రహోదా ఇచ్చే అంశంపై కేంద్రం ఆలోచన చేసే అవకాశముంటుంది. ఇది ఇప్పుడే జరిగే పనికాదు.

సంక్షేమ చర్యలే కీలకం

అధికరణం 370 అమలును ఆపివేయటం, రాష్ట్ర హోదాను తీసివేయటాన్ని కశ్మీర్ ప్రజలు జీర్ణించుకోవాలంటే అక్కడ సంక్షేమ చర్యలు పెద్దఎత్తున చేపట్టాలి. గవర్నర్ పాలనలో తీసుకున్న కొన్ని నిర్ణయాలు మంచి ఫలితాలు ఇచ్చాయన్న అంచనాతో ప్రభుత్వం ఉంది. స్థానిక సంస్థలకు ఇచ్చే నిధులు సమర్థంగా పంపిణీ చేయగలిగామనీ ఆ సంస్థల ప్రతినిధుల్లో ఇంతకుముందు ఎన్నడూ లేని విశ్వాసాన్ని కల్పించామని కేంద్రం నమ్ముతోంది. ఎన్నికలకు ముందు రాజ్యాంగ సవరణ ద్వారా ఆర్థికంగా వెనకబడిన వారికి కల్పించిన 10 శాతం రిజర్వేషన్లను కశ్మీర్‌లో వర్తింపచేసే విషయాన్ని కూడా పునర్వ్యవస్థీకరణ చట్టంలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుంచి 106 కేంద్రచట్టాలు కశ్మీర్‌లో అమల్లోకి వస్తాయి. బహుశా అక్టోబర్ 31 నుంచే ఈ చట్టాల అమలు ప్రారంభమవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో అమల్లో ఉన్న 153 చట్టాలు రద్దవుతాయి. గవర్నరు పరిపాలనలో వచ్చిన 11 చట్టాలూ అటకెక్కుతాయి. జమ్మూ-కశ్మీర్‌లో అమల్లో ఉన్న మరో 166 చట్టాలు యథాతథంగా కొనసాగుతాయి. మరో ఆరు చట్టాలు కొన్ని తీసివేతలతోనూ కొన్ని చేర్పులతోనూ కొనసాగుతాయి. ఈ ఆరు చట్టాలే చాలా కీలకమైనవి. ఇందులో అయిదు చట్టాలు జమ్మూ-కశ్మీర్ శాశ్వత నివాసి కాని వారికి భూబదలాయింపులు నిషేధించేవి. మరొకటి సహకార సంఘాల సభ్యత్వానికి సంబంధించినది. శాశ్వత నివాసి కాని వ్యక్తికి సహకార సంఘాల్లో సభ్యత్వం కూడా నిషేధమే. రాజ్యాంగంలోని 35-ఎ ద్వారా శాశ్వత నివాసి ఎవరో, అతన్ని శాశ్వత నివాసిగా పరిగణించటానికి ఏ అంశాలను ప్రాతిపదికగా తీసుకోవాలో నిర్ణయించే అధికారం జమ్మూ-కశ్మీర్ ప్రభుత్వానికి లభించింది. దాని ఆధారంగానే శాశ్వత నివాసి చుట్టూ చాలా చట్టాలను తిప్పుకొంటూ వచ్చారు. అందుకే శాశ్వత నివాసి పదబంధాన్ని తొలగించటమే లక్ష్యంగా ఈ చట్టాల్లో సవరణలను పొందుపరిచారు. జమ్మూ-కశ్మీర్‌లో ఇకపై అమలయ్యే 106 చట్టాల ద్వారా కొత్త వ్యవహారమే జరుగుతుందని చెప్పలేం. ఈ చట్టాల్లోని చాలా నిబంధనలను రాష్ట్ర చట్టాల్లో పొందుపరుచుకున్నారు.

విశ్వాసం కలిగితేనే పెట్టుబడులు

అధికరణం 370 వల్ల కశ్మీరు అన్ని రకాలుగా వెనకబడిపోయిందని ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షాలు చెప్పినా కొన్ని పెద్ద రాష్ట్రాల కంటే అక్కడ పరిస్థితి మెరుగ్గానే ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. 1950 తర్వాత జరిగిన అనేక ఎన్నికల్లో అప్రజాస్వామ్య చర్యల వల్ల కశ్మీర్ పాలనా వ్యవస్థలో చాలా రుగ్మతలు ప్రవేశించాయి. నేషనల్ కాన్ఫరెన్స్ అధికారంలోకి వచ్చిన తొలి నాళ్లలోనే ఆశ్రిత పక్షపాతం తారస్థాయికి చేరింది. దీనిగురించి 1950, 1960ల్లోనే పలువురు హెచ్చరించారు. కిందిస్థాయి నుంచి యంత్రాగాన్ని ప్రక్షాళన చేయకుండా ప్రజలతో మార్పులను అంగీకరింపచేయటం అంత తేలిక కాదు. భూములపై నిషేధాల్ని తొలగించినంత మాత్రానే ప్రైవేటు పెట్టుబడులు రావు. శాంతిభద్రతలు పూర్తిగా పాదుకున్నాయన్న విశ్వాసం కలిగితేనే వస్తాయి. అవి వచ్చేలోపు ప్రభుత్వ పెట్టుబడులు మౌలిక సదుపాయాల రంగంలో పెద్దఎత్తున పెట్టాల్సి ఉంటుంది. పర్యాటక రంగానికి ఇది చాలా అవసరం.

అధికరణం 370 కారణంగా చాలా కేంద్ర చట్టాల్లో జమ్మూ-కశ్మీర్ మినహా అనే పదబంధాన్ని పెట్టారు. పునర్వ్యవస్థీకరణ చట్టంలో ఈ పదబంధాన్ని తొలగిస్తూ 106 చట్టాల జాబితాను పేర్కొన్నారు. ఇకపై ఈ చట్టాలు ఇతర రాష్ట్రాలకు మాదిరిగా కశ్మీర్‌కు కూడా వర్తిస్తాయి. కేంద్ర చట్టాల నిబంధనలతో సారూప్యత కలిగిన రాష్ట్ర చట్టాలు వైదొలగుతాయి. కశ్మీర్ మహిళలు ఇతర రాష్ట్రాల వ్యక్తులను వివాహం చేసుకుంటే ఆస్తి హక్కు కోల్పోవటం లాంటి వాటిపై విడిగా చట్టాలు చేసే అవకాశం ఉంది. స్థానిక సంస్థల్లో 50% వరకూ రిజర్వేషన్లను కల్పించే అంశంపై దృష్టిపెట్టనున్నారు.

- ఎన్.రాహుల్ కుమార్

సాధారణ స్థితి దిశగా కశ్మీర్

విజయ్‌కుమార్

దినేశ్వర్ శర్మ

కొత్త లెఫ్టినెంట్ గవర్నర్లు ఎవరు!

ప్రచారంలో విజయ్‌కుమార్, దినేశ్వర్ శర్మ పేర్లు

ఈనాడు, దిల్లీ: జమ్మూ-కశ్మీర్ విభజన పూర్తికావడంతో ఇప్పుడు అక్కడ ఏర్పడిన రెండు కేంద్రపాలిత ప్రాంతాలకు లెఫ్టినెంట్ గవర్నర్లుగా ఎవరు నియమితులవుతారన్న ప్రచారం మొదలైంది. మాజీ ఐపీఎస్ అధికారి, ప్రస్తుత జమ్మూకశ్మీర్ గవర్నర్ సలహాదారైన విజయ్‌కుమార్, కేంద్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి దినేశ్వర్ శర్మ పేర్లు వినిపిస్తున్నాయి. ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన దినేశ్వర్‌శర్మ 2017లో జమ్మూ-కశ్మీర్‌లో కేంద్రప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా నియమితులయ్యారు. అక్కడి ప్రజాప్రతినిధులు, సంస్థలు, వ్యక్తులతో చర్చలు జరిపే బాధ్యతలు నెరిపారు. ఈయన పేరు లెఫ్టినెంట్ గవర్నర్ పదవికి వినిపిస్తోంది. ఇప్పటివరకూ ఉత్తర్వులు రాకున్నా సామాజిక మాధ్యమాల్లో మాత్రం విజయ్‌కుమార్ జమ్మూ-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమితులయ్యారని ప్రచారం జరుగుతోంది. 2004లో తమిళనాడులో వీరప్పన్ ఏరివేతకు ఏర్పాటుచేసిన టాస్క్‌ఫోర్స్‌కి నేతృత్వం వహించింది ఆయనే.

- 5 జిల్లాల్లో 144 సెక్షన్ ఎత్తివేత
- అనంతనాగ్‌లో డోభాల్ పర్యటన

జమ్మూ: ఉద్రిక్తతలు తగ్గడంతో జమ్మూ-కశ్మీర్‌లోని 5 జిల్లాల్లో సెక్షన్ 144 కింద విధించిన నిషేధాజ్ఞలను ఎత్తేశారు. దోడా, కిష్త్వార్ జిల్లాల్లో కర్ఫ్యూను సడలించారు. దీంతో రాష్ట్రంలో సాధారణ పరిస్థితులు నెలకొంటున్నాయి. జమ్మూ ప్రాంతంలో విద్యాసంస్థలను తెరిచారు. దుకాణాలు తెరిచి, వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. పూంఛ్, రాజౌరి, రాంబన్ జిల్లాల్లో నిషేధాజ్ఞలు కొనసాగుతున్నాయి. బ్లాక్ అభివృద్ధి మండళ్ల ఎన్నికలకు రంగం సిద్ధం చేయాలని జమ్మూ-కశ్మీర్ ప్రధాన ఎన్నికల అధికారి శైలేంద్రకుమార్‌ను గవర్నర్ సత్యపాల్ మాలిక్ కోరారు. కల్పిత వార్తలను ప్రజలు నమ్మొద్దని జమ్మూ-కశ్మీర్ ప్రధాన కార్యదర్శి, డీజీపీలు కోరారు. గత వారం రోజుల్లో ఎలాంటి కాల్పుల ఘటన చోటుచేసుకోలేదని స్పష్టం చేశారు. పదివేల మందికిపైగా కశ్మీరీలు ఆందోళన చేపట్టారంటూ వెలువడిన కథనాలను హోం మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి కొట్టిపారేశారు. శ్రీనగర్, బారాముల్లా వంటిచోట్ల కొద్దిపాటి నిరసనలు చోటుచేసుకున్నాయన్నారు.

■ అనంతనాగ్ జిల్లాలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోభాల్ పర్యటించి పశువుల వ్యాపారులతో మాట్లాడారు. పోలీసులు, సీఆర్పీఎఫ్ సిబ్బందితో మాట్లాడి, శాంతిభద్రతల నిర్వహణలో వారి కృషిని అభినందించారు.

■ 370 అధికరణం ఉపసంహరణ, రాష్ట్ర విభజనలను సవాల్ చేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్(ఎన్‌సీ) శనివారం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మహ్మద్ అక్బర్ లోన్, మాజీ న్యాయమూర్తి జస్టిస్ హస్నైన్ మసూదీ ఈ వ్యాజ్యం దాఖలుచేశారు. జమ్మూ-కశ్మీర్‌లో నిషేధాజ్ఞలు తొలగించి, తమ పార్టీ అధ్యక్ష ఉపాధ్యక్షులు ఫరూక్, ఒమర్ అబ్దుల్లాలు సహా నాయకులను విడుదల చేయాలని ఎన్‌సీ డిమాండ్ చేసింది.

■ కశ్మీర్‌లోయలో సమాచార సంబంధాలు ఇప్పటికీ లేకపోవడంపై ఎడిటర్స్ గిల్డ్ ఆందోళన వ్యక్తంచేసింది. మీడియా స్వేచ్ఛను నియంత్రించడం సరికాదని తెలిపింది. ఈ మేరకు ప్రకటన విడుదల చేసింది.

భారత్‌పై అంతర్జాతీయంగా ఒత్తిడి తెద్దామనుకున్న పాకిస్థాన్‌కు భంగపాటు ఎదురైంది. ఐక్యరాజ్యసమితితో పాటు అమెరికానూ పాక్ ఆశ్రయించింది. సీమాంతర ఉగ్రవాదానికి, భారత్‌లోకి ఉగ్రవాదుల చొరబాటుకు కశ్మీర్ అంశాన్ని వాడుకోవద్దని పాకిస్థాన్‌కు చెప్పినట్లు అమెరికా దౌత్యవర్గాల సమాచారం. మరోవైపు భారత దేశానికి రష్యా మద్దతు పలికింది.

■ దిల్లీ-లాహోర్ మధ్య బస్సును పాకిస్థాన్ సోమవారం నుంచి రద్దు చేయనుంది. రాజస్థాన్‌లోని జోధ్‌పూర్ నుంచి పాకిస్థాన్‌లో కరాచీ వెళ్లే థార్ ఎక్స్‌ప్రెస్‌కూ శనివారం నాటి ప్రయాణమే చివరిది కానుంది.

144వ సెక్షన్ ఎత్తివేయడంతో జమ్మూ మార్కెట్‌లో సందడి

జలజీవనం.. అస్తవ్యస్తం

మహారాష్ట్రలో వరదల్లో చిక్కుకున్న వారిని తరలిస్తున్న నౌకాదళం

- పలు రాష్ట్రాల్లో వరద బీభత్సం
- రెండు రోజుల్లో 114 మంది మృతి

ముంబయి, తిరువనంతపురం, అహ్మదాబాద్: కుండపోతగా కురుస్తున్న భారీ వర్షాలకు పలు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. కేరళ, కర్ణాటకల్లోని పలు జిల్లాల్లో వరద బీభత్సానికి జనజీవనం స్తంభించింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. 80 చోట్ల కొండ చరియలు విరిగి పడ్డాయి. పాత భవనాలు కుప్పకూలాయి. గుజరాత్, మహారాష్ట్రల్లోనూ ఇదే పరిస్థితి. గత శుక్రవారం నుంచి దేశవ్యాప్తంగా వరద కారక ప్రమాదాలకు గురై మొత్తం 114 మంది మృతిచెందారు. ప్రవాహాల్లో చిక్కుకొని మరికొందరు గల్లంతయ్యారు. అక్కడక్కడ శిథిలాల కింద కొంతమంది ఉండవచ్చని భావిస్తున్నారు. మరోవైపు వరద బాధితులను, లోతట్టు ప్రాంతాల వారిని సహాయక సిబ్బంది సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఒక్క కేరళలోనే 1.65 లక్షల మందిని ఇళ్ల నుంచి ఖాళీ చేయించారు. కోచి విమానాశ్రయంలో శనివారం అంతర్జాతీయ విమాన సేవలు నిలిచిపోయాయి. విదేశాల నుంచి రావాల్సిన విమానాలు రద్దయ్యాయి. పలు జలాశయాల్లో నీటి మట్టం గరిష్ఠ స్థాయులకు చేరడంతో గేట్లు ఎత్తివేస్తున్నారు.

కేరళలో సహాయక చర్యలకు తీసుకెళుతున్న పడవ

నేడు రాహుల్ గాంధీ పర్యటన?

కాంగ్రెస్ నేత, ఎంపీ రాహుల్‌గాంధీ ఆదివారం వాయనాడ్, మలప్పురం, కోజికోడ్‌లలో పర్యటించే అవకాశముంది. వరద బాధితుల సహాయక చర్యల నిమిత్తం ప్రధాని మోదీ, కేరళ ముఖ్యమంత్రి, కలెక్టర్లతో తాను మాట్లాడినట్టు రాహుల్ వెల్లడించారు.

✦ మహారాష్ట్రలో వరద సహాయక సిబ్బంది సుమారు 4 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. వరద బాధితుల సహాయార్థం శిర్డీ సాయిబాబా సంస్థాన్ ట్రస్టు రూ.10 కోట్ల విరాళం ప్రకటించింది. ముఖ్యమంత్రి సహాయనిధికి ఈ మొత్తాన్ని అందించనుంది. కాగా- రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి గిరీశ్ మహాజన్ కొల్హాపూర్‌లో వరద బాధితులను పరిశీలించడానికి వెళ్లి... అక్కడ నవ్వులు చిందిస్తూ దిగిన సెల్ఫీలు వివాదాస్పదమయ్యాయి. వీటిని ఆయన సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో విమర్శలు వెల్లువెత్తాయి. రాష్ట్ర ప్రభుత్వం సహాయక చర్యల్లో నిమగ్నం కావాల్సింది పోయి... విపరీతమైన ప్రచార ఆర్భాటంలో మునిగిపోయిందని ఎన్సీపీ నేత ధనంజయ్ ముండే తీవ్రంగా దుయ్యబట్టారు. వరద బాధితులకు బియ్యం, గోధుమలు ఇస్తున్న సంచులపై ముఖ్యమంత్రి, ఎమ్మెల్యేల బొమ్మలేంటని విపక్ష నేతలు మండిపడ్డారు. సత్వర సాయం అందిస్తుంటే ఓర్వలేకే ఇలా తమను విమర్శిస్తున్నారని అధికార పార్టీ నేతలు తిప్పికొట్టారు.

✦ కర్ణాటకలోని పలు జిల్లాల్లో వరదలు పోటెత్తుతున్నాయి. తుంగభద్ర వెనుక జలాలు ఇళ్లలోకి వస్తుండటంతో జన జీవనానికి తీవ్ర స్థాయిలో ఇబ్బందులు తలెత్తాయి.

✦ భారీ వర్షాలకు గుజరాత్‌లోని నడియాడ్‌లో శుక్రవారం రాత్రి మూడంతస్తుల భవనం కూలిపోయింది. ఈ ఘటనలో నలుగురు వ్యక్తులు మృతి చెందగా, మరో ఐదుగురు గాయపడ్డారు.

నిలకడగా అరుణ్ జైట్లీ ఆరోగ్యం

ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడి పరామర్శ

దిల్లీ: శ్వాస సంబంధ సమస్యలతో ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీ ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఉప రాష్ట్రపతి కార్యాలయం శనివారం తెలిపింది. అంతకుముందు ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు ఎయిమ్స్‌కు వెళ్లి జైట్లీ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. జైట్లీ కుటుంబ సభ్యులను పరామర్శించారు. చికిత్సకు అరుణ్ జైట్లీ స్పందిస్తున్నట్లు వైద్యులు వెంకయ్యనాయుడికి తెలిపారని ఉప రాష్ట్రపతి సచివాలయం పేర్కొంది.

రైతులకు నగదుబదిలీ పథకాన్ని ప్రారంభించిన ఉప రాష్ట్రపతి

రాంచీ: ఝార్ఖండ్‌లో రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా నగదు బదిలీ చేసే 'ముఖ్యమంత్రి కృషి ఆశీర్వాద్ యోజన'ను ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు శనివారం ప్రారంభించారు. ఈ పథకం కింద ఐదెకరాల్లోపు సాగుభూమి ఉన్న రైతుల ఖాతాల్లో రూ. 5,000 నుంచి రూ. 25,000 వరకూ నగదు జమ చేస్తారు. ఈ పథకాన్ని ఉప రాష్ట్రపతి ప్రారంభించిన వెంటనే రైతుల ఖాతాల్లో నగదు జమ అయింది. దీంతో రైతుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసినట్లు వెంకయ్యనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి, రైతులకు ఆయన అభినందనలు తెలిపారు. రైతుల ఆదాయాన్ని 2022 నాటికి రెట్టింపు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిన బూనిందని ఈ సందర్భంగా చెప్పారు.

ఇంధన ట్యాంకర్ పేలి 62 మంది మృతి

టాంజానియాలో దుర్ఘటన

డార్ ఎస్ సలామ్: తూర్పు టాంజానియాలోని మొరొగోరో పట్టణంలో ఇంధన ట్యాంకర్ పేలి శనివారం 62 మంది దుర్మరణం పాలయ్యారు. 70 మందికి కాలిన గాయాలయ్యాయి. ట్యాంకర్ నుంచి ఇంధనాన్ని ఎత్తుకెళ్లేందుకు స్థానికులు ప్రయత్నిస్తుండగా పేలుడు సంభవించినట్లు పోలీసులు తెలిపారు. గాయపడినవారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పారు. ప్రమాదానికి గురైన ట్యాంకర్ వద్దకు వచ్చిన ప్రజలు ఇంధనాన్ని తీసుకెళ్లేందుకు ఎగబడ్డారు. అదే సమయంలో చెలరేగిన మంటల్లో చాలా మంది చిక్కుకున్నారు.

కొండచరియలు విరిగిపడి 41 మంది మరణం

మాలామియైన్(మయన్మార్): తూర్పు మయన్మార్‌లో భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనలో మృతుల సంఖ్య 41కు పెరిగినట్లు అధికారులు శనివారం ప్రకటించారు. మట్టి పెళ్లల కింద కనీసం 80 మంది దాకా చిక్కుకుని ఉండవచ్చన్న ఆందోళన వ్యక్తమౌతోంది. సహాయక బృందాలు నిరంతరాయంగా శ్రమిస్తున్నాయి.

చైనాలో తుపాను బీభత్సం: 18 మంది మృతి

బీజింగ్: చైనాలోని షెజియాంగ్‌ను శనివారం ఊపేసిన పెనుతుపాను సృష్టించిన బీభత్సంలో 18 మంది మరణించారు. 14 గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు.

రష్యా క్షిపణి పరీక్ష కేంద్రంలో విస్ఫోటం

ఐదుగురు ఉద్యోగుల దుర్మరణం

మాస్కో: ఆర్కిటిక్ ప్రాంతంలోని రష్యా క్షిపణి పరీక్ష కేంద్రంలో పెను విస్ఫోటం చోటుచేసుకుని ఆ దేశ అణుసంస్థ రోసాటమ్‌కు చెందిన ఐదుగురు ఉద్యోగులు దుర్మరణం పాలయ్యారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ విస్ఫోటం వల్ల సమీపంలోని నగరంలో రేడియోధార్మికత స్థాయి పెరిగింది. ఆర్కాంగెల్స్క్ ప్రాంతంలోని న్యోనోస్కాలో ఉన్న అత్యంత రహస్యమైన సైనిక కేంద్రంలో ఈ పేలుడు జరిగింది. జెట్ ఇంజిన్‌లోని ద్రవ ఇంధనాన్ని పరీక్షిస్తున్నప్పుడు ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఈ పేలుడులో అణు ఇంధనం పాత్ర ఉందన్న విషయం రష్యా సైన్యం తొలుత ప్రకటించలేదు. ఘటన అనంతరం రేడియో ధార్మికత స్థాయి కూడా సాధారణంగానే ఉన్నట్లు తెలిపింది. అయితే అక్కడికి 30 కిలోమీటర్ల దూరంలోని సెవెరోద్‌విన్స్క్ నగరంలో కొద్దిసేపు రేడియోధార్మికత స్థాయి పెరిగింది.

కుమార్తెపై అత్యాచారం.. తండ్రికి యావజ్జీవం

నౌగావ్(అసోం): అభంశుభం తెలియని 9 సంవత్సరాల కుమార్తెపైనే.. అత్యంత అనాగరికంగా రెండేళ్లపాటు పదేపదే అత్యాచారానికి పాల్పడిన ఓ తండ్రికి న్యాయస్థానం యావజ్జీవ కారాగార శిక్ష విధించింది. తల్లి చనిపోవడంతో ఒంటరిగా మిగిలిపోయిన తొమ్మిదేళ్ల కుమార్తెపై తండ్రి తరచూ అత్యాచారానికి పాల్పడ్డాడు. తండ్రి అకృత్యాన్ని తట్టుకోలేకపోయిన ఆ పాప 2017లో ఇంట్లో నుంచి పారిపోయి సమీప ప్రభుత్వాసుపత్రిలోని ఇద్దరు నర్సులకు తన బాధను చెప్పింది. ఆ ఇద్దరు నర్సులు పాపకు రక్షణ కల్పించి, తండ్రిపై కేసు నమోదు చేశారు.

చైనాతో ఇప్పుడే ఒప్పందం ఉండదు: ట్రంప్

వాషింగ్టన్: వాణిజ్య యుద్ధం కారణంగా చైనా ఇబ్బందులు పడుతోందని, అయినా ఆ దేశంతో ఒప్పందం కుదుర్చుకోవడానికి సిద్ధంగా లేమని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేశారు. శనివారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చైనా వస్తువులపై అమెరికా విధించిన అదనపు పన్నుల కారణంగా గత 35 ఏళ్లలో ఎన్నడూలేని విధంగా ఆ దేశం సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. వేలాది కంపెనీలు చైనాను విడిచివెళ్తున్నాయని చెప్పారు. అందువల్ల రెండు దేశాల మధ్య ఒప్పందం కుదరాలని కోరుకుంటోందని అన్నారు. గత నవంబరు నుంచే చర్చలు జరుగుతున్నాయని, అయితే ఇప్పుడిప్పుడే ఒప్పందం కుదిరే అవకాశం లేదని చెప్పారు. చైనా సాంకేతిక దిగ్గజం హువావే సంస్థతో వ్యాపారం చేయబోమని స్పష్టం చేశారు. ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ నుంచి సానుకూల సందేశం అందిందని ట్రంప్ చెప్పారు. ఆయనతో మరో దఫా చర్చలు ఉండవచ్చని తెలిపారు.

రెచ్చగొడుతున్న ట్రంప్: కమలా హారిస్

ట్రంప్ రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తూ ఆనందం పొందుతున్నారని డెమొక్రాటిక్ పార్టీ కాంగ్రెస్ అభ్యర్థి కమలాహారిస్ విమర్శించారు. అమెరికన్లను రెచ్చగొట్టడమే ఆయన విధానంగా ఉంటోందని అన్నారు.

సుష్మకు వెయ్యి దీపాలతో భుటాన్ రాజు నివాళి

థింపూ: కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మాజీ మంత్రి సుష్మాస్వరాజ్‌కు భుటాన్ రాజు జిగ్మే ఖేసర్ నమ్‌గ్యాల్ వాంగ్‌చుక్ ఘనంగా నివాళులర్పించారు. సిమ్‌థోకా డోజోంగ్‌లో ఆమె స్మారకార్థం జరిగిన కార్యక్రమంలో భుటాన్ రాజు వెయ్యి దీపాలను వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. భారత్ భుటాన్‌ల మధ్య సంబంధాలు బలపడేందుకు సుష్మాస్వరాజ్ ఎంతో కృషి చేశారని, ఆమె అరుదైన నాయకురాలని కొనియాడారు.

రక్షణశాఖ పురుష సిబ్బందికీ సీసీఎల్ సెలవులు

దిల్లీ: వైకల్యంతో బాధపడుతున్న తమ పిల్లలను చూసుకునే నిమిత్తం రక్షణ విభాగాల్లో పనిచేసే ఒంటరి పురుషులకు కేంద్రం సెలవులను మంజూరు చేసింది. ఈ 'చైల్డ్ కేర్ లీవ్ (సీసీఎల్)' ప్రతిపాదనకు రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ శనివారం ఆమోదం తెలిపారు. ఇప్పటివరకూ మహిళా సిబ్బందికి మాత్రమే ఈ సెలవులు వర్తించేవి. మరోవైపు- కనీస సీసీఎల్ సెలవులను 15 రోజుల నుంచి 5 రోజులకు కుదించారు. 40% వైకల్యంతో బాధపడుతున్న 22 ఏళ్లలోపు సంతానానికి ఉద్దేశించి మాత్రమే ఈ సెలవులు వర్తించేవి. ఇప్పుడు ఆ వయో పరిమితిని ఎత్తివేశారు.

కశ్మీరీ వధువులపై వ్యాఖ్యల వివాదంలో ఖట్టర్

- సీఎం రాజీనామాకు కాంగ్రెస్ డిమాండ్

చండీగఢ్/దిల్లీ: జమ్మూ-కశ్మీర్‌కు ప్రత్యేక హోదా తొలగింపు నేపథ్యంలో ఆ రాష్ట్ర యువతులను ఇతర రాష్ట్రాల యువకులు వివాహం చేసుకొనే అవకాశం లభిస్తుందంటూ కొందరు భాజపా నాయకులు చేసిన వ్యాఖ్యలపై తీవ్ర విమర్శలు వస్తున్నాయి. హరియాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్, రాజ్యసభ ఎంపీ విజయ్ గోయెల్ కూడా దాదాపు ఇవే తరహా వ్యాఖ్యలు చేశారనే వివాదంలో చిక్కుకున్నారు. ముఖ్యమంత్రి పదవికి ఖట్టర్ రాజీనామా చేయాలని మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సుష్మితా దేవ్ డిమాండ్‌చేశారు. మహిళలను కించపరిచేలా మాట్లాడే భాజపా నాయకులపై ఆ పార్టీ నాయకత్వం చర్యలు తీసుకోవాలని బీఎస్పీ అధ్యక్షురాలు మాయావతి కోరారు. ఖట్టర్, విజయ్ గోయెల్ వ్యాఖ్యలు మహిళల గౌరవానికి భంగం కలిగించేలా ఉన్నాయని ఆక్షేపించిన దిల్లీ మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ స్వాతి మలివాల్ వీరిద్దరిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆరెస్సెస్ శిక్షణ ఇలా ఉందంటూ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ విమర్శించటంపై మనోహర్‌లాల్ ఖట్టర్ మండిపడ్డారు. స్త్రీ, పురుషుల నిష్పత్తి సమానంగా ఉంటే యువకులకు పెళ్లిళ్లు కావన్న సమస్య ఎదురుకాదని తాను చెప్పిన మాటలను మీడియా వక్రీకరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసత్యాల ఆధారంగా విమర్శలు చేయటం రాహుల్ గాంధీ వంటి నేతకు తగదని అన్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00